UNIVERSAL
LIBRARY
OU_206132
UNIVERSAL
LIBRARY

OUP 23-4-4-69—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 320/H38R Accession No. T 2476

Author హనుమంతరావు

Title రెండో ప్రపంచ యుద్ధము. 1940.

This book should be returned on or before the date last marked below

శ్రీకేసరి గ్రంథమాల. ౨.

# రెండో ప్రపంచ యుద్ధమా?

మొదటి



భాగము.

[illegible] నామ సంవత్సర భాద్రపదము

(సెప్టెంబరు ౧౯౪౦.)


[illegible] హనుమంతరావు

సుల్తాన్ బజారు, హైదరాబాదు (ద)

# సంపాదక వర్గము.

శ్రీ బూర్గుల రంగనాథరావుగారు.

శ్రీ అందుగుల తిరుమలరావుగారు.

శ్రీ అవురుపల్లి కృష్ణారావుగారు.

# 'ఆంధ్రకేసరి

బిరుదాంకితులు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులునగు మ. రా. టంగుటూరి ప్రకాశంపంతులుగారి

## సందేశము.

ఆంధ్రకేసరి గ్రంథమాల ప్రథమ కుసుమమైన "కన్నుతెన్నురలు" కృతజ్ఞతతో అందుకున్నాను. హైదరాబాదు సంస్థానములోని ఆంధ్రయువకులు, భాషాభివృద్ధికి, ఆంధ్రవిజ్ఞానాభివృద్ధికి ఈ గ్రంథమాల ద్వారా జనసామాన్యమునకు సేవచేయ సంకల్పించు కోవడం చాలా సంతోషకరమైన విషయం. వారి ప్రయత్నం పూర్తిగా నెరవేరి హైదరాబాదు ఆంధ్రులలో తెలుగుభాషయందు ఆసక్తి వృద్ధిపొందునుగాక యని నమ్ముచున్నాను.

పూనా.
౨౭-౭-౪౦.

టం. ప్రకాశం.

# పత్రికాభిప్రాయములు.

‘ఽ స్వ తె స్వ ర లు’.

“కథలు మంచిరసవంతంగా వున్నాయి. రచనా విధానంలో వ్యావహారిక భాష/ ప్రమీల [illegible] పుత్రుల వ్యావహారిక తెలుగురచనకు వన్నె తెచ్చారు. ఈపుస్తకం అన్నివిధముల సంపాదకుల ఆశయాలకు ప్రదీపనమును చేస్తోంది.”

‘గృహలక్ష్మి’.

“మెచ్చుకోదగినరీతిగా యీకథలను తీర్చినారు, ఈయువకసోదరులు భావి కాలంలో ఇంకా మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించే లక్షణాలు వ్యక్తపరిచినారు. మంచి ఆరితేరినకలాలు వ్రాసేరీతిగా ‘ఆడివాప’ ‘నిష్ఫలం’ ‘ఎందుకు?’ అనే కథలున్నవి.........ఈకథలలో చాలామంది తెలంగాణాలోని వ్యావహారిక తెనుగును ఉపయోగించినారు, దానికి మేము హర్షించినాము.”

‘గోలకొండ పత్రిక’.

ఈరచయితలు “ఇంకా కథచెప్పే పొందుపును చేజిక్కించుకొని, ప్రపంచానుభవాన్ని కవితాసుందరంగా చెప్పగలరనే ధైర్యమునకున్నా ఈ గ్రంథ మవకాశమిచ్చుచున్నయది.”

‘ఆంధ్రవారపత్రిక’.

“ ఈ పదికథల్లోనూ రోమాన్సు, హాస్యం, సంస్కరణ, ఆత్మచరితం, రాచకీయం,—ఇట్టివెన్నో రూపాలు పఠితకు పొడకట్టుతాయి. ఎత్తుకున్న విషయాన్ని పోషించటానికి తగు యత్నం ప్రతికథలోనూ ప్రస్ఫుటమవుతుంది.

ఇందులో—‘అంతే, నా నోము’—‘సత్యాగ్రహం’—‘మా బావ’—‘టాకీలో సమావేశం’—ఇవి సర్కారాంధ్రులక్కూడా అనర్గళంగా చదువ వీలయ్యే రమ్యమైన వ్యావహారికంలో సాఫీగా నడిచాయి. తక్కినవి నిజాం ప్రాంతీయమైన వాడుకభాషలో వున్నాయి.

‘ఆడిపాప’ కథ నైజాంరాష్ట్రంలోని ఒక దురాచారానికి సంబంధించింది.

ఇట్లు ఈ గ్రంథము నిజాము రాజ్యములో ప్రవాహిక ఐన భాషనూ, ప్రచారమందున్న ఆచారాల్ని తెలుసుకోడానికి చక్కగా అనుకూలిస్తూ వుంది”.

‘ ప్రజామిత్ర ’.

“ఈకథలలోని విషయము సామాజికాచార వ్యవహారాదులకు సంబంధించినది. నిష్ఫలం, నూమూర్తిధర్మం అనే కథలలో మానసిక స్థితి నిరూపణము కొద్దిగా ఉన్నది. కథలు సుబోధముగా ఉండి కాలక్షేపానికి బాగా పనికి వచ్చేవే అయినా ఎక్కడా అసభ్యత దొరలకుండా ఉండడము గొప్ప సుగుణము. నైజామురాష్ట్ర వ్యావహారిక భాషతో పరిచయము లేనివారికి ఈగ్రంథములో ఉన్న భాష అక్కడక్కడ నట్టుతుంది. ఒకటిరెండు కథలు చదివేసరికి పదముల అంతములెట్లవో తెలిసిపోవడమువల్ల పోనుపోను భాష సుఖమవుతుంది. కొన్ని మాటలు కొత్తవయినా సందర్భాన్నిబట్టి వాటి అర్థము తెలుస్తుంది. కొన్ని పలుకుబడులు కొత్తగా ఉంటవి. తోలుకురావటం మన ప్రాంతాలలో మనుష్యుల పరంవాడరు. క్రియాప్రత్యయాంతాలు అక్కడ హ్రస్వములు. వస్తరు—చూస్తరు అని ఉంటవి.

ఈరీతిగా కవులూ గ్రంథకర్తలూ ఆయాప్రాంతీయభాషలు చక్కగా వాడుకచేస్తూ గ్రంథాలు రచించి ప్రకటిస్తే ఆంధ్రభాషాస్వరూపము బాగా తెలుస్తుంది.

ఈగ్రంథమాల మంచిమంచి పుస్తకాలు తరుచుగా ప్రకటిస్తూ వృద్ధిలోకి రావలెననీ సంపాదకుల ఆశయాలు నెరవేరవలెనని కోరుతున్నాము”.

‘ ప్రతిభ ’.

# తొలి పలుకు.

మా గ్రంథమాల ప్రథమ సుమమగు కథలసంపుటి "కమ్మ తెమ్మెరల"ను ఆంధ్రలోకము ఆదరించినది. ఆదరించి, యిప్పుడు ఈ "రెండో ప్రపంచ యుద్ధమా?" అను ద్వితీయ ప్రచురణమునకు పురికొల్పినది.

ఈ గ్రంథము అతిత్వరితముగా రచింపబడినది. ఎందుకనగా దీని రెండవభాగము ఇంతకన్నను తొందరగా వ్రాయవలసియుండెను. వివిధరాజ్యముల యొక్క వాదములను, దేశములయొక్క స్థితిగతులను ౧౯౧౪ నుండి ౧౯౪౦ వరకు జరిగిన సంధి సంప్రతింపులను, ఆ మూలాగ్రముగా ఉదహరించి, విషయములను కూలంకషముగా చర్చింపకున్నను పుస్తకము ఇంతగా పెరిగిపోవుటచే దీనిని రెండుభాగములలో ముద్రింపవలసివచ్చెను. అయినను ముఖ్య విషయములేవియు వదలివేయబడలేదు. ప్రకాశకుల యొక్కయు, గ్రంథకర్త యొక్కయు అభిప్రాయము, మొదటినుండియు పత్రికలు చదువలేక అంతర్జాతీయ పరిస్థితులను తెలిసికొనక యుండిన సర్వసామాన్య అక్షరాస్యులకుగూడా ఈ పుస్తకము సుబోధకముగా నుండవలయునని. విద్యార్థులకు గూడ సహాయకారియగునని మా తలంపు. సాధ్యమయినంతవరకు వ్యావహారిక భాష వాడబడినది.

దూరమునుండి, ఒక బంతి ఆటను జూచినతరువాత, కేవల నిష్పాక్షిక దృష్టితో దానిని వర్ణించు పగిది, యూరపులోని రాజకీయ చదరంగపుటాడ కాండ్ర యెత్తులను వివరించి, తమ యభిప్రాయమును పాఠకులపై రుద్దక, వారినే సర్వము ఊహించుకొనునట్లుగా గ్రంథకర్తగారు ఈ పొత్తమును వ్రాసిరి.


మా గ్రంథమాలకు వీరొనర్చిన సహాయము అమితము. పుస్తకము వ్రాయుటేగాక ప్రూఫులనుగూడ, శ్రమకోర్చి, దిద్దిపెట్టిన వీరికినీ, ఈ గ్రంథమును ముద్రించుటకు తోడ్పడిన మహాశయులకు, మా ఆత్మసమర్పిత కృతజ్ఞతా వందనములు.

ఇట్లు

ప్రకాశకులు.

# విషయసూచిక.


| | | పుట. |
|---|---|---|
| ౧. | యుద్ధజూదములో సంచేము లేసుటి? | ౧ |
| ౨. | వెర్సాయిల్సు సంధి. | ౭ |
| ౩. | జర్మనీ తలయెత్తింది. | ౧౯ |
| ౪. | లీగుకు అగ్నిపరీక్ష. | ౩౪ |
| ౫. | సమిష్టి క్షేమవిధానము. | ౫౬ |
| ౬. | సమిష్టి క్షేమమే శరణ్యము. | ౭౬ |
| ౭. | సాంత్వన నీతి. | ౯౨ |
| ౮. | క్షణిక శాంతి. | ౧౧౮ |


ఆర్కిటిక్ మహాసము
కనడా
ఉత్తర
పసిఫిక్ మహాసము

# రెండో ప్రపంచ యుద్ధమా?

---

## యుద్ధజూదములో పందెము లేమిటి?

ఇద్దరు సైనికులు—ఒకడు బ్రిటిషు, ఒకడు ఫ్రెంచి—ముఖాలకి విషవాయు కవచాలు తగిలించుకుని నిశ్శబ్దవేగంగా తోసుకుపోతున్నారు. చేతుల్లో హేండగ్రెనేడులు (చేతితో విసర బడు బాంబులు) భుజాలకు తుపాకులు. అడుగడుక్కీ వారు ఆత్రంతో దిక్కులు స్తనశల్య పరీక్షగా చూస్తున్నారు ఏ మూల నుంచి శత్రువు తలయెత్తుతాడో అని. చీకటి తెర ఆశాంతము లను కనబడకుండా చేసేసింది. వారు గుసగుసలుకూడా చేసు కోడంలేదు. గాలికి చెవులున్నాయేమో! ఎక్కడనుంచి ఊడి పడ్డారో కాని తమోగర్భం చీల్చుకుని ఇద్దరు జర్మన్ సైనికులు వెనకటివారివలెనే వికృత ముఖాలు ధరించి ఆపాదమస్తకం మారణసాధనాల్తో సమీపిస్తున్నారు. ఉభయులూ వీరావే శంతో ఒళ్ళు మరచి ప్రతిపక్షులవంక పరుగెత్తుతున్నారు. వారి చేతులు అప్రయత్నంగానే శత్రువునిగురి చూస్తున్నాయి. క్షణకాలంలో అక్కడ 'హా' యను ఆర్తనాదమూ, ఒక వెఱ్ఱికేక; నాలుగు మిడిగుడ్లుపడ్డ వీరమానవశవాలు. అంతా నిశ్శబ్దము. ఇంతట్లో ఏమూలనుంచో ఒక అదృశ్య భైరవనినాదము విన బడింది. "ఆగండి! ఈశ్మశాన రంగం నాది. నా అనుజ్ఞ లేకుండా మీరిక్కడ చావడానికి వీలులేదు. మీరెవరు? ఎందుకు అన్యోన్యం భస్మీపటలం చేసుకుంటున్నారు? చెప్పండి చెపితే

కాని మీచేతుల్ని స్తంభింపచేసేస్తాను." అన్నది ఆ భయంకర ధ్వని.

అప్పుడు జర్మన్ సైనికులన్నారు "మేము ఏ పాపమూ ఎరుగని జర్మనీ ప్రజలము. ఈ ఇంగ్లీషువారు ఫ్రెంచివారూ మమ్మల్ని ఇరవైఏళ్ళక్రింద యుద్ధంలో మోసంచేసి ఓడించారు. అప్పటినుంచీ మమ్మల్ని తలయెత్తనీకుండా తిరగ నీయరు. మా కాళ్ళుచేతులు కట్టిపారేశారు. మేము ఎట్లాగో కాలూ చెయ్యీకూడా తీసుకుని లేవబోతూంటే వీళ్ళకు కంటకంగా ఉంది. మమ్మల్ని అణిచిపెడదామని చూస్తున్నారు. మా దేశాన్ని నాలుగుమూలలనుంచీ 'గిరి' (encircle) వేసి కూర్చున్నారు. మా వ్యాపారం సాగనీయరు. పైగా మమ్మల్ని 'బ్లాకేడు' (తిండికి, పరిశ్రమలకు కావలసిన పదార్థాలను స్థలాంతరములనుండి రానీయకుండ) చేసి మాకు అన్నం దొరకకుండా చేస్తారట. మా ఆడవాళ్ళూ పిల్లలూ అన్నంలేక అలమటిస్తూంటే మేము చూసి ఊరుకోగలమా? మా వీరజాతి చావైనా ఎదుర్కొంటుందికాని కలుగులో ఎలకల్లాగపడి ఉండమంటె మేము ఎన్నాళ్ళు సహించగలము? మాకు వ్యర్థపు బ్రతుకుకన్న ఆత్మగౌరవంతో చావు మేలని మా విశ్వాసం" అన్నారు.

బ్రిటిషుసైనికుడు తన పక్షాన, తన ఫ్రెంచిమిత్రుడి పక్షాన ఇట్లా చెప్పాడు. "చూశారా! ఫ్రాన్సూ, నా దేశము కూడా శాంతినే కోరుతున్నాయి. ఈ మాట ప్రపంచకంలో ఎవరినైనా అడిగిచూడండి. జర్మనీవారిని మేము వెనకటి యుద్ధంలో మోసంచేసి ఓడించామనడం శుద్ధ అబద్ధం. వారిని

# యుద్ధజూదములో పందెములేమిటి ?

చితక ఓడించామన్న దానిలో సందేహంలేదు. వారిని అణచి పెట్టడానికి కొంత కారణం లేకపోలేదు. లోకంలో గెల్చిన వారు ఓడినవారిని ఎట్లా చేస్తున్నారో మేమూ అంతే చేశాము. అదీగాక మా మిత్రులు ఫ్రెంచివారికి జర్మనీ వారంటే భయము అపనమ్మకమూ పోలేదు. ఒక్క ఫ్రెంచి ప్రాణికి రెండేసి జర్మను ప్రాణాలు జర్మనీలో ఉన్నాయి. వారంతా యుద్ధమే వృత్తిగాకలవారు. అందుచేత ముందు ముందు అపాయం రాకుండా ఫ్రెంచివారు ఆత్మరక్షణకై కొన్ని కట్టుదిట్టాలు చేసుకోడంలో తప్పేముంది. ఇందులో జర్మనీని గిరివేసే ప్రయత్నం ఏముంది? ఇదంతా అబద్ధపు ప్రచారం. అసలు జర్మనీవారి ఎత్తు వేరు. వారికి మా సామ్రాజ్యాలు చూస్తే కన్నెఱ్ఱగా ఉంది. కడుపునిండా మేసిన లేళ్ళను చూస్తే ఆకలితో నకనకలాడే తోడేళ్ళకు ఎట్లా ఉంటుందో వీరికట్లా ఉంది. జర్మనీవారి ముఖ్యావసరాలకు మేము ఎప్పుడూ అడ్డురాలేదు. వారు చుట్టుపట్ల చిన్న జాతుల్ని ఎంత వేధిస్తూన్నా మేము తటస్థంగా ఊరుకునే ఉన్నాము. కాని వారు మా సామ్రాజ్యాలకే ఎసరుపెట్టి మా ప్రత్యేక ప్రమేయాలమీద పడబోతూంటే మేము కళ్ళప్పగించి చూస్తూ ఊరుకుంటామా? ఇప్పుడు జర్మనీవారు నెగ్గడమే తటస్థిస్తే మా సామ్రాజ్యాల మాట ఎటున్నా మా స్వాతంత్ర్యమూ, మా అస్తిత్వము, మా నాగరికత, ప్రజా పరిపాలనా సంస్థలు ఇవన్నీ రూపుమాసిపోయి మేము పూర్వ కాలంలో వలెనే ఏ పెద్దజాతులకో బలిఅయిపోమా? మేము కూలిపోవడంఅంటే ప్రపంచం కూలిపోయిందన్నమాటే కదా?

జర్మనీ నెగ్గిందంటే ప్రపంచకంలో వ్యక్తిస్వాతంత్ర్యమూ, వ్యక్తిజీవితమూ ఇంకా తలెత్తుకుని ఉండగలవా? మా ప్రాణ ప్రమేయాలు కాపాడుకోడానికే, మా స్వతంత్ర్యస్థితి నిలుపుకోడానికి మేము చావుకి వెరవక పోట్లాడుతున్నాము" అన్నాడు.

మరోకమూలనుంచి ఒక ఇటాలియన్ సైనికుడు ఊపిరి బిగపట్టుకుని వస్తున్నాడు. జర్మనీసైనికుల ఆసరా చూసుకొని ఆతడు ధైర్యంతో తుపాకి బారు చేశాడు, బ్రిటిషు సైనికుని వంక. కాని చెయ్యి కదలలేదు.

"ఆగు ! ఎవరు నువ్వు; నీ వృత్తాంతం ఏమిటి?"

ఇటలీసైనికుడన్నాడు "మేము రోమనుల సంతతివారము. ఒకప్పుడు మా పూర్వీకులు నాగరక ప్రపంచకాన్నంతనీ గడగడలాడించారు. కాని మేము ఇప్పుడు జానెడు బెత్తెడు నేలలోపడి మగ్గిపోతున్నాము! ఈ బ్రిటిషువారూ, ఫ్రెంచివారూ ప్రపంచకంలో ఉన్న సారవంతమైన దేశాలన్నీ ఆకట్టుకున్నారు. మాకు స్థలం దొరకదు. మాకు ఆఫ్రికా ఎడారులు మాత్రమే మిగిల్చారు. మా ఇంటిచుట్టుపట్లఉన్న మధ్యధరా సముద్రంలో కూడా బ్రిటిషువారిదీ, ఫ్రెంచివారిదీ ఆధిపత్యం ఉండాలా? ఇక్కడైనా మా నిరంకుశాధిపత్యం ఉండనీయ్యకూడదా? ఇప్పుడు ఫాసిస్టులు (ముసోలినీ పక్షంవారు) మునుపటి కళాభాయిష్ఠులైన ఇటాలియనులు కారు. ఫాసిస్టులు చిచ్చరపిడుగులు. జర్మనీతో కలిసి మేము యూరపుని పునర్నిర్మాణం చేస్తాము. ఆంగ్లో-ఫ్రెంచికు తంత్రాలు, ప్రపంచనాయకత్వమూ ఇంక చెల్లనియ్యము. మాకు రోమను సామ్రా

జ్యంవంటి సామ్రాజ్యంకావాలి. అని బ్రిటిషువారిచ్చినాసరే. ఫ్రెంచివారు ఇచ్చినాసరే."

అదృశ్యరూపము వికటంగా నవ్వింది.

చీకట్లో ఎవరో ఇద్దరు గుడ్డి లాంతరు సహాయంతో నేలమీద ఏమిటో గీస్తున్నారు. ఒకడి చేతిలో బుట్ట ఉంది.

"ఎవరు మీరు, ఏంచేస్తున్నారు? నిల్చి సమాధానం ఇవ్వండి!"

ఆ వ్యక్తులన్నారు "నాపేరు స్టాలిన్. ఇతడు మోల టోవ్ (Molotov). నేను ముగ్గుతో సరిహద్దులు గీస్తున్నాను. సోవియటురాష్ట్రపు సరిహద్దుల్ని ముందుముందుకి నెట్టగలుగు తున్నాను. యూరపు ఎటుపోయినాసరే. మారాజ్యానికి యుద్ధపు దెబ్బతగలనియ్యము. మేము ఒకరి జోలికి పోము. మామీద ఈగవాలితే తుపాకినేస్తాము. అదీగాక మాకు ఈ యుద్ధంతో పనేమిటి. ఇది రెండు సామ్రాజ్యాలనడుమ పోరాటం. ఇది రెండవ సామ్రాజ్యవాద సంగ్రామం. ఈ పేదసైనికుల్ని అన వలసినపనిలేదు. వారెందుకు యుద్ధంలోకి దూకుతున్నారో వారికేతెలియదు. వారి దేశక్షేమమునకు అపాయం కలిగిం దని వారు నమ్ముతున్నారు. సామ్రాజ్యవాద దేశాల్లోఉన్న నిర్భాగ్యప్రజల్ని అన్యోన్య మారణమునకు ప్రేరేపించిన ధన స్వాముల్ని నిందించాలి. ఈయుద్ధం ఒకందుకు మేలే. భూస్వా మిక ధనస్వామికవర్గ సంగ్రామంలో నిర్వీర్యమైపోతే మేము లోకక్షేమం కోరి సోవియటు (రష్యా) విధానం అండక్రింద యూరపును తీసుకుంటాము. కమ్యూనిజం (సామ్యవాద అతి వాదము) లో కాని యూరపుకి ముక్తిలేదు. అటువంటి

తరుణం వచ్చేదాకా మేము ఏ పక్షానికీ సహాయంగా యుద్ధంలో కాలుపెట్టము. అలసిసొలసి పడిపోయిన ప్రజా వర్గాన్ని ఉద్ధరిస్తాము.”

అదృశ్యవ్యక్తి భయంకరంగా ఉరిమింది. ఆ సైనికుల చేతుల్లోని ఆయుధాలు, ముఖాలకి కప్పిన విషవాయు కవచాలు, మోలటోవ్ చేతిలోని ముగ్గుబుట్ట ఎవరో ఊడపెరుకు కున్నారు. వారంతా ఒకర్ని చూసి ఒకరు పళ్ళుకొరుక్కున్నారు. పిడికిళ్ళు బిగించారు. కాని ఏమీ చెయ్యలేక మైదానంలో చతికిలబడ్డారు.

జర్మనీ ఆక్రోశసంచాటున యూరపుసామ్రాజ్యం కోసం దేవుళ్లాడుతూంది. ఫ్రాన్సు బ్రిటనులు తమ సామ్రాజ్య ప్రమేయాలూ, స్వాతంత్ర్య నాగరికతలూ పందెంగా చూసుకుంటున్నాయి. రోమను సామ్రాజ్యంలాంటిది ఒళ్ళో పడుతుందని ఇటలీ నోరు తెరుచుకు కూచుంది. విశ్వవ్యాప్తమైన కమ్యూనిజంకోసము శుభముహూర్తం సమీపిస్తూందని సోవియటు ఉవ్విళ్ళూరుతూంది.

ఒక్క ఒరలో ఇన్ని కత్తులు ఇముడుతాయా! భావి యూరపు విధానాన్నంచి ఇంతమంది ఆశాపరులు ఇన్ని పళ్ళు పుణుక్కోగలరా! కాలగర్భంలో ఏముందో జ్యోస్యం చెప్ప గల సాహసికుడెవడు? యూరపు నేటి దురంత భయంకర అగాధంలో ఎట్లా పడిందో తెలుసుకుంటే భావి యూరపు భాగ్యాన్ని ఎట్లా దిద్దవలసి ఉంటుందో చూచాయగా ఊహించ వచ్చును.

# ౨. వెర్సాయిల్సు సంధి.

నిరంతరంగా ఆరకుండా మండేదాన్ని మనలో రావణా సురుడి కాష్టం అని చెప్పుకోవడం ఉంది. ప్రపంచ మహాయుద్ధం ముగిసినతర్వాతకూడా యూరపు ఖండము రావణాసురుడి కాష్ఠంలాగే ఉండిపోయింది. మంటలు జాజ్వల్యమానంగా అయితే లేవు. ఈ చితాగ్నివద్ద 'వెర్సాయిల్సుసంధి' అనే మంత్రాన్ని ఊది, అంతర్జాతీయ సమితి అనే మంత్రోదకం ప్రోక్షించారు. కొన్నాళ్ళు ఈ రావణాసురుడి కాష్ఠం బాగా పొగలు విడుస్తూనే ఉంది. క్రమంగా ఇది చల్లారింది అనుకున్నారు. అది నిజంగా కొడిగట్టిందికాని నిశ్శేషంగా ఆరిపోలేదు. తిరిగి ౧౯౩౩ నుంచీ ఈ కాష్ఠంలో పొగ రావడం మొదలుపెట్టింది. దీనిని విసరి మంటలుచేస్తూన్న వ్యక్తుల్ని లోకం త్వరలో కనిపెట్టలేకపోయింది. కనిపెట్టికూడా ఒక్కొక్కప్పుడు ఉపేక్ష చేసింది. ఫలితం మళ్లీ వెంటనే అనుభవంలోకి వచ్చింది యూరపు ప్రజలకు.

'పాపాల కన్నింటికీ భైరవుడన్నట్లు యూరపుయొక్క దుస్థితికంతకూ వెర్సాయిల్సు (Versailles) సంధియే మూలకందం అని సామాన్యంగా అనుకుంటారు. దూరదృష్టిగల రాజనీతిజ్ఞులుకూడా సదరు సంధివలన అనర్థ పరంపర కలుగుతుందని చాలా సంవత్సరములనుంచీ వరాకు చెప్పుతూనేఉన్నారు. ఏ దుర్ముహూర్తంలో సంధిపత్రంమీద సంతకాలు చేశారో కాని ఆ ముహూర్తంనుంచీకూడా దీనిని రద్దుచేయించాలనే దీక్ష జర్మనీజాతిలో వేళ్ళు పాతుకుపోయింది. ఇది జర్మనీ ప్రభుత్వముల విదేశాంగనీతిలో ప్రథమసూత్రం, ఏకైక

లక్ష్యంగా తయారయింది. "వెర్సాయిల్సును ప్రత్యక్షరమూ తుడిచిపెట్టించాలి. అంతవరకూ శాంతిలేదు. ప్రయత్నాలకు స్వస్తి చెప్పకూడదు. వెర్సాయిల్సు నిర్ణయాన్ని ఏవిధంగానైనాసరే అంగీకరించినవాడు జర్మనీ దేశపు ద్రోహి. వాడు జాతీయవాది కానేకాడు. వెర్సాయిల్సు సంధిని కూలద్రోసినవాడే నిజమైన జర్మను జాతీయుడు" ఇంత దీక్ష జర్మనీలో బయలుదేరింది.

ఎందుకు వెర్సాయిల్సు శత్రువులచేత, మిత్రులచేత కూడా గర్హింపబడింది? పై సంధి విషయం చర్చించే లోపుగా దీనికి ఉపోద్ఘాతమైన ప్రెసిడెంటు విల్సనుయొక్క పదునాలుగు సూత్రాలను పరామర్శించాలి. గత మహాయుద్ధంలో అమెరికావారు కాలుపెట్టేముందర మహోన్నత ఆదర్శాలను దృష్టిపథంలో పెట్టుకొని దిగారు. విల్సను మహాశయుడు వీటిని ౧౪ అంశాల క్రింద సూత్రీకరించాడు. అన్యోన్య వైరములతోను స్పర్ధలతోను నరకప్రాయంగా మారిపోయిన ప్రపంచానికి క్రొత్త దారి చూపెట్టి శాంతి సౌభాగ్యాలు ఇతోధికంగా నెలకొనేటట్లు ప్రపంచాన్ని పునర్నిర్మాణం చెయ్యడం ఆతని మహత్తరాదర్శం.

విల్సనుగారి పదునాలుగు సూత్రాలుక్రింద ఇస్తాను.

౧. సంధిపత్రాలు బహిరంగంగా వ్రాసుకోవాలి. ఇటుపైన అంతర్జాతీయ వ్యవహారాల్లో రహస్యసంధి నిర్ణయాలు ఉండకూడదు.

౨. సముద్రాలమీద ప్రయాణాలకు ఎంతమాత్రమూ నిర్బంధం ఉండకూడదు. శాంతిసమయంలో కానీ యుద్ధ

సమయంలో కానీ ఈ నియమం ఆచరణలో ఉండాలి.

౩. వీలైనంతవరకూ దేశాలనడుమ వ్యాపార నిర్బంధాలు తొలగించి వేసెయ్యాలి. ఈ సంఘకి అంగీకరించే దేశాలన్నిటికీ వ్యాపారవిషయంలో సమానావకాశాలు ఉండాలి.

౪. రాష్ట్రములయొక్క ఇంటి కాపుదలకోసం తప్పనిసరిగా తోచిన ఆయుధాలు మినహాయించి మిగిలిన ఆయుధాలను తగ్గించివేయడానికి హామీలు ఇచ్చి పుచ్చుకోవడం.

౫. కాలనీలపరిష్కారము నిష్పాక్షికముగాను, విశాల హృదయంతోను, స్వతంత్రంగాను జరగాలి. ఆయా వలస దేశాలను విభాగించడంలో అచ్చటి ప్రజా సమూహము యొక్క యోగక్షేమములకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

౬. రష్యా ప్రాంతములోనుంచి అన్య సైనికవర్గమును ఉపసంహరించుకొని, రష్యాప్రజలు కోరుకొనేటట్లు వారి రాజకీయ విధానాన్ని ఏర్పరచుకోడానికి వారికి సంపూర్ణ హక్కు అంగీకరించడం.

౭. బెల్జియంలోనుంచి సైన్యాలని ఉపసంహరించుకొని బెల్జియం దేశాన్ని పునరుద్ధారణం చెయ్యడం అంతర్జాతీయ విశ్వాసం స్థాపించడానికి అత్యవసరము. బెల్జియంప్రభుత్వమునకు సర్వాధికార ధూర్వహత్వంలో లోటు ఉండకూడదు.

౮. అల్సాస్—లారేన్ (Alsace-Lorraine). ప్రాంతం ఫ్రాన్సుకు వాపసుచెయ్యాలి.

౯. ఇటలీ సరిహద్దుల్ని జాతీయ సూత్రములకు అనుగుణంగా సరిదిద్దాలి.

౧౦. ఆస్ట్రియా – హంగేరీ సామ్రాజ్యంలోని విభ

ప్రజలు స్వతంత్రంగా వృద్ధిపొందడానికి సంపూర్ణావకాశం లభించాలి.

౧౧. బాల్కను రాష్ట్రాల విషయము.

౧౨. ఆటొమన్ (Ottomon) సామ్రాజ్యంలోని టర్కీ ప్రాంతం సంపూర్ణాధికారంగల ప్రభుత్వంగా ఉండవచ్చును. ఆ సామ్రాజ్యంలోని ఇతర జాతులు, [illegible] కోరుకొన్నట్లు స్వతంత్రంగా వృద్ధిపొందడానికి ఏర్పాటు చెయ్యాలి.

౧౩. పోలండును స్వతంత్రరాష్ట్రంగా నిర్మించాలి. నిస్సందేహంగా పోలిషు ప్రజలు నివసించే ప్రదేశాన్ని తొలిచిన ప్రాంతాలన్నీ ఈ రాజ్యంలో కలపవచ్చును. పోలిషు ప్రజలకు సముద్రంతో రాకపోకలు ఉండడానికి స్వతంత్ర ఏర్పాట్లు చేయవలెను. పోలిషు రాష్ట్రము యొక్క ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యమునూ, సరిహద్దుల సంరక్షణాన్నీ ప్రపంచ ప్రభుత్వములన్నీ హామీపడాలి.

౧౪. ప్రత్యేక షరతులమీద నానాజాతి సమితిని స్థాపించాలి. చిన్నదైనా పెద్దదైనా భేదం లేకుండా రాజ్యములన్నిటికి సమముగా పరస్పర సహాయ హామీలు ఆచరణలోనికి తేవడము, వాటి రాజకీయ స్వాతంత్ర్యమూ, సరిహద్దుల రక్షణల, సమకూర్చడము ఈ సమితి యొక్క ఉద్దేశము.

ప్రెసిడెంటు విల్సను మహాశయుడు ప్రచారంలోకి తెచ్చిన ఉదాత్తసూత్రాల్లో తలమానికమైనది స్వయం నిర్ణయసూత్రము. విల్సను దీనిని ఇట్లా నిర్వచించాడు. "ప్రజా సమూహములను, వారి జీవప్రాంతములు, ఒకప్రభుత్వాన్నుంచి మరియొక ప్రభుత్వానికి వాయనాల్లాగ అందించ

కూడదు. సరిహద్దు నిర్ణయాలు చెయ్యడంలో ఆయా ప్రాంత వాసులైన ప్రజలయొక్క యోగక్షేమములే ప్రాధాన్యం వహించాలి. సుస్పష్టమైన ఏముగల జాతీయ భావములన్నిటికి సంపూర్ణ సానుభూతియు సంతృప్తియు కలిగించాలి. అన్యోన్య విభేదములకూ, వైరములకూ తావిచ్చే క్రొత్త సమస్యల్ని ప్రవేశ పెట్టడంగాని, పూర్వశత్రుత్వాన్ని నిలబెట్టడంగాని ఈ ఉద్యమానికి విరుద్ధము."

విల్సను ప్రోక్తమైన వివిధసూత్రాలు యుద్ధంవల్ల హాహాకారములచేత చిల్లులుపడిపోయిన ప్రపంచ వాసుల చెవులకు అమృతసేచనంగా అనిపించాయి. జర్మనీవారు చాలా అలసిపోయారు. ఇంక ఓటమితప్పదని తెలుసుకున్నారు. తమ సైన్యాలు పూర్తిగా కుప్పకూలకముందే యుద్ధవిరామం సమకూర్చుకోవాలని లూడెండార్ఫ్(Ludendorff)సేనాని ఆలోచిస్తున్నాడు. అతనికి విల్సనుసూత్రాలు ఆపదలో అక్కరకువచ్చాయి. ఓడిపోతూన్న జర్మనీమీద దుర్భరమైన సమరశాంతులు విధించకుండా విల్సన సూత్రాలను డాలుగా ఉపయోగించుకోవచ్చునని ఆ కుశాగ్రబుద్ధి ఊహించాడు. 'విల్సను ప్రకటించే సూత్రాలకు బద్ధమై జర్మనీసైన్యము శస్త్రసన్యాసం చేస్తూంద'ని తన తెలియపరచాడు.

అయితే విల్సను సూత్రములు వెర్సాయిల్సు సంధిలో ఎంతవరకు ఖతపరుపబడ్డాయి? ఇక్కడే చిక్కు వచ్చింది. విల్సనుఅనుకొన్నది ఒకటి. పారిస్ (Paris) శాంతి సమావేశంలో జరిగినదొకటి. తీరా సంధి బల్లదగ్గరకు వచ్చేసరికి విల్సనుకు ధర్మసంకటాలు ఎక్కువయాయి. యూరపు రాజ

## రెండో ప్రపంచయుద్ధమా?

కీయవేత్తలు విల్సనుగారి ధర్మసామ్రాజ్యం చాలా బాగుందని తల ఊచారుకాని వారు లోలోపల చిరునవ్వు నవ్వుకున్నారు. విల్సనువంటి ధర్మఛాందసుడితో ముఖం చెడుకోడం వారికి ఇష్టంలేదు. కాని అతడు ఊహిస్తూఉన్న క్రొత్త ప్రపంచ వ్యవస్థమీద వారికి విశ్వాసంలేదు. రాబోయే సంధి నిర్ణయంలో ఎవరిమట్టుకు వారు తమకు కావలసిన ప్రత్యేక షరతుల్ని చొప్పించాలనే ఆదుర్దాతో ఉన్నారు. వారి వారి ప్రత్యేక ప్రమేయాలు (interests) రక్షిస్తూ ఎన్ని ధర్మ సూత్రాలు అమలులో పెట్టినా వారికి ఆక్షేపణలేదు. జర్మను నౌకాదళంవలన బ్రిటనుకు అపాయస్థితి కల్గింది కాన జర్మనీ నౌకాబలం నశింపచేస్తే చాలు. తక్కిన విషయాల్లో బ్రిటను సదుపాయం చెయ్యడానికి సిద్ధంగా ఉంటుంది. ఇటలీకి అవసరమైన ఆల్ప్సుపర్వత సరిహద్దు ఇప్పిస్తేచాలు. మిగిలినవన్నీ ఇటలీ హర్షిస్తుంది. విల్సను ఉద్దేశించిన విధానానికి ప్రధాన విరోధము ఫ్రాన్సునుంచి కలిగింది. జర్మనీ ఇప్పుడు ఓడిపోయినా జర్మనీవారి విషయంలో ఫ్రాన్సుకు భయంపోలేదు. మళ్లీ కొద్ది సంవత్సరాలలోనే జర్మనీ తలయెత్తి తనమీద పడుతుందేమో! నాలుగుకోట్ల జనాభాగల ఫ్రాన్సు, ఎనిమిది కోట్ల జర్మనులు ఎప్పుడు తిరిగి విజృంభిస్తారోఅని హడలిపోవడం ఆశ్చర్యంకాదు. ఫ్రాన్సు జనసంఖ్య ముందుకు పడడం లేదు. జర్మనీ సంతానము తామరతంపరగా పెరుగుతూంది. అందుచేత ఇనుకపాతరవంటి జర్మనీజాతినుంచి ఆత్మరక్షణ చేసుకోడం ఎల్లాగ? "సమయంచిక్కింది గనుక ఇప్పుడే జర్మనీ దేశంయొక్క వెన్నెముక విరిచివెయ్యాలి. ఫ్రాన్సుకు జర్మనీ

నుంచి అపాయం రాకుండా సరిహద్దులు నిర్ణయించాలి. ఫ్రాన్సు యొక్క క్షేమం 'సెక్యూరిటీ' ముందు తేల్చాలి. ఆదర్శ ప్రపంచనిర్మాణము ఆ పైన ఆలోచించవచ్చును." అని ఫ్రెంచి వారు అన్నారు.

ఫ్రాన్సుయొక్క కట్టుదిట్టంకోసం రైన్ (Rhine) నది వామ పార్శ్వంఅంతా జర్మనీనుంచి వేరుచెయ్యాలని మార్షల్ ఫాక్ (Marshal foch) మున్నగువారు కోరారు. అయితే ఇది విల్సనుగారి స్వయంనిర్ణయ సూత్రమునకు అవిభాజ్యజాతి తత్వసూత్రానికే విరుద్ధము. "రైన్ నది వామదక్షిణభాగాల్లో రెండింటకూడా జర్మనీప్రజలు ఉన్నారుకదా. వారిని విడదీసి ఫ్రాన్సుకింద పెడితే ముందుముందు ముప్పుతప్పదు. జర్మనీ ప్రజల్ని ముక్కముక్కలు చెయ్యడం వీలుపడదుకాని ఫ్రాన్సుకి, బ్రిటను అమెరికాలు సంరక్షకహామీ ఇస్తే చాలదా? ఫ్రాన్సుకి ఇంకా జర్మనీ భయం ఉంటుందా" అని ప్రశ్న చేశారు. మార్షలుఫాక్ గొప్ప యుద్ధవేత్త. గొప్ప దూరదృష్టికల వాడు. "బ్రిటను అమెరికాలు గ్యారంటీ ఇచ్చినాసరే జర్మనీ ప్రజలు భావి కాలంలో ఫ్రెంచి జాతిమీద పడకమానరు. వెనుకనుంచి రష్యాభయం లేకపోతే ఈ ప్రమాదం ఫ్రాన్సుకు తప్పదు" అని అతడు వాదించాడు. ఈనాడు మార్షల్ ఫాక్ అమోఘవాక్కు గలవాడని ఋజువు అవనేఅయింది. రష్యా నుంచి భయం తొలగిపోగానే జర్మనీవారు ఫ్రాన్సుమీద పడనేపడ్డారు.

ఇన్ని సుడి గుండాల్లో సుళ్ళు తిరిగి తిరిగి వెర్సాయిల్సు సంధి బయలువెడలింది. ఇది ఒక మహాన్యాయపు

పాకంలోపడింది. ఇందులో విల్సను ఆదర్శాలూ, విజయ శీలురైన ఆశాపూరితులైన మిత్రమండలివారి యొక్కయూ, వారి ఆశ్రితవర్గము యొక్కయూ, భౌతికవాంఛలూ సంపుటీ చెయ్యటం జరిగింది. వెర్సాయిల్సుయొక్క బలమూ దుర్బలమూ ఇందులోనే ఉన్నాయి. ఆ సంధిలోని ప్రధానాంశములు ఇవి.

౧. జర్మనీ అల్సేస్-లారేన్ ప్రాంతము ఫ్రాన్సుకు ఇచ్చివెయ్యాలి. బెల్జియంకు మూడు చిన్న జిల్లాలు ఇవ్వాలి. బాల్టిక్ రేవు 'మెమెల్' (Memel) మిత్రమండలి (Allies) కి అప్పగించాలి. ఈ రేవుప్రాంతాన్ని తరువాత లిథుయేనియా (Lithuania) బలవంతంగా ఆక్రమించుకుంది. పోలండుకి లాసేన్ (Lausanne) ప్రాంతము ఇవ్వాలి. ఉత్తర సైలీసియా (Silesia) తూర్పు ప్రష్యా (Prussia) కూడా పోలండుకు ఇచ్చేసారు. ఇది ఆ ప్రాంత ప్రజల సమ్మతిమీద ఆధారపడి ఉంటుంది. ఇందుకై ప్రజాసమ్మతి 'ప్లెబిసైటు' తీసుకోవాలి. జర్మనీవారి వలస దేశాలు (Colonies), ప్రపంచముయొక్క వివిధదేశాల్లో వారికున్న ప్రత్యేక హక్కులూ వారివద్దనుంచి లాగుకోబడ్డాయి. డాంజిగు (Danzig) నగరము స్వతంత్ర రేవు స్థానముగా పోలండు భాగంలో ఉండాలి. జర్మనీవారి సార్ (Csar) జిల్లా ౧౫ సంవత్సరములదాకా ఒక అంతర్జాతీయ కమిషన్ వారికింద ఉండాలి. ఇక్కడి బొగ్గుగనులనుండి బొగ్గు ఎత్తుకోడానికి ఫ్రాన్సుకు హక్కు ఇవ్వబడింది. జర్మనీవారు ఫ్రెంచి బొగ్గుగనులకు చేసిన నష్టానికి ఇది పరిహారము. ౧౫ సంవత్సరాలతర్వాత సార్ ప్రాంతంలో ప్రజాసమ్మతి పైకొని తదనుసారంగా ఆ జిల్లాను ప్రసాదించడం.

# వెర్సాయిల్సు సంధి.

౨. ఆస్ట్రియా—హంగరీ సామ్రాజ్యము తునకతునకలుగా పడిపోయింది. ఇదివరకు 3 కోట్లపైన జనాభా గల సామ్రాజ్యం ఇప్పుడు ౬౦ లక్షల జర్మనుల ప్రాంతంగా మారిపోయింది. కాని ఈ ఆస్ట్రియన్ జర్మనులు, తమసోదర జర్మన్ జాతీయుల్తో కలిసి ఏకరాష్ట్రంగా ఉండదలచినవనియు, నానాజాతి సమితివారు ఏకగ్రీవంగా అంగీకరిస్తేనే ఆస్ట్రియా జర్మనీ సమ్మేళనం కావచ్చుననీ విధించారు. ఈ రెండు జర్మన్ ప్రాంతాలు ఏకమవుతాయేమో అని ఫ్రాన్సు విపరీతంగా భయపడింది.

3. హంగేరీకూడా ఆస్ట్రియావలెనే ఛిన్నాభిన్నం చెయ్యబడింది. ౨ కోట్లపైబడ్డ జనాభాగల హంగేరీని ౮౦ లక్షల జనసంఖ్యకు తగ్గించారు. హంగేరీ ప్రాంతాలైన ట్రాన్సిల్వేనియా (Trasylvania), బానాట భాగాలు రుమేనియాకు వెళ్ళిపోయాయి.

౪. బల్గేరియాకు ఎక్కువ దెబ్బతగులలేదు. గ్రీసుకు కొంతభాగము, యుగోస్లావియాకు కొంతప్రాంతము అర్పించింది.

౫. టర్కీనుంచి సిరియా, మెసపొటేమియా, పాలస్తైనులు వేరుచెయ్యబడ్డాయి.

౬. స్వయంనిర్ణయ సూత్రప్రకారం అనేక చిన్నరాజ్యాలు కొత్తగా బయలుదేరాయి. ఉత్తరమున నున్న బాల్టిక రాజ్యాలు, పోలండు, జేకోస్లావేకియా, యుగోస్లావియా.

౭. ఇటలీకి టైరోల్ (Tyrol) దక్షిణ భాగమూ,

ట్రీస్టీ (Trieste) ట్రెంటు (Trent) నగరాలూ, కొన్ని చిన్న చిన్న ద్వీపములు దొరికాయి. ఇటలీ కోరినంత దొరకలేదు.

ఇవిగాక మరికొన్ని సైనిక, ఆర్థిక షరతులుకూడా విధింపబడ్డాయి. జర్మనీ సైన్యము ఒకలక్షమంది సైనికుల్ని మించి ఉండకూడదు. నిర్బంధ సైనిక విధానము నిషేధింపబడింది. రైన్ నదికి తూర్పుతీరాన 30 మైళ్ళ వరకూ నిస్సైనికం చెయ్యాలి. నియమిత సంఖ్యగల ఫిరంగులు, యుద్ధనౌకలూ తప్ప జర్మనీ ఉంచుకోకూడదు. జర్మనీయుద్ధనౌకా బలమును బ్రిటనుకు ఒప్పగించాలి. జర్మనీ వ్యాపార నౌకలను కూడా ఇచ్చివెయ్యాలి. బెల్జియం ఫ్రాన్సు ఇటలీలకు విస్తారంగా బొగ్గు సమర్పించాలి. జర్మనీ కావించిన సర్వనాశనమునకు పరిహారంగా అఖండమైన నష్టపరిహార మొత్తాలు చెల్లించాలి.

ఆస్ట్రియా, హంగేరీ, బల్గేరియాల మీదకూడా ఇటువంటి షరతులే విధించారు. ప్రపంచయుద్ధం రావడానికి జర్మనీయే ముఖ్యకారణమని నిర్ణయించి, యుద్ధకారకులైన జర్మనీ నాయకుల్ని మిత్రమండలివారికి ఒప్పగించమన్నారు. విల్సనుగారికి ప్రాణపదమైన నానాజాతి సమితి వ్యవస్థకూడా వెర్సాయిల్సు సంధితోపాటు అమలులోకి వచ్చింది.

ఓడిపోయిన జాతులన్నీ వెర్సాయిల్సు మున్నగు సంధి షరతులకు విధిలేక అంగీకరించారు. వారు క్రోధదుఃఖముల్లో మండిపడ్డారు. విల్సను సూత్రాలప్రకారం సంధి పరిష్కారం చేస్తామని ఆశగొల్పి మమ్మల్ని మిత్రమండలి విద్రోహంచేసిందని తీక్ష్ణంగా విమర్శించారు. ఈ దుర్భరావమాన

పూరితము లైన సంధిపత్రాల్ని ఎట్లాగైనా చించిపారవేయం చాలని వారంతా పట్టుపట్టాయి. ముఖ్యంగా యుద్ధములో తాము పోగొట్టుకొన్న భూభాగాలను రాబట్టుకోవాలనే కోరిక వాంఛ వాళ్ళందరిలో కరడుగట్టింది. ఇట్లా కోరే రాజ్యాలను 'రివిషన్ స్టేట్సు' (Revision States) అంటారు. జర్మనీ, హంగరీ, బల్గేరియాలు, ౧౯౧౯ సంధిసరిహద్దుల పునర్విమర్శనం జరగాలని వాదిస్తూంటే, సదరుసంధులవలన లాభంపొందిన పోలండు, జెకోస్లావేకియా, రుమేనియా, యుగోస్లావియా మున్నగు రాష్ట్రాలు 'యథాస్థితి' (Status quo) ఉండాలని, సరిహద్దు పునర్నిర్మాణం ఒప్పుకోమని పట్టుపట్టారు. ఫ్రాన్సు యొక్క-యూ ఫ్రెంచిమైత్రము ఒక్క-టిగా మునుపటి సంపూర్ణంగా ఉంది' యూరపు అప్పుడే రెండు వేర్వేరు శిబిరాలుగా తయారయింది.

వెర్సాయిల్సు మున్నగుసంధిపత్రాలు నిర్మించిన హస్తాలే నానాజాతిసమితిని(League of Nations)నిర్మించడంచేత పరాభూత రాష్ట్రాలన్నిటికీ దానిమీద విశ్వాసాలు లేకపోయాయి. అమెరికావారు ఈసమితిలో చేరడానికి నిరాకరించారు. బ్రిటను-అమెరికాలు ఫ్రాన్సుకు ఇస్తామన్న హామీ అమలుజరుగలేదు. ఫ్రెంచ్ గ్యారంటీకి అమెరికా ఒప్పుకోలేదు. అందుచేత ఫ్రాన్సు తనపక్షంకోసమై, నానాజాతిసమితినే అండగా చూసుకొని జర్మనీచుట్టూ ఉండే చిన్న రాజ్యాలను తనఆశ్రయంలోకి తీసుకుంది. పోలండు, జెకోస్లావేకియా, యుగోస్లావియా మున్నగు రాష్ట్రాలు జర్మనీవల్ల భయపడి ఫ్రెంచిమైత్రిని కోరేవాయి. జర్మనీనుంచి భాగాలలో ముఖ్య

వస్తే ఫ్రాన్సునే వీరు శరణ్యంగా ఎంచుకున్నారు. ఈవిధంగా యుద్ధానంతరము యూరపులో ఫ్రెంచి యాజమాన్యము స్థిరపడింది. ఫ్రాన్సున్నూ, ఫ్రాన్సు మిత్రములైన చిన్న జాతులూ నానాజాతి సమితివలన లాభం పొందదలచుకున్నారు. జర్మనీ, ౧౯౨౬ దాకానూ, రష్యా ౧౯౩౪ దాకానూ నానాజాతి సమితిలో చేరలేదు. “సమితి ప్రపంచరాష్ట్రాలన్నిటి క్షేమంకోసం పాటుబడే వ్యవస్థ కాదు. యూరపుఖండ శాంతిని భంగపరచదలచుకొన్న రాష్ట్రాలను అరికట్టడానికి, యూరపులో నెలకొన్న ‘యథాస్థితి’ని ఎట్లాగైన విజయంపొందిన జాతులలాభంకోసం నిలబెట్టడానికీమాత్రమే నానాజాతి సమితి ఉద్దేశింపబడింద”ని జర్మనీవారు విమర్శిస్తూవచ్చారు. పరాభూతజాతులకు దీనివలన ఎంతమాత్రమూ న్యాయాచరణము దొరకదని వారు నిశ్చయంచేసుకున్నారు. ఈవిధంగా నానాజాతి సమితి ఏ మహోద్దేశంకోసం పుట్టిందో ఆ ఉద్దేశం పురుట్లోనే సందుకొట్టింది.

---

# ౩. జర్మనీ తల యెత్తింది.

శాంతిస్థాపనకోసం ఏర్పడ్డ సంధి నిర్ణయాలు శాంతిని మైత్రినీ స్థాపించలేకపోయాయి. నూతన నిర్మితరాష్ట్రాలు క్రొత్తస్వాతంత్ర్యగర్వంలో కొంత దుడుకుతనంచూపెట్టాయి. పోలండు వీలైనంత జర్మనీప్రాంతం కొట్టేద్దామని యత్నించింది. ఫ్రెంచివారు పోలండుపక్షం వహించారు. జర్మనీకి ఉద్దేశపూర్వకంగా అవమానంచెయ్యడంకాని హాని కలిగించడంకాని బ్రిటనుకు సమ్మతంకాదు. లిథుయేనియా భాగమైన విల్నా (Vilna) ను పోలిషువారు బలాత్కారంగా అపహరించారు. లిథుయేనియా మెమెల్‌ను ఆక్రమించుకుంది. ఇది కూడా జర్మనులు నివసించే ప్రాంతమే. రష్యాదేశము బొల్షెవిక్ (Bolshevik) విప్లవములో మునిగిఉండగా చూసి రుమేనియావారు బెస్సరేబియా (Bessarabia)ను ఆక్రమించుకున్నారు. నానాజాతి సమితి విజయజాతుల అన్యాయాచరణమును అరికట్టలేకపోయింది. రష్యాలో తలయెత్తిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆరంభంలోనే త్రుంచెయ్యాలని మిత్రమండలివారు పూనుకొని, రష్యాలో బయలుదేరిన బొల్షివిస్టువ్యతిరేక విప్లవానికి సహాయం పంపించారు. కాని నాలుగు సంవత్సరాల యుద్ధంలో అలిసిపోయిన వీరికి బొల్షివిజమ్‌ను నిర్మూలించడానికి అవసరమైన శక్తిగాని దీక్షకాని లేకపోయాయి. కావున ఈ ప్రయత్నం వారు మానుకున్నారు. వీరి చర్య రష్యాలో అసంతృప్తి కలిగించడానికిమాత్రమే తోడ్పడింది.

యుద్ధనష్టపరిహారముల నిర్ణయం జర్మనీకి చాలా అసం

తృప్తి కలిగించింది. యుద్ధపు నేరం అంతా జర్మనీ నెత్తిన రుద్దడం భావ్యంకాదని మిత్రమండలివారిలోనే పలువురు అన్నారు. కాని ప్రజాసమూహం, జర్మనీచేసిన నష్టానికి జర్మనీ పరిహారం చెయ్యాలని పట్టుపట్టారట. నష్టపరిహారములకింద జర్మనీని ౧౩౨,౦౦౦,౦౦౦,౦౦౦ జర్మన్ మార్కులు బంగారు నాణాలు చెల్లించమన్నారు. జర్మనీయొక్క ఆర్థికస్థితి బొత్తిగా కూలిపోవడంచేత ఇంత మొత్తమును జర్మనీ చెల్లించలేదని మిత్రమండలి ఒప్పుకున్నారు. జర్మనీ చెల్లించవలసిన నష్టపరిహారములు సరిగా చెల్లించడంలేదని ఇందుకు హామీగా ఫ్రెంచివారు జర్మనీయొక్క రూర్ (Ruhr) ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. ఈచర్య బ్రిటిషువారికి అమెరికాకున్నూ నచ్చలేదు. నష్టపరిహారాల పరిష్కారంకోసం ౧౯౨౪ లో డాస్ (Dawes) విధానంపుట్టింది. దీనిప్రకారం జర్మనీ సంవత్సరం ఒక్కింటికి ౨,౫౦౦,౦౦౦,౦౦౦ మార్కులు పరిహారం చెల్లించాలి. జర్మనీవారు ఈ మొత్తాలుకూడా చెల్లించలేకపోవడంచేత ౧౯౨౯ లో 'యంగ్'విధానం అని మరొకటి అమలులోకి తెచ్చారు. దీనిప్రకారం ౫౯ సంవత్సరాల్లో జర్మనీపై విధించిన యుద్ధపరిహారాలు చెల్లింపబడతాయి. ఏవిధంగా త్రిప్పినా జర్మనీ చెల్లించలేనని కాళ్ళు సాచింది. జర్మనీలో బంగారంలేదు. అప్పులు చెల్లించడానికి జర్మనీకి మార్గంఏముంది ? జర్మనీ పరిశ్రమలు వస్తునిర్మాణంచేసి వాటిని ఎగుమతిచేసి తద్వారా ఋణవిముక్తి పొందాలి. జర్మనీ ఖాతాదార్లకు ఎవరికీ ఇది ఇష్టంలేదు. దీనికి అంగీకరిస్తే జర్మనీ పరిశ్రమలు విజృంభిస్తాయి. దిగుమతి చేసుకునే

వారిపరిశ్రమలు పడుకుంటాయి. వెనకట బిస్మార్కు (Bismark) ఫ్రాన్సును ఓడించినప్పుడు ఫ్రాన్సుమీద బ్రహ్మాండమైన యుద్ధపరిహారమొత్తం వేయించాడట. ఈ ఋణాన్ని ఫ్రెంచి వారు వస్తు వినిమయం(Barter)వలన చెల్లిస్తామన్నారు. జర్మనీ ఒప్పుకొంది. కొంత కాలమయ్యేసరికి ఫ్రాన్సు పరిశ్రమలు విపరీతంగా అభివృద్ధిపొంది దివారాత్రములు పనిచేస్తున్నాయి. ఫ్రాన్సు ఎగుమతులవలన జర్మనీపరిశ్రమలు కుంటుపడ్డాయి. అప్పుడు బిస్మార్కు వేలు కరుచుకొని అన్నాడు, "ఈసారి గనుక ఫ్రాన్సును తిరిగి ఓడించామంటే ఫ్రాన్సుకు మేమే యుద్ధపరిహారాలు చెల్లిస్తామని షరతు విధిస్తాను". జర్మనీ ఖాతాదార్లకుకూడా ఇదే చిక్కువచ్చింది. ౧౯౩౦ ప్రాంతంలో ప్రపంచ ఆర్థికదుస్థితివచ్చిపడింది. జర్మనీ ప్రభుత్వము నష్టపరిహారాలు చెల్లించమని నిరాకరించారు. ౧౯౩౨ లో లాసేన్ (Lausanne) సమావేశంలో యుద్ధపరిహారాలను పూర్తిగ రద్దుచేసివేశారు.

నష్టపరిహారాలనుగురించి జర్మనీ మొదటినుంచీ పేచీ పెడుతూనేఉంది. పరిహారాల రూపమున కొంత ధనం చెల్లించినా, క్రొత్త అప్పుల మూలకంగా జర్మనీ ఇంతకు మించిన మొత్తం ఆకర్షించుకుంది. జర్మనీ ఆర్థికవిధానాన్ని పునరుద్ధరించడానికిగాను, బ్రిటను అమెరికా మున్నగు దేశాలు ౨౭,౦౦౦,౦౦౦,౦౦౦ మార్కులు జర్మనీకి అప్పుఇచ్చారు. నష్టపరిహారాలు చెల్లిస్తున్నామని దుమ్ముకొట్టిపోయ్యడానికి జర్మనీకి అవకాశం కల్గించడంతప్ప వీటివలనప్రయోజనంకలగలేదు.

# రెండో ప్రపంచయుద్ధమా ?

వెర్సాయిల్సు నిర్ణయము జర్మనీవంటి బలవత్తరజాతికి అవమానకరంగానూ దుర్భరంగానూ కనబడడంలో ఆశ్చర్యం లేదు. ఈసంధిని ఎట్లాగైనా రద్దుచేయించాలనే వారి దీక్షకు హద్దు లేదు. విజయజాతులు సంధిషరతులను సరిహద్దులనూ పునర్విమర్శనం చెయ్యకపోతే సంధిషరతుల్ని ద్రావిడ ప్రాణాయామపద్ధతిని ఎట్లాగైనా తుడిచిపెట్టాలని జర్మనీ జాతి నిశ్చయించుకుంది. పరాభూతజాతులు ప్రార్థించినట్లుగా వెర్సాయిల్సు విధానాన్ని ఏదోకొంత మార్చి వారికి కొంత సదుపాయం చూపెట్టి వారి హృదయ గత క్రోధద్వేషాలను చల్లార్చడం యూరపు భావిక్షేమానికి అవసరమని పలువురు రాజనీతిజ్ఞులు చెప్తూవచ్చారు. కాని స్వార్థపరత్వము, అత్యాశ, విజయగర్వాంధత్వమూ యూరపు ప్రభుత్వాలను క్షేమమార్గం చూడనియ్యలేదు. వెర్సాయిల్సు పరామర్శ వలన అవసరమయే భూమిపంపకానికి పోలండు ఒప్పుకుంటుందా, జెకోస్లొవేకియా అంగీకరిస్తుందా, రుమేనియా సిద్ధపడుతుందా, ఫ్రాన్సు హర్షిస్తుందా? జర్మనీ కాలనీలను అనుభవిస్తూన్న బ్రిటిషుడొమినియన్లు సమ్మతిస్తారా ? మాండేటుదార్లు సుముఖులుగా ఉంటారా ? ఎవ్వరూ లేరు.

౧౯౨౦ నుంచి ౧౯౩౮ దాకా వెర్సాయిల్సుసంధిని రహస్యంగా, మిత్రమండలికనుబ్రామి తుడుపు చెయ్యడంలో జర్మనీ నిమగ్నమయిఉంది. బహిరంగంగా సదరు షరతుల్ని వ్యతిరేకిస్తే ప్రమాదం ఉందని జర్మనీ గుర్తించి ఒక పెద్ద అంతర్నాటకం ఆడడానికి సిద్ధపడింది. జర్మనీవారిని మరీమరీ కొఱకొఱలాడించిన సంధిషరతులు కొన్ని ఉన్నాయి.

జర్మనీ తల యెత్తింది.

౧. (రెపరేషన్సు) యుద్ధపరిహారములు ఎట్లాగైన రద్దు చేయించడం గాని, ఎగవేయడం గాని. నష్టపరిహారములు చెల్లించడమే ప్రపంచ ఆర్థికదుస్థితికి కారణమని వారి వాదము.

౨. జర్మనీయొక్క సైన్యశక్తి చాలా తగ్గించబడింది. కనుక ఇతరజాతులు కూడా జర్మనీవలెనే తమ ఆయుధాలు తగ్గించుకోవాలి. లేదా జర్మనీకి సైన్యవిషయాల్లో ఇతర దేశాల్తో సమాన ప్రతిపత్తి అంగీకరించాలి.

౩. పోలిష్ ఖండికనూ, డాంజిగునగరమునూ జర్మనీకి వాపసుచెయ్యాలి. పోలండు వశంలో ఉన్న సైలీషియా ప్రాంతంకూడా తిరిగి ఇచ్చెయ్యాలి.

౪. ఆస్ట్రియాను జర్మనీతో సమ్మేళనం చెయ్యాలి.

౫. జర్మనీ పూర్వపు వలసప్రదేశాలను వాపసు చెయ్యాలి.

ఇవి వారి ప్రధాన ఆశయాలు. ఇవి ఎట్లాగైనా సాధించాలని జర్మనీ పూనుకుంది.

వీటని సాధించాలంటే జర్మనీ తిరిగి గొప్ప యుద్ధమూర్తిలా తయారవాలి. జర్మనీ బలం పెరిగితేనేగాని జర్మనీ కోరికలు మన్నింపబడవు. కావున అన్ని కోరికలు ఏకసూత్రంలో ఇముడుతున్నాయి. అవసరమైతే బలప్రయోగం చెయ్యగల శక్తిని జర్మనీ సంపాదించుకోవాలి. పశ్చిమ యూరపులో జర్మనీకి మిత్రులు లేరుగనుక సహజంగానే జర్మనీ తూర్పుకు తిరిగింది. బోల్షివిస్టు రష్యా యూరపుయొక్క మాలవాటికలా పరిగణింపబడుతూంది. ధనస్వామ్య (కాపిటలిస్టు) దేశాలు ఏవికూడా ఈ అస్పృశ్యులవంక కన్నెత్తిచూడవు. చేశ్నైతే

వారిని నిర్మూలించడం వీరికి ప్రీతికరము. ఇంకేముంది? ఓడిపోయిన జర్మనీ, బహిష్కృతమైన రష్యా; 'భాయీ-భాయీ' అనుకున్నారు; 1922 లో రెపెల్లో (Rapello) సంధి అనే రహస్య ఒడంబడికను వీరిద్దరూ చేసుకున్నారు. జర్మనీలో ఆయుధ కర్మాగారాలు మిత్రమండలివారి కమిషన్ పర్యవేక్షణాలో ఉంటాయి గనుక జర్మనీవారు ఆయుధసామగ్రి బాహాటంగా నిర్మించుకోలేరు. ఈ లోటు సోవియటు రష్యా తీరుస్తుంది. రష్యా సైన్యాలకు యుద్ధ శిక్ష ఇచ్చి, వారి కర్మాగారాలు నడిపింపగల వృత్తివిద్యాకుశలురను సప్లయి చెయ్యడం జర్మనీవంతు. నేర్పరుల్లో నేర్పరులైన జర్మనీవారు రష్యామైత్రిని ఆత్మప్రయోజనాలకి ఎట్లా ప్రయోగించాలో బాగా కనిపెట్టారు. కాపిటలిస్టు ప్రభుత్వాలకి, జర్మనీ రష్యావైపు మొగ్గడం ఇష్టంలేదు. జర్మనీకూడా ఎక్కడ బొల్షివిస్టు తత్వం అవలంబిస్తుందో అని వారు లోలోపల భయపడుతున్నారు. ఆరు ఏడుకోట్ల జర్మనులు కమ్యూనిస్టులుగా మారిపోతే బొల్షివిజమ్‌ను అరికట్టడం ఎట్లా? హఠాత్తుగ యూరపు అంతా జ్వాలాతోరణంలాగ వెలిగిపోతుంది. వారి పాలిటి పెనుభూతము వచ్చివచ్చి ఇంటిముందర విడిది చేస్తుంది. కావున జర్మనీప్రజలు బొల్షివిస్టులు గాకుండా చూసుకోవాలి. కాపిటలిస్టు ప్రభుత్వాల ఈ అదుర్దాను కనిపెట్టి జర్మనీ భీష్మించడం మొదలుపెట్టింది. 'మా కోరికలు మాకు ఇస్తారా! లేకపోతే మేము కమ్యూనిజం పుచ్చుకోమా!' అని బెదిరించడం నేర్చుకున్నారు. ధనాఢ్యవర్గాలన్నీ గడగడలాడిపోయాయి. జర్మనీనికూడగట్టుకోడమే క్షేమకరమేమో?

అని వారు తలిచారు. జర్మనీకి కావలసినంత పెట్టుబడి పెట్టారు. ఆ పెట్టుబడిని ఉపయోగించుకొని సర్వాయుధసంపన్నం కావాలని జర్మనీ నడుముకట్టింది. దీని ఫలితంగా జర్మని చెల్లించవలసిన నష్టపరిహారాల్లో సదుపాయం చెయ్యడం, ౧౯౨౬లో జర్మనీని నానాజాతి సమితిలో చేర్చుకుని సభ్యత్వం ఇవ్వడం, రైన్‌లాండు (Rhineland) లోనుంచి మిత్రమండలి సైన్యాలు క్రమంగా ఉపసంహరించుకోడం, జర్మన్ ఆయుధాగారాలమీద నిగహా ఉంచిన మిలిటరీ కమిషనును వాపసు పిలుచుకోడం, ఇట్లాంటివి జరిగాయి. జర్మనీ మిత్రమండలివారి నడుమ ద్వేషాగ్నులు చల్లారి సౌమనస్యం ఏర్పడే సూచనలు కనిపించాయి. ఇదంతా జర్మనీ రాజనీతిజ్ఞుడు స్ట్రెసిమాన్ (Stresemann) గారి సత్కృషిఫలితం. జర్మనీ పరాభవ వేదనను తగ్గించడంలో ఈయన చాలా పాటుపడ్డారు.

జర్మనీ సైన్య సంఖ్య ఒకలక్ష మందికి మించకూడదని శాసించారుగదా! అనేక లక్షల సైన్యం శాసించిన జర్మనీకి, ఈ నియమం చాలా అవమానకరంగానే కనబడింది. జర్మన్ జాతియొక్క జీవిత లక్ష్యం క్షాత్రంలోనే ఉందని వారి ఉద్దేశం. ఇట్టి క్షాత్రం చంపివేయబడుతూందని వాపోయారు. అయినప్పటికీ పథ్యమునే హితవుగా చేసుకునే అభ్య నైపుణ్యం జర్మనీవారికుంది. జర్మన్ సేనానులు ఈ లక్ష సైన్యమునే ప్రకర్షంగా శిక్షించి ౧౯౩౨ నాటికి దీనికి సమానమైనది యూరపులో లేదనిపించే సమగ్రస్థితికి తెచ్చారు. ఇది ఎట్లా చేశారు? జనరల్ వాన్‌సీక్ట్ (Von seockt) అనే ఆయన ప్రస్తుత 'రీష్‌వేర్' (Reichswehr) సైన్యానికి

జనకుడు. తక్కువ సంఖ్యగల సైన్యాన్ని గాఢంగా శిక్షించి, వారికి విస్తారమైన ఆయుధసంపత్తి కలిగిస్తే అట్టి సైన్యము శత్రుదుర్ధరంగా ఉంటుందని ఆతడు ఊహించాడు. తన లక్ష సైనికుల్ని ఈవిధంగా భయంకరంగా శిక్షించి వారికి ఆయుధముల కరవు లేకుండా చేశాడు. పైగా ఈ సైనికులనంతా, పరంపరంగా క్షాత్రభావ ప్రేరితులైన తరగతుల్లోంచి ఏర్పి కూర్చాడు. జర్మనీలో 'కాన్‌స్క్రిప్షన్' నిర్బంధ సైనిక విధానం పనికిరాదని వెర్సాయిల్సు శాసించింది. ఇదికూడా మేలేఅన్నాడు వాన్ సీక్టు. ఆ దినాల్లో జర్మనీవారు యుద్ధ వినాశనమునకు వెరచి శాంతితలంపు కలిగిఉండేవారు. జనుల్లో సామ్యవాదం (సోషలిజం), క్షాత్ర వైముఖ్యమూ తలయెత్తాయి. నిర్బంధవిధానంవల్ల ఏర్పడ్డ సైన్యంలో ఇటువంటి పిరికిగుండెలు ఉండేవారు. ఈ ప్రమాదం తప్పిందని జర్మన్ సేనానులు హర్షించారట. జర్మనీ సైన్యంమీద ఎంత ధనప్రవాహం వెచ్చించారో అడగడానికి జర్మన్ పార్లమెంటుకి ధైర్యం లేకుండా ఉండేది. జర్మనీలో సైన్యప్రభుత్వం వేరు. సివిల్ ప్రభుత్వం వేరు. వెర్సాయిల్సును కూలద్రొయ్యడానికి కంకణం కట్టుకొన్నవారిలో జర్మన్ సేనాపతులు ప్రధానులు.

తననుబంధిస్తూన్న వెర్సాయిల్సు సంకెళ్ళను మెల్లమెల్లగా సడలించుకొని జర్మనీ తిరిగి ప్రబల శక్తివంతము అవుతూన్న రోజుల్లో బ్రిటన్-ఫ్రాన్సులు పరస్పర వైమనస్యాల్లో కాలక్షేపం చేస్తున్నారు. యూరపు ఖండంలో 'బాలెన్సు ఆఫ్ పవర్' (బలతూకము) పడిపోకుండా ఉండడం బ్రిటనుయొక్క లక్ష్యము.

# జర్మనీ తల యెత్తింది.

ఒక్క దేశమూకూడా ఇతరదేశాలను తలదన్నే బలం సమకూర్చుకోడం బ్రిటను తన క్షేమానికి భంగంగా ఎంచుకుంటుంది. యుద్ధానంతరం యూరప్‌లో ఫ్రెంచివారి సైన్యబలమూ, ఆర్థికబలమూ, అపారమైన పలుకుబడీ చూస్తే ఫ్రాన్సుమీద ఒకకన్ను ఉంచవలసిన అవసరం బ్రిటనుకు కనిపించింది. పరాభూతజాతుల సౌమనస్యం సంపాదించాలని బ్రిటను అంటుంది. జర్మనీకి ఎట్టి సౌకర్యాలు కలిగించడం ఫ్రాన్సుకు ఇష్టంలేదు. బ్రిటను ఫ్రాన్సుల నడుమ కలబడుతూన్న అభిప్రాయభేదాన్ని గుర్తించి ఉపాయశాలులైన జర్మనీవారు ఈ సదవకాశాన్ని బాగా ఉపయోగించుకోడం మొదలుపెట్టారు. ఫ్రాన్సు జర్మనీయొక్క పరమశత్రువనీ బ్రిటనుతో సఖ్యపడడం జర్మనీకి క్షేమకరమనీ వారు ప్రచారం చేసేవారు. హిట్లరు మొదటినుంచీ ఈ ఉద్దేశంలోవాడే. అయినప్పటికీ ౧౯౨౫ లో బ్రిటను, ఫ్రాన్సు, జర్మనీ ఇటలీలు లోకర్నో (Locarno) సంధి సంతకం చేశారు. తమ తమ ప్రస్తుత సరిహద్దులు భంగపరచకుండా కాపాడుతామనీ, ఒండొరులమీద బలప్రయోగం చేసుకోమనీ అంగీకరించారు.

ముస్సోలినీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ రాజకీయాకాశంలో పల్టీలుకొట్టడం మొదలుపెట్టాడు. గత యుద్ధానంతరం మిత్రమండలిపక్షాన చేరినందుకు ప్రతిఫలంగా తనకు తగినంత లూటీ దొరకలేదని ఇటలీ గుఱ్ఱుతోఉంది. ఇటలీ కోరిన ఏడ్రియాటిక్ (Adriatic) ఆధిపత్యంగాని, ఆఫ్రికాలో విశేషలాభం కాని దొరకలేదు. డాల్మేషియా ప్రాంతము యుగోస్లావియాకు వెళ్లిపోయింది. కాలనీలుకాని 'మాండేట్లు'

# రెండో ప్రపంచయుద్ధమా?

(Mandate: వెనుకబడిన దేశాలమీద పరిపాలనాధికారము) కాని చేజిక్కలేదు. అందుచేత మొదటినుంచీ ఇటలీకి నానా జాతిసమితిమీద తిరస్కారము నిర్లక్ష్యమూ కలిగింది. ముస్సోలినీకి ప్రాచీన రోమకసామ్రాజ్యం తిరిగి ఉద్ధరిద్దామనే పేరాశ బాగానున్నాది. దీనిని నెరవేర్చాలంటే ఇటలీకి మిత్రులుకావాలి. సారవంతమైనభూభాగాలన్నీ బ్రిటన్ ఫ్రాన్సులచేతుల్లో ఉన్నాయి. వాటిని బలప్రయోగంచేతనైనా సంపాదిస్తేకాని ముస్సోలినీతలపెట్టిన రోమకసామ్రాజ్యానికి రూపంఏర్పడదు. ఫ్రాన్సు బ్రిటనులతో వైరంతప్పదు. ఇంక మిత్రవర్గంఎక్కడదొరకాలి? ముస్సోలినీకన్నులు రష్యావంకకుతిరిగాయి. రష్యాపేరు ఫ్రాన్సు బ్రిటనులకు కిట్టదుగనుక రష్యాతో మైత్రిపాటిస్తే డెమాక్రసీ (ప్రజాస్వామిక ప్రభుత్వము)లకు ఉడుకెత్తించినట్లుంటుంది. ఫాసిస్టు విప్లవమూ, కమ్యూనిస్టు విప్లవమూ ఒక్కటే పట్టాల మీద ప్రయాణంచేస్తాయని ముస్సోలినీ ప్రకటించేవాడు. రష్యాతో సఖ్యంవలన మరొకలాభం కనబడింది. ఇటలీకి కావలసిన ముడిపదార్థాలు, ఆహారపదార్థాలు రష్యా సప్లయిచేయుగలదు. ఈవిధంగా గోధుమలకోసం అమెరికామీదనూ, బొగ్గుకోసం బ్రిటనుమీదను ఆధారపడనక్కరలేదని ఇటలీ ఊహించుకుంది.

నిరాశాహతమైన ఇటలీ క్రమంగా డెమాక్రసీలను ద్వేషిస్తూ, ప్రజాప్రభుత్వవిధానాన్ని వెక్కిరించడం పనిగా పెట్టుకుంది. 'ఏదో అవిదితమైన మహా ఘనత ఇటలీ నొసట దైవం వ్రాశాడు. ఈ మహోన్నతపదవి పొందడానికిగాను ఇటాలియన్ జాతి యుద్ధానికి సిద్ధంగా ఉండాల'ని ముస్సోలినీ

## జర్మనీ తల ఎత్తింది.

తరుచు ఉరిమిఉరిమి చెప్పతూండేవాడు. జర్మనీ నానాజాతి సమితిలో చేరగానే ఇటలీకి కావలసిన స్నేహము దొరికింది. డెమాక్రసీలను వేధించడానికి జర్మనీని వెనుకవేసుకురావడమే మంచిమార్గమని ముస్సొలినీ గ్రహించాడు. అదిగాక వెర్సా యిల్సు పరామర్శను కోరే ప్రభుత్వాలన్నిటినీ ఇటలీ ఆలింగనం చేసుకొని వారి పక్షం పలకడం నేర్చుకుంది. ఈ విధంగానైనా బ్రిటన్‌ఫ్రాన్సులు చూరికివచ్చి తన కోరికలు తీరుస్తారేమోఅని ఇటలీ ఆశపడిఉంటుంది.

ఆయుధవిసర్జనం చాటుచేసుకొని జర్మనీ వెర్సా యిల్సు విధానంమీద మరొకదాడి ఆరంభించింది. జర్మనీని నిరాయుధంగా చేశారు గనుక ఇతర ప్రభుత్వాలన్నీకూడా ఆయుధవిసర్జనం చెయ్యాలని జర్మనీ కోరింది. దీనికి ఒడంబడక పోతే జర్మనీకి సైన్యవిషయాల్లో ఇతర ప్రభుత్వాలతో సమాన ప్రతిపత్తి ఇవ్వాలి. ఇటలీ జర్మనీని వెనుకవేసుకు వచ్చింది. ౧౯౨౫ నుండి ౧౯33 దాకా ఆయుధవిసర్జనము మీద ఎంతో తర్జనభర్జన జరిగింది. కాని యూరపు ఖండంలో ఎవరూకూడా ఆయుధవిసర్జనానికి హృదయ పూర్వకంగా ఒప్పుకోలేకపోయారు. ఆదర్శం బాగానే ఉందని హర్షిస్తూవచ్చారుకాని ఒక్కరూ ఏవిధమైన త్యాగమునూ పూనుకోదలచలేదు. జర్మనీ తిరిగి ఆయుధధారణం చెయ్య కూడదనే విషయంలో మాత్రమే వారంతా ఏకీభవించారు. ఎవరికివారు ఏదో ఉబుసుపోని ప్లానులు తయారుచేసేవారు. రెండవవారి ఆయుధాలు తగ్గించడానికే ఎవరిమట్టుకు వారు శ్రద్ధతీసుకునేవారు. 'మా దేశసంరక్షణాకై బ్రిటను మున్నగు

దేశాలనుంచి హామీలువస్తేనే కాని ఒక్క సైనికునికాని, ఒక్క పడవనుకాని తగ్గించజాలమని ఫ్రెంచివారు చెప్పారు. 'ఫ్రాన్సుతో మాకు నౌకాబలంలో సమాన ప్రతిపత్తి కావాలని ఇటలీ శపిస్తుంచింది. బ్రిటను తన నౌకాబలం ఆత్మరక్షణకూ సామ్రాజ్యరక్షణకూ అత్యావసరం కాన దానిని తగ్గించడానికి ఒప్పుకోనంది. ఇదివరకే బ్రిటను కొంత ఆయుధ విసర్జనం చేసి ఉంది. ఎవరూ ఆయుధవిసర్జనం చెయ్యడంలేదు గనుక జర్మనీకి సైన్యవిషయాల్లో సమానప్రతిపత్తి అంగీకరించడమే న్యాయమని జెనీవా (Geneva) లో పలువురు అభిప్రాయపడ్డారు. సమాన ప్రతిపత్తిసూత్రం అంగీకరించారు గనుక ఫ్రాన్సుతో తులతూగేటట్లుగా మేము వెంటనే ఆయుధాలు నిర్మించుకుంటామని జర్మనీ వాదించింది. జెనీవా దీనికి ఒప్పుకోలేదు. ఆయుధవిసర్జనం విఫలమైంది గనుక సదరు సమావేశంలో జర్మనీ ఇంక పాల్గొనదని ౧౯౩౩ లో హిట్లరు చెప్పేసి జర్మన్ ప్రతినిధుల్ని ఉపసంహరించుకున్నాడు.

ఒకవంక ఆయుధ విసర్జనంకోసం గోలచేస్తూనే జర్మనీ రహస్యంగా తన సైనికశక్తిని సర్వవిధాలా పెంచుకుంటూ వుందని తెలిసినవారు చెబుతూవచ్చారు. జర్మనీ సరిహద్దుల సమీపంలో ఉండే ఇతర రాష్ట్రాల్లో జర్మన్ ఆయుధ కర్మాగారాలు తీవ్రంగా పనిచేస్తూ యుద్ధసాధనాలు అందిస్తున్నాయని తెలుస్తూంది. ఆయుధ విసర్జన విషయంలో సత్యాత్మనా నమ్మినవారు సోవియటు వారొక్కరే. కానివారి ప్రయత్నాలు జయప్రదంకాలేదు. బ్రిటిషు కార్మిక పక్షం (లేబర్ పార్టీ)కూడా ప్రపంచ ఆర్థికదుస్థితివలన కలిగిన విషమ పరిస్థి

తులు గమనించి ఆయుధాలమీద ధనవ్యయం చెయ్యడం వినాశకరమని వాదించేవారు. ఆ దినముల్లో ఆయుధ విసర్జనము వలని ప్రమాదములను దూరదృష్టితో గుర్తించిన వారిలో చర్చిలు గారొకరు. ఈ విషయమై ఆయన వాదము చాలా యుక్తియుక్తముగాను, నేటి మహాపదను బట్టి చూస్తే మిక్కిలి ఉచితముగాను తోస్తుంది. "ఫ్రెంచి సైన్యాన్ని తగ్గించమని బ్రిటను పట్టుపట్టడం న్యాయంకాదు. యూరపులోని చిన్నజాతులన్నీ ఫ్రెంచి సైన్యాన్ని రక్షరేకుగా చూసుకుంటాయి. దీనిబలంతగ్గితే ఫ్రెంచిపలుకుబడి తగ్గిపోతుంది. ఫ్రాన్సు ఒక్కటే బ్రిటనుయొక్క సత్యమైన మిత్రము. ఫ్రెంచి వారు బలవంతులైనప్పటికీ వారంత శాంతిప్రియులు యూరపులో లేరు. జర్మనీకి సైన్యవిషయాల్లో సమాన ప్రతిపత్తి కలిగించడం కొరివితో తలగోకుకోడం అన్నమాట. క్షాత్రంలో జర్మనీనిమించిన జాతిలేదు. ఇందువలనే జర్మనీ ఏకాకియై ప్రపంచాన్నంతని నాలుగు సంవత్సరాలు నిలవరించకలిగింది. ఇటువంటి బలపత్తరజాతి చేతిలో తిరిగి ఆయుధాలు ఇచ్చామంటే ప్రపంచం విపత్సముద్రంలో పడకతప్పదు. అందుచేత ఈ భయదమైన ప్రయత్నం మానండి. విజయజాతులు వెంటనే ఆయుధ విసర్జనంచెయ్యడం క్షేమంకాదు. ముందుగా పరాభూతజాతుల న్యాయమైన కోరికలను పరిశీలించి, వాటిని మన్నించి, వారిలో అంతర్గీనంగా రవుల్తున్న ద్వేషానలమును చల్లార్చండి. వారిలో కొంతసౌమనస్యం ఏర్పడిన తర్వాత క్రమంగా ఆయుధ విసర్జనము అన్నిజాతులూ చెయ్యవచ్చును. పరాజిత జాతులను సంతృప్తిపరచకుండా ఆయుధ

విసర్జనం చేశామంటే ముప్పుతప్పదు.” అని చర్చిలుగారు వాదించినది యుక్తమే అనిపిస్తుంది.

చర్చిలు ఒక వితండవాదియని అం[illegible] [illegible]తారే శారు. ౧౯౩౮ దాకా జర్మనీకి ఎట్టిసదుపాయం ఇయ్యడానికి ఫ్రాన్సు ఒప్పలేదు. అన్యోన్య సైనిక సహాయ సూత్రం మీద బ్రిటను ఫ్రాన్సుకు హామీ ఇస్తేగాని సంధి పునర్వ్యవస్థకు ఒప్పుకోమని ఫ్రెంచివారు అన్నారు. ఫ్రాన్సు కోరిన సమగ్ర హామీ ఇవ్వడానికి బ్రిటను అంగీకరించలేదు. యూరపు ఖండంలో సైన్యాలు పంపవలసిన ఆవశ్యకత కలిగించే విధానమునకు బ్రిటను సిద్ధపడలేదు. కాంటినెంటు (బ్రిటను కాక యూరపులోని ఇతర దేశాల) ప్రభుత్వాలన్నీ అన్యోన్యంగా తమ వివాదాలు పరిష్కరించుకోడం దుస్సాధ్యం కాబట్టి, జర్మనీని కొంతవరకు సంతుష్టపరచి, అత్యాశకు పోకుండా అరికట్టవచ్చుననీ, బ్రిటను కనుక ఫ్రాన్సుతో సైనిక సహాయ సంధిచేసుకుంటే వెంటనే ఆయుధనిర్మాణంలో పెద్దపోటీ బయలుదేరుతుందని బ్రిటను అభిప్రాయపడింది. యూరపులో ఫ్రెంచి పలుకుబడిని తగ్గించి, జర్మనీకి సంధివిగ్రహాల్లో సమాన ప్రతిపత్తి కలిగించే ప్రయత్నంవలన ఎట్టిమహోపద్రవాలు కలుగుతాయో ౧౯౩౮ తరువాత కాని బ్రిటనుకు బోధపడలేదు.

ఆయుధ విసర్జన నాటకము నాల్గవ అంకంలోనే సమాప్తం అయిపోయింది. దీనివలన యూరపు జాతులనడుమ అసూయ అనుమానము విపరీతంగా పెరిగిపోయాయి. ఆయుధ విసర్జనంచేసేముందు అన్ని ప్రభుత్వాలుకూడా తమతమ

క్షేమోపాయములూ, అపాయ స్థానములూ గాలించి చూడడం మొదలుపెట్టారు. ఈస్త్రసశల్య పరీక్షలో ఇదివరకు తేలని వ్యూహాలోపాలు బయటపడినాయి. ఒకరి ఛిద్రాలు మరొకరికి బట్టబయలుగా కనబడ్డాయి. బలవంతులు ఆకలిగొన్న పులులులాగ చూడడం మొదలుపెట్టారు. చిన్న చిన్న జాతులు భయభ్రాంతులై ఆత్మరక్షణోపాయాలకోసం నాలుగు దిక్కులూ చూస్తున్నారు. యూరపు క్షేమం కోసం ఉద్దేశింపబడిన ఆయుధ విసర్జన చర్చ యూరపు పాలిటి ముసలం అయింది.

---

# ౮. లీగుకు అగ్నిపరీక్ష.

జెనీవాలో ఆయుధ విసర్జన కపటతంతు జరుగుతూండగానే దూరప్రాచ్య దేశాల్లో జపాను దురాక్రమణ తాండవం ఆరంభించింది. నానాజాతిసమితి జాతులనడుమ సఖ్యత, సానుభూతికోసం పాటుపడుతూండగా, జపాను దేశీయులు అమెరికా పాలిత దేశాల్లో వలసరాకూడదని యునైటెడ్ స్టేట్సు (అమెరికా సంయుక్త రాష్ట్రముల)వారు శాసించారు. పసిఫిక్‌లో జపాను బలపడడం అమెరికాకు భయకారణమైంది. అందుచేత జపాను చీనాను వంచించి ఇక్కడ తన ఆధిపత్యం స్థాపించాలని ఉద్దేశించింది. ఉత్తర చీనాలో దోపిడి భయము ఎక్కువై, జపాన్ వ్యాపారస్థులకు నష్టం కలుగుతూందనే వంకపెట్టుకొని జపాను మంచూరియా మీదపడింది. మంచూరియావల్ల ఆర్థికలాభాలు అటుంచి, సోవియటు రష్యా మీద లంఘించడానికి మంచూరియా బాగా ఉపయోగిస్తుందని జపాను ఎత్తువేసింది. జపాను దురాక్రమణమును గురించి చీనావారు లీగుకు మొరపెట్టుకున్నారు. కాని అప్పటికప్పుడే లీగులో అనేకత్వం తలచూపింది. ఫ్రాన్సుకు చీనా జపాను తగాదాలో ప్రాముఖ్యం కనబడలేదు. ఫ్రాన్సు ప్రమేయములేమీ అక్కడలేవు. బ్రిటనుకు ఇందులో చాలా జోక్యంఉంది. కాని జపానుపై చర్యతీసుకోడానికి బ్రిటను సిద్ధపడలేదు. అమెరికా సంయుక్తరాష్ట్రాల ప్రభుత్వము జపానుదౌర్జన్యం అరికట్టడంలో బ్రిటనుకు తోడ్పడతామన్నారు. లీగువారు చీనా జపాన్ వివాదమును పరిశీలించుటకై లిట్టన్ (Lytton) కమిటీని పంపారు. జపానుయొక్క దౌష్ట్యం బయటపడుతూంది. ఇదిచూసి జపానుకోపంతో

జాతిసమితినుండి వేరుపడిపోయింది. లీగు ఏమియు చేయలేక పోయింది. లీగుసభ్యులు జపానుపై దండ ప్రయోగంచెయ్యలేక పోతేమానె; ఆర్థికములైన ఆంక్షలను ప్రయోగిస్తే జపాను లొంగియుండును. దుర్బల జాతియైన చీనా పరువుదక్కి ఉండేది; కాని అట్లా జరుగలేదు. జపాన్ — లీగు తగాదాలో బలవత్తరజాతులు నిర్భయంగా దురాక్రమణకు పూనుకో వచ్చుననీ, వారిని నిరోధించే ఉత్సాహం లీగులో లేదనీ తెలిపోయింది.

జపాను తీసినదారిలో నడవడానికి యూరపులో అనేక మంది సిద్ధంగా ఉన్నారు. ఆయుధ విసర్జనంలో తనకు న్యాయం జరగలేదని జర్మనీజాతి సమితినుంచి తొలగిపోయింది. ఇప్పుడు జర్మనీ బహిరంగంగానే ఆయుధ పునర్నిర్మాణం సాగించింది. రాత్రింబవళ్ళు యుద్ధసాధనలు కుప్పలు కుప్పలుగా తయారవుతున్నాయి.

1933

ఈ సమయానికే ౧౯33లో హిట్లరు జర్మనీలో అధికార పదవికివచ్చాడు. ఆధునిక చరిత్రలో హిట్లరుపేరు ప్రపంచమంతా మారుమోగిపోయింది. హిట్లరు తోకచుక్కవలె అంతర్జాతీయ రాజకీయాకాశంలో పొడచూపాడు. ఇతని సిద్ధాంతములు విపరీతములు. చర్యలు భయంకరములు. ఆరంభంలో జర్మను ప్రజలు ఇతనిని ఉన్మత్త ప్రాయుడిగా తలిచారు. ౧౯23లోనే ఇతనిపార్టీవారు జర్మనుప్రభుత్వాన్ని బలవంతంగా కూలదోయ్యాలని యత్నించి విఫలురయారు. హిట్లరుకు ఖైదుసిద్ధించింది. కాని త్వరలోనే బయటపడ్డాడు. హిట్లరు, 'నా అనుభవములు' అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఇది

నాజీ వేదము. హిట్లరు పక్షాన్ని 'నేషనల్ సోషలిస్టులు' అంటారు. ఆరంభంలో ఇతడు తిండిలేక మాడుతూన్న ప్రజల్ని కూడకట్టుకోడానికి సోషలిస్టు సిద్ధాంతాన్ని అవలంబించినట్లు నటించాడు. హిట్లరు ఎందుకు ఇంతవాడయ్యాడు? ఆతని బలం ఎక్కడుంది? జర్మనులు ఎందుకాతణ్ణి ప్రత్యక్షదైవతగా చూసుకుంటారు? అధఃపతితమైన జర్మను జాతిని ఉద్ధరించి ప్రపంచంలో ఏకైక వీరజాతిగా చేస్తానని హిట్లరు కంకణం కట్టుకున్నాడు. అతడు ఈ అభిప్రాయాన్నే నిరంతరం ప్రచారంచేసేవాడు. తమను ఉద్ధరించే యుగపురుషుడు వచ్చాడని జర్మనులు ఇతనికి జోహారుచేశారు)

(హిట్లరు సిద్ధాంతాలు అపూర్వములు. "జర్మనులు ఆర్యజాతివారు. నార్డిక సంతతివారు. ఈజాతి క్షాత్రానికి పెట్టినదిపేరు. వీరే ప్రపంచ ప్రభువులుగా ఉండదగినవారు. ఆర్యేతరులు యూదులు (Jews). ఈ దౌర్భాగ్యులు యుద్ధపరాఙ్ముఖులు. జాతితత్వ వాదానికి వేరుపురుగులు. అంతర్జాతీయ వాదమైన 'కమ్యూనిజం' కూడ యూదుల దుష్టబుద్ధి కల్పితమే. యూదులు, కమ్యూనిస్టులు వీరిద్దరే లోకానికి మహామారివంటి వారు. వీరిని నాశనం చెయ్యాలి. ఫ్రాన్సులో ఈ రెండు వ్యాధులూ వేళ్ళుపారాయి గనుక ఫ్రాన్సును విధ్వంసం చేసెయ్యాలి. జర్మనీ ప్రజల్ని తూర్పుకు వ్యాపింపచేసి యూక్రేన్ (Ukraine) లో స్థాపించాలి. ఈ మహోద్యమంలో జర్మనీకి బ్రిటను ఇటలీలు మిత్రములుగా ఉండవచ్చును. ఇందులో ఎవరు తక్కువ బేరంమీద జర్మనీతో చెయ్యి కలుపుతారో వారిని వరించవచ్చును.

బ్రిటనుతో విరోధం జర్మనీకిపనికిరాదు. వెనుకటి జర్మనీ పాలకులు సముద్రాధిపత్యంకోసమూ, వలసప్రదేశాలకోసమూ బ్రిటనుతో స్పర్ధచేశారు గనుకనే బ్రిటనుతో పోరాడవలసి వచ్చింది. ఇకముందు ఈ పొరపాటు చెయ్యకూడదు. సముద్రాధిపత్యంకోసం జర్మనులు పాకులాడకూడదు. వారు సైన్యబలంమీదనే ఆధారపడి కొత్తకొత్త ప్రాంతాలు గెలుచుకోవాలి. జర్మనీ ప్రజలకు 'లెబెన్స్రామ్' (Lebensraum) కావాలి. అనగా జీవభూమి. విస్తరించడానికి అవకాశం. ఈ జీవభూమిని యూరపుఖండంలోనే జర్మనీ చూసుకోవాలి. జర్మనీ చుట్టుపట్లఉన్న చిన్నచిన్న జాతుల భూములే మనకు 'లెబెన్స్రామ్'. చిన్నజాతులన్నింటినీ రక్షించడానికి జర్మనువారు పోలీసుపనిచెయ్యలేరు. ఎవరు దుర్బలులో వారు పాలితులుఅయితీరాలి. ఎవరు బలవంతులో వారుపాలకులు. యూరపులో జర్మనుజాతి దుర్ధర్షంగా అయినమీదట ప్రపంచాధిపత్యం తలపెట్టవచ్చును. జర్మనుల వంటి వీరజాతి జగత్పాలకులు కావాలని విధివిధానంలో ఉంది," ఈ విధంగా హిట్లరు జర్మనులను ఉద్బోధించాడు.

హిట్లరు విదేశాంగనీతిలాగే గృహనీతి కూడా లోకోపద్రవకరంగానే పరిణమించింది. జర్మనుజాతిచేత ప్రపంచం పాలించేటట్లు చెయ్యాలంటే జాతినంతనూ ఒక్క త్రాటిమీద నడపాలి. ఎక్కడా అభిప్రాయభేదంకాని అవిశ్వాసంకాని పొడకట్టకూడదు. ప్రజాప్రభుత్వవిధానంలో అనేకత్వం సహజంగానే ఉంది గనుక ఈవిధానం జర్మనీకి పనికిరాదు.

దీనిని విధ్వంసంచెయ్యాలి. దేశంలో ఒక్కటేపక్షం ఉండాలి. అది నాజీపక్షము. ప్రజాభిప్రాయాన్ని అభిమతప్రవాహాల్లో పారించాలంటే పత్రికలను తీవ్రంగా నిరోధించాలి. వాక్స్వాతంత్ర్యము, పత్రికాస్వాతంత్ర్యము శుద్ధజాడ్యాలు. ప్రజల నోళ్ళకు చిక్కులు తగిలించడం అవసరం. అయితే ప్రజల నందరినీ ఏకముఖంగా చెయ్యడం ఎట్లా?. ప్రజల స్వార్థపరత్వమును, భయమును, దురాశనూ రెచ్చగొట్టాలి. వారిలో అసత్యప్రచారం విరివిగా చెయ్యడమే దీనికి సాధనము. ప్రజలు మోసపోతారా అంటే హిట్లరు ఒక కొత్త (Technic) విధానం కనిపెట్టాడు. ప్రజల ముందు చిన్న చిన్న అబద్ధాలు చెప్పడం కార్యసాధకంకాదు. అసత్యం ఎంత పెద్దది అయితే, ఎంత చిక్కనిది అయితే ప్రజలు అంతగా నమ్ముతారు. ఎందుచేతనంటే వారు సాధారణంగా చిల్లర అబద్ధాలు చెప్పడానికి సాహసిస్తారు; కాని అభూతకల్పనచేసి కోటకట్టినట్లు అబద్ధం ఆడలేరు. అందుచేత వారిని కొండంత అబద్ధాలాడి మోహపడేటట్లు చెయ్యాలి. "మూఢ జర్మను ప్రజల్లారా! మీతిండి లేమికి, మీ దారిద్ర్యానికి, మీ కడగండ్లకు కారకులెవ్వరో తెలుసునా? విదేశీయులే మిమ్మీ దురవస్థకు తెచ్చి విడిచారు. మీరు ఈ సంకెళ్ళలోంచి త్రెంపుకుపోవాలని అనుకోరా? మీకు ఈకోరిక, అభిమానము చచ్చిపోకపోతే మీరు మీ హక్కులకోసం యుద్ధం చెయ్యడానికి సిద్ధపడండి. లోకంలో దౌర్జన్యాన్ని మించిన కార్యసాధకము లేదు. ఇదే మీకు తారకమంత్రం," అని హిట్లరు ఆవిష్టునివలె ఉరుముతాడు.

# లీగుకు అగ్నిపరీక్ష.

హిట్లరు పాచికపారింది. వెర్సాయిల్సు అనంతరం జర్మనుల అవస్థ కడుహీనంగా ఉండింది. ఇంట దారిద్ర్యము. బయట మొట్టికాయలు. కావున వారు హిట్లరును సంతోషంతో అనుసరించారు. జర్మను సైన్యాధిపతులుకూడా జాతీయాదర్శ ప్రేరితులవడంచేత హిట్లరును హర్షించారు. జర్మనీ ధనస్వాములుకూడా హిట్లరు పదాన్నే పాడారు. అతడు కమ్యూనిజంకు విరోధిలా కనబడుతున్నాడు గావున ధూర్తుడైనా ఇతనితో సఖ్యపడడమే తమ ప్రమేయాలకు క్షేమమని ఆ మందమతులు ఊహించి, నాజీపక్షానికి బాగా డబ్బు పెట్టుబడి పెట్టేవారు. విదేశీయుల్లోకూడా హిట్లరుమీద అభిమానం కలుగుతూంది. కాపిటలిస్టు వర్గానికి అపూర్వబంధువులా కనబడుతూన్న ఈ ప్రజానాయకునికి తెరచాటునుండి వారంతా మద్దతుచేసేవారు. నాజీతత్వం, ఫాసిజంతో భాయీ సిద్ధాంతమే కనుక ముస్సోలినీ హిట్లరునుహర్షించాడు. హిట్లరు బ్రిటిషువారియెడ తన గ్రంథంలో సద్భావం కనబరచాడు గనుక బ్రిటిషు కోటీశ్వరులు, ప్రభువర్గమూ అతనిమీద చలువ దృష్టులను ప్రసరింపజేసేవారు. ఆతనివలన తమ ప్రయోజనాలకు ఏమీ హానిలేదని గుండెలమీద చెయ్యివేసుకు నిద్రించేవారు. హిట్లరు విజృంభణంలో మరొక మెలకువ ఉందని వారు లోలోపల నవ్వుకున్నారు. రష్యా కమ్యూనిస్టుల వరదకు జర్మన్ నాజీ ఆనకట్ట సునాయాసంగా ఏర్పడిందికదా! ఇక భయంలేదు. ఢీకొంటే ఈ రెండు రాక్షస శక్తులూ ఢీకొంటాయి. ఒకదానిచేత ఒకటి ధ్వంసమైతే మనం కడుపులో చల్లకదలకుండా ఏలుకోవచ్చునని ముసిముసి

నవ్వులు నవ్వుతున్నారు. హిట్లరు విజయం వారందరికీ వాంఛనీయంగానే కన్పడింది.

హిట్లరు ప్రతిపక్షులలో ఐకమత్యం కుదరకపోవడమే ఆతడు అధికారానికి రావడానికి అవకాశం ఇచ్చింది. హెర్ వాన్ పాపెన్ (Herr Von Papen), జనరల్ ష్లీచర్ (Schleicher) గార్లు పదవికోసం కొట్లాడుకుంటూ హిట్లరు సహాయంకోసం వేర్వేరుగా స్పర్థచేసేవారు. పిట్టలపోరు పిల్లితీర్చినట్లు హిట్లరు అధికారానికివచ్చి, ఉభయులనూకూడా నెట్టిపారేశాడు. చాణుక్యనీతివేత్తయైన హిట్లరు ఆరంభంలో తన అధికారం గట్టిచేసుకోవాలని నిశ్చయించాడు. ఇంటగెలిచి రచ్చగెలువాలికదా అందుచేత విదేశీయుల్లో అలజడి కలుగకుండా తాను ఇదివరలో జర్మనీ చేసినసంధి పత్రాల్ని శిరసావహిస్తానని ప్రకటించాడు. విదేశీయులనోరుకట్టి స్వదేశంలో తనకు ప్రతిస్పర్థులుగా ఉన్నవారి నందరినీ మట్టుపెట్టాడు. ౧౯౩౪ జర్మన్ పార్లమెంటు గృహానికి నాజీలు నిప్పుపెట్టారు. ఈ ఘోరము కమ్యూనిస్టులపని అని దోషారోపణచేసి నాజీశత్రువు లందరినీ చిత్రవధచేశారు. జనరల్ ష్లీచరు హంతకునివాతపడ్డాడు. ప్రజలు దద్దిరిల్లిపోయారు. హిట్లరును వ్యతిరేకించి లాభంలేదని తెలుసుకున్నారు. ఇంతలో జర్మనీ వృద్ధభీష్ముడు మార్షల్ హిండెన్‌బర్గు (Hindenburg) చనిపోయాడు. హిట్లరు జర్మనీ అధ్యక్షుపదవిని, ఛాన్సెలరు పదవిని రెండింటిని తనమీదే పెట్టుకొని జర్మనీ 'నియంత' (డిక్టేటర్)గా తయారయాడు.

విదేశాంగనీతిలో కాలుపెట్టే లోపులో హిట్లరు

జర్మను ప్రజలను తృప్తిపరచాలని గుర్తించాడు. ప్రపంచ ఆర్థిక దుస్థితివలన జర్మనీలో నిరుద్యోగ కార్మికసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అన్నవస్త్రములు లేవు. వీరందరికి పనికల్పిస్తే కాని దేశంలో శాంతి ఉండదు. ఈ మానవసమూహాన్నంతనీ ఆతడు ఆయుధనిర్మాణ పరిశ్రమలో చొప్పించాడు. యుద్ధ సహాయకములైన మిలిటరీ రోడ్లు మున్నగు కార్యాలు నడిపించాడు. అచిరకాలంలోనే జర్మనీలో నిరుద్యోగం అనేది మాటకు కూడా లేకపోయింది. పైగా దేశంలో బ్రహ్మాండమైన శక్తిగల యుద్ధసాధనాలు పడి మూలుగుతున్నాయి. హిట్లరు బుద్ధికుశలతవలన ఒకదెబ్బలో రెండు పిట్టలుపడ్డాయి. అన్నంలేక అల్లాడుతూన్న తమకు అన్నం పెట్టించాడని ప్రజలంతా ఏకగ్రీవంగా 'హిట్లరువాదు'లయారు. పరరాజ్యాలను బెదిరించడానికి, జర్మన్ సామ్రాజ్య నిర్మాణానికి కావలసిన ఆయుధసంపత్తి హిట్లరుకు దొరికింది. ౧౯౩౮ నుంచీ జర్మనీ పరరాజ్యాలకు పక్కలో బల్లెం అయింది. హిట్లరు అధికారంలోకి రాకముందే జర్మన్ సైన్యము శక్తివంతమై యుండేది. జర్మన్ 'రీష్‌వేర్'లో బహిరంగంగా ఒక లక్షమంది ఉండేవారు. వీరుగాక సరిహద్దు రక్షకులపేరు చెప్పి, పోలీసువర్గముపేరు చెప్పి మరియొక లక్షమంది సుశిక్షిత సైనికులు సిద్ధంగాఉండేవారు. సక్రమ సైన్యంగాక జర్మనీలో ఎన్నో 'వాలంటీరు' సైన్యాలు ఉండేవి. వీటిని 'దేశభక్తుల సంఘాలు'ని లోకంకన్ను కప్పడానికి, అనేవారు. హిట్లరు వెంట నాలుగులక్షల వాలంటీరు సైనికదళం ఉండేది. వీరే హిట్లరు వెన్నెముకఅయిన 'బ్రౌన్‌షర్టులు' (Brown Shirts) 'బ్లాక్

షర్టులు' (Black Shirts). హిట్లరు మిత్రుడైన క్యాప్టెన్ రోహమ్ (Rohm) ముప్పదియైదు లక్షల సంఖ్య గల రహస్య సైన్యాన్ని నిర్మించిపెట్టాడు. ఈ భయంకరవు సంఘంవు తన సైన్యసహాయంతో తనకు ఆపద తెచ్చిపెడతాడేమో అని హిట్లరు శంకించి పీనిని మట్టుపెట్టించాడు. దేశంలో బ్రహ్మాండమైన సైన్యమూ, సైన్యాలకి కావలసిన ఆధునిక మారణసాధనాలూ సిద్ధం కావడంచూసి హిట్లరు విదేశ వ్యవహారాల్లో ధైర్యం అవలంబింపసాగాడు.

అయినప్పటికీ జర్మనీ సర్వసిద్ధంగా ఉండేదాకా కొంచెం ఒదిగిఉండడమే క్షేమమని హిట్లరు గుర్తించాడు. ౧౯౩౪ లో ఆతడు పోలండుతో సఖ్యపత్రం సంతకంచేశాడు. పది సంవత్సరములదాకా జర్మనీ తూర్పు సరిహద్దుల విషయమై వివాదం కల్పించదని హిట్లరు అంగీకరించాడు. అప్పటికప్పుడే డాంజిగు విషయమై జర్మనీ పోలండులకు వివాదం వస్తుందేమోఅని యూరపు రాజనీతిజ్ఞులు భయపడే వారు. అటువంటి ప్రమాదం లేకుండా జర్మన్-పోలిషు సఖ్యత ఏర్పడడం హిట్లరుయొక్క శాంతస్వభావమునకు తార్కాణమని బ్రిటనులోను ఫ్రాన్సులోను అనుకున్నారు. పోలండు మైత్రివలన రష్యాకునూ జర్మనీకినీ నడుమ వ్యవధానం ఏర్పడి అపాయభయం తప్పిందికదాఅని హిట్లరు తృప్తిపడ్డాడు. ఫ్రాన్సు-పోలండులనడుమ ఉండే చిరకాల మైత్రి సడలిపోతూందని ఫ్రాన్సు లోలోపల భయపడింది. బ్రిటనులో జర్మనీయెడ సౌమనస్యం ఏర్పడాలని నాజీలు, కన్సర్వేటివు (Conservative) పక్ష నాయకులనూ వారిభార్య

లను జర్మనీకి ఆహ్వానించి ఎంతో ఆదరంతో ఆతిథ్యం జరిపే వారు. కొంతమంది బ్రిటిషు నాయకులు ఈ వలలో పడక పోలేదు.

పక్కనున్న జర్మనీలో నిరంతరం యుద్ధసన్నాహాలు జరుగుతూండడం, అపారమైన యంత్రీకృత సైన్యాలు, వైమానిక బలమూ దినదినాభివృద్ధి నొందడం చూసి ఫ్రాన్సు భయగ్రస్తమైంది. జర్మనీని అరికట్టడానికి యుద్ధభయం తగ్గించడానికి యూరపు తూర్పులో మరియొక లోకర్నో సంధి సమకూర్చాలని ఫ్రాన్సు తలిచింది. ఫ్రాన్సు తన పూర్వమిత్రులైన జెకోస్లొవేకియా, రుమేనియా, యుగోస్లావియా రాజ్యాలను సంప్రతించింది. పోలండుమాత్రం కలిసిరాలేదు. పోలండు జర్మనీతో సఖ్యపడి జెకోస్లొవేకియామీద దురాశాపూరితనయనాల్తో చూస్తూంది. తూర్పు లోకర్నో సంధిలో రష్యా ఉన్నట్లయితే తాను చేరనని పోలండు నిరాకరించింది. జర్మన్ నాజీలఔద్ధత్యంచూసి సోవియటువారు జాగ్రత్తపడవొచ్చారు. నాజీల కన్నులు యూక్రేన్ మీదపడ్డాయి. యూక్రేన్ ప్రాంతమునూ, ఆగ్నేయ యూరపునూ జర్మన్ దురాక్రమణనుంచి కాపాడాలని రష్యా పూనుకుంది. అందుచేత ఫ్రాన్సుతో చేతులు కలపడానికి రష్యా సిద్ధపడింది. 'ఫ్రాంకో-సోవియటు' సంధికి ఉపోద్ఘాతంగా రష్యా నానాజాతి సమితిలో చేరింది. జపాను జర్మనీలు విడిచిపెట్టడంచేత దుర్బలంగా ఉన్న లీగుకు రష్యా రాకవలన మళ్లీ కొత్త ఊపిరివచ్చినట్లయింది.

జర్మనీ భయంచేత ఫ్రాన్సు, రష్యాతో సంధికి ఒడబడింది. రష్యాస్నేహము ఎట్లాగా కోరదగినది. రష్యానుంచి

అపారమైన ముడివస్తులు నష్టమయి అవుతాయి. ఆర్థికస్థితి బాగుంది. గొప్ప సైన్యబలం ఉంది. హద్దులేని మానవసంపత్తి ఉంది. ఇట్టి రష్యాను ఫ్రాన్సు దగ్గరకు తీసుకోకపోతే జర్మనీ తప్పక తీసుకుంటుంది. వెనుకటి రెపాల్లో సంధివిధానమును పునరుజ్జీవితం చెయ్యాలనే జర్మనులు లేకపోలేదు. కావున రష్యాను ముందు తానే కూడకట్టుకోడం మంచిదని ఫ్రాన్సు గుర్తించింది. ఫ్రాన్సుమిత్రములైన 'లిటిల్ ఎంటెంటీ' (Little entonte) రాజ్యాలకు రష్యా అవసరమైన సహాయం చెయ్యగలదు. కాని అప్పటి ఫ్రెంచి మంత్రి లావల్ (Laval) గారికి ఫ్రాంకో-సోవియటు సంధియందు ఎక్కువ ఉత్సాహము లేదు. పొరుగుజాతియైన జర్మనీతోనే సఖ్యపడడం ఫ్రాన్సు క్షేమానికి అవసరమని వారి ఉద్దేశము. రష్యాతో సఖ్యపడితే జర్మనీకి ఆగ్రహం వస్తుందేమోఅని ఆతడు శంకించాడు. అందుచేత ఫ్రాంకో-సోవియటు సంధిని నామకః అంగీకరిస్తున్నా దానిలో ముఖ్యమైన షరతులు చేరకుండా చేశాడు. ౧౯౩౫ లో ఫ్రాంకో-సోవియటు సంధిని సంతకం చేశారు. 'నిజంగా జర్మనీ దౌష్ట్యాన్ని అరికట్టాలంటే రష్యా, ఫ్రాన్సు ప్రభుత్వాలు సైనిక సంప్రతింపులు వెంటనే ఆరంభించాలని రష్యా సూచించింది. లావల్ మంత్రికి ఇది బొత్తిగా ఇష్టం లేదు. 'సదరు సంధివలన ఫ్రెంచి సైన్యము సోవియటువారి ప్రయోజనాలకు ఉపయోగించే ఉద్దేశము లేదు' అన్నాడు. కావున ఫ్రాంకో-సోవియటు సంధివలన కలుగవలసిన లాభం కలగలేదు సరికదా నష్టంకూడా కలిగింది. కమ్యూనిస్టులతో ఫ్రాన్సు సఖ్యపడిందని తిట్టిపొయ్యడానికి హిట్లరుకు మంచి

అవకాశం లభించింది. సైనిక సహాయ సూత్రం అంగీకరింపబడలేదు గనుక జర్మనీకి ఈ సంఘవలన ప్రమాదం లేదని లోలోపల హిట్లరు సంతోషించాడు. ఫ్రాన్సు పూర్వమిత్రము పోలండుకు రష్యావాసన కిట్టదు గనుక ఈ సంఘవలన ఫ్రాన్సుపై వైముఖ్యం కలిగింది.

జర్మనీ బలవంతమైన దేశంగా తయారవడం చూసి బాల్కను రాష్ట్రాలలో భయం బయలుదేరింది. ౧౯౩౪లో యుగోస్లావియా, గ్రీసు, రుమేనియా టర్కీలు కలిసి 'బాల్కన్ ఎంటెంట్' (Balkan entente) అనే సఖ్యతా పత్రమును సంతకం చేసుకున్నారు. అన్యోన్య సరిహద్దులను కాపాడుకోడం, బాల్కను రాష్ట్రాలమీద ఇతరులు దురాక్రమణ చేస్తే ఒండొరులకు సహాయం చేసుకోవడం, ఏ ఒక్కరు కూడా ప్రత్యేకముగా బాల్కనులకు బయటఉన్న రాష్ట్రాలతో సంప్రతింపులు చెయ్యకూడదు. చెయ్యవలసి వస్తే నలుగురు కూడబలుకుకొని ఏకకంఠంతో వ్యవహరించాలి. బల్గేరియామీద ఒక కన్ను ఉంచడం వారి ఉద్దేశం. ౧౯౨౦ నాటి సంధిపత్రాలను తిరగవెయ్యాలని కోరే జాతుల్లో బల్గేరియా ఒకటి. ఇటీవల ఫ్రెంచి విదేశాంగనీతి మునుపటివలెగాక జర్మనీ ఇటలీలను తృప్తిపరచే ఉద్దేశంతో నడవడం కనిపెట్టి బాల్కను ప్రభుత్వాలు భయశంకితము లయాయి. నియంతలను తృప్తిపరచడంకోసం చిన్న రాజ్యాలను ఎక్కడ ఎరగా పారవేస్తారో అని వారు సవ్యంగానే శంకించారు.

ఈ సమయంలో అంతర్జాతీయ పరిస్థితులు తప్పుత్రోవ

పట్టడానికి, నానాజాతి సమితి పూర్తిగా నిర్వీర్యం అవడానికి కారణం ఫ్రెంచిమంత్రి లావల్. లావల్ మంచి బుద్ధికుశలత కలవాడే. కాని ఆతనికి ఆదర్శప్రాయమైన విధానములందు నమ్మకము లేదు. ఆతడు యథార్థవాది. క్రమంగా అతనికి డెమోక్రాటిక్ (ప్రజాప్రభుత్వ) విధానముమీద విశ్వాసం తగ్గిపోజొచ్చింది. నానాజాతిసమితి పేరుకుమాత్రం సొంపుగా ఉండే సంస్థయని అతని ఉద్దేశము. లోకధర్మం ఎరుగని ఎవరో ఆదర్శవాదులు నిర్మించిన వ్యర్థసమాజము అని విశ్వాసము. అందుచేత ఫ్రెంచి విదేశాంగనీతిని యథార్థస్థితికి అనుకూలంగా నడపాలని లావెల్ యొక్క తలంపు. ఏమిటీ నూతన విధానము? జర్మనీ బలవంతమైన జాతి కనుక జర్మనీతో సఖ్యపడడం. ఈ సఖ్యతకు అడ్డు వస్తూన్నదేమిటి? చిన్న చిన్న రాజ్యాలకు ఫ్రాన్సు ఇచ్చిన సంరక్షకహామీ. ఈ బాధ్యతలను ఉపసంహరించుకొని ఇటలీ జర్మనీలతో మైత్రి చేసుకోవడమే ఫ్రాన్సు క్షేమానికి మార్గము అని లావల్ ఊహించాడు. లీగుమీద ఆతనికి అవిశ్వాసం గనుక లీగు విధానమునకు పట్టుకొమ్మయైన బ్రిటనుమీదకూడా అవిశ్వాసం కలిగింది. ఇన్ని సంవత్సరములు ఫ్రాన్సు ప్రభుత్వము, జాతి సమితి విధానమును, దాని ఛాయలో అంతర్జాతీయ శాంతిని కాపాడే సూత్రమును ఆదరించింది. సమిష్టి క్షేమ విధానమునకు (Collective Security) ప్రధానవక్తగా ఉంటూవచ్చిన ఫ్రాన్సుప్రభుత్వము లావల్ నాయకత్వంక్రింద హఠాత్తుగా పల్టీ కొట్టింది. 'ఎవరికివారే-యమునాతీరే' అన్నట్లు ఎవరి ప్రయోజనములనుబట్టి వారు సంధిపత్రాలు

వ్రాసుకోనవచ్చునని లావెల్ చెప్పుతూవచ్చాడు. తూర్పు యూరపులోని చిన్న రాజ్యాలవారు ఫ్రెంచినీతిలోని ఈ మార్పు తమకు సమ్మతంకాదని లావెల్ కు చెప్పారు. కాని ఆతడు వినలేదు. 'మీరుకూడా ఇటలీ జర్మనీలతో సఖ్య పడండి' అన్నాడు. లీగుకు పెద్ద దెబ్బ తగిలింది.

లావెల్ తన యథాస్థితి విదేశాంగనీతిని అమలులోకి తెస్తున్నాడు. ఈ ఉద్దేశంతో ఆతడు యూరపులోని ప్రధాన రాజ్యాలకు యాత్రపెట్టాడు. ఇటలీతో ముందు సఖ్యం కుదుర్చుకోవాలని ఫ్రెంచి సేనాధిపతులు అన్నారు. ఒకవేళ జర్మనీతో సఖ్యత కుదరకపోతే ఇటలీతో అయినా మైత్రి ఉండాలి. లేకపోతే ఫ్రాంకో-ఇటాలియన్ సరిహద్దు కాపాడటానికి ౧౭ 'డివిజన్ల' సైన్యం నిలపవలసివస్తుంది. ఇంత సైన్యం ఆల్ప్సు పర్వతాలమీద ఉండిపోతే రైన్ ప్రాంతంమీద జర్మనీతో తలపడడం ఎట్లా? కావున ఇటలీనైనా సుముఖం చేసుకోవాలి. లావెల్ రోముకు యాత్ర చేశాడు. ముస్సోలినీతో తప్పక సఖ్యం ఏర్పడుతుందని ఆతడు నమ్మాడు. సాలీడువలె వల మధ్యన ముస్సోలినీ చిరునవ్వుతో కూర్చున్నాడు. ఫ్రెంచివారికి ఎంతో ఆదరం చూపెట్టాడు. ఆస్ట్రియా విషయమూ, కాలనీలవిషయమూ మాట్లాడారు. 'జర్మనీ కనుక ఆస్ట్రియాను మింగెయ్యడానికి యత్నిస్తే ఇటలీ సైన్యాలు నిరోధిస్తాయ'ని ముస్సోలినీ అన్నాడు. లావెల్ తృప్తిపడ్డాడు. ట్యూనిస్ (Tunis) విషయంలో ముసోలినీ అప్పుడే పేచీ పెట్టదలచుకోలేదు. మరికొన్ని చిల్లరవిషయాలు ఇటలీకి అనుకూలంగా తేల్చుకున్నారు. అసలు ముసోలినీ

దృష్టి ఇప్పుడు అబిస్సీనియా మీద ఉంది. ఇక్కడ ఒక పెద్ద నాటకం ఆడడానికి ఆతడు పూర్వరంగం తయారుచేస్తున్నాడు. అబిస్సీనియామీద దౌర్జన్యం చెయ్యాలంటే ఫ్రాన్సు సుముఖంగా ఉండాలి. యూరపులో గడబిడ ఉండకూడదు. అందుచేత లావెల్‌ను మవ్వి దువ్వి అబిస్సీనియా విషయంలో జోక్యం కలిగించుకోకుండా ఉండేటట్లు ఇటాలియన్ నియంత ఏర్పాటుచేసుకొని ఉంటాడు. బహిరంగంగా ఈవిషయం చెప్పబడలేదు. రహస్య సంభాషణలలో ఏదో స్వయంపాకంచేశారు. 'ప్రధానమైన ప్రెంచి ప్రమేయాలకు నష్టంలేకుండా ఇటలీ మైత్రి లభించిందికదా' అని లావెల్ మురిసాడు. 'ఈ ఎర్రమిరెంగి ఫ్రాన్సు అబిస్సీనియా దురాక్రమణ విషయంలో తాటస్థ్యం వహిస్తుందికదా. ఇప్పటికి ఇంతే చాల'ని ముస్సోలినీ సంతోషపడ్డాడు.

ఫ్రాంకో-సోవియటు సమాఖ్య అయినతర్వాత లావెల్ మాస్కోకు వెళ్లి స్టాలిన్‌తో మాట్లాడివచ్చాడు. అక్కడ సోవియటు వైమానిక బలం చూసి మెచ్చుకున్నాడు. కాని జర్మనీకి కోపం రాకుండా వ్యవహరించాలనే చిత్తవృత్తి అతన్ని బాధిస్తూనేఉంది. మాస్కోనుంచి వాపసువస్తూన్న లావల్‌ను వార్సా నగరంలో జనరల్ గోరింగు (Goering) కలుసుకున్నాడు. మార్షల్ పిల్సుడ్‌స్కీ (Pilsudski) అంత్యక్రియలకు వారంతా సమావేశమయారు. గోరింగు అతి చమత్కారంగా సంభాషిస్తూ ఫ్రాంకో-సోవియటు సమాఖ్య విషయం ఎత్తుకున్నాడు. లావెల్ ఆశ్చర్యపడ్డాడు. 'నాగరిక ప్రపంచకానికంతకీ ఒక్కటే శత్రురాష్ట్రం ఉంది.

# లీగుకు అగ్నిపరీక్ష.

అది ఏది? సోవియటు రష్యా. ఇట్టి లోకగర్హితమైన బొల్షెవిజమ్‌తో లావెల్ చేయి కలుపుతాడా? యూరపునుంచి విధ్వంసం చెయ్యవలసిన కమ్యూనిస్టులతో ఫ్రాన్సు మైత్రి నెరుపుతుందా' అని అన్నాడు గోరింగు. లావెల్‌కుకూడా ఈ భయం లేకపోలేదు. అప్పటినుంచీ లావెల్ రష్యా సమాఖ్య విషయమై నిరుత్సాహపరుడయాడు. ఫ్రెంచి మంత్రిని హడలగొట్టి సంధిగ్ధావస్థలో పడవేసిన వాదమే బ్రిటనులోకూడా ప్రచారం చెయ్యబడింది. ("యూరపు రాష్ట్రములన్నియు ఏకీభవించి కమ్యూనిజంను రూపుమాపాలి. కమ్యూనిస్టు ప్రమాదమే యూరపునంతను ఒక్కచోటికి చేరుస్తూంది. సక్రమవిధానమూ, ఆస్తిపాస్తులూ అంటే గౌరవంకల జాతులన్నీ రష్యావంకకు మరలాలి. యూరపు శత్రువులు అక్కడ ఉన్నారుకాని జర్మనీలో లేరు.") అని నాజీలు ప్రచారం సాగించారు. ఫ్రాన్సులోను బ్రిటనులోనుకూడా పూర్వాచార పరాయణులంతా ఈ ఎరమింగారు. 'ఫ్రాన్సు బ్రిటనులు రష్యాతో సఖ్యపడకుండా చేశామ'ని నాజీలు లోలోపల హర్షించారు.

అబిసీనియా మీద దండప్రయోగం చెయ్యాలని రహస్యంగా ముస్సోలినీ ఏర్పాట్లు చేస్తున్నాడు. అబిసీనియా ఇటలీ వశమైతే ఆఫ్రికాలోని బ్రిటిషు ప్రమేయాలకు ప్రమాదంఉంది. అందుచేత ఇటలీ దురాక్రమణమును బ్రిటను అడ్డగించవచ్చును. కాని ప్రపంచ ఆర్థికదుస్థితిలో తగుల్కొని బాధపడుతూన్న బ్రిటిషువారు సాహసించి ఇటలీపై యుద్ధం ప్రకటించరని ముస్సోలినీ అంచనా వేసుకున్నాడు. హిట్లరు తన

పక్షాన ఉంటే ఫ్రాన్సును ధిక్కరించవచ్చునుగదా అని అతడు అనుకున్నాడు. హిట్లరు-ముస్సోలినీలు వెనిస్‌లో కలుసుకున్నారు. హిట్లరు ఇటలీయొక్క గొప్ప మిత్రమని ఇటాలియన్ పత్రికలు స్తోత్రపాఠాలు చదివాయి. నాజీ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతంవంటిదే కనుక హిట్లరు తనకు ఏకలవ్యశిష్యుడని ముస్సోలినీ అనుకునేవాడు. ఈ అసాధ్యశిష్యుడు గురువుకు పంగనామములు పెట్టనేర్చినవాడని అతడనుకోలేదు. ఇటలీ విదేశాంగనీతికి హిట్లరు అనుచరుడుగా ఉంటాడని ముస్సోలినీ ఆశ. కాని నియంతల ప్రథమ సమావేశంలో వారికి ఏమీ సామరస్యం కుదరలేదు. జర్మనీ యుద్ధానికి సిద్ధంగా లేదని హిట్లరు అన్నాడట. జర్మన్ ఆయుధధారణ పెరిగినకొలదీ యుద్ధంతో పనిలేకుండానే జర్మనీ కోరికలు ఈడేరుతాయని హిట్లరు చెప్పాడట. ముస్సోలినీకి విసుగు పుట్టింది. హిట్లరువలన లాభం లేదని ఫ్రాన్సు వంకకు మరలాలని ఇటలీ తెలుసుకుంది. ఫ్రెంచివారికి జర్మనీ-ఆస్ట్రియా సమ్మేళనం భయోత్పాతంగా కనబడుతూంది కనుక ఈ సమ్మేళనం కాకుండా, ఇటలీ ఫ్రాన్సుకు తోడ్పడే పద్ధతిమీద ఫ్రెంచివారిని పడకట్టుకోవాలని ముసోలినీ ఎంచాడు. అతని పాచిక పారింది. లావెల్ మంత్రి మూలకంగా ఇటాలో-ఫ్రెంచి సఖ్యత ఏర్పడిన సమాచారం చెప్పియున్నాము.

ఫ్రాన్సు నోరు కట్టివేశామనే విశ్వాసం కలగగానే ముస్సోలినీ అబిస్సీనియా దండయాత్రకు కృతనిశ్చయుడయాడు. అయితే అబిస్సీనియా ఇటలీకి చేసిన అపచారం ఏమిటి? వాల్-వాల్ అనేచోట ఏదో సరిహద్దు జగడము

జరిగింది. ఇది వంకగాకొని ముస్సోలినీ అబిస్సీనియాను దండించి ఇటలీ సామ్రాజ్యంలో కలుపుకోదలచుకున్నాడు. 'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా' అన్నట్లు దురాక్రమణకు పూనుకొన్న వారికి వంకలు దొరకకపోతాయా? అబిస్సీనియావారు ఇటలీ వైఖరినిగురించి నానాజాతిసమితికి మొరపెట్టుకున్నారు. అబిస్సీనియాతో కల వివాదమును శాంతిపద్ధతులమీద పరిష్కరించుకోమని ఇటలీని లీగువారు కోరారు. ముస్సోలినీ ఇందుకు సుతరాం అంగీకరించనన్నాడు. పైగా లీగుమీదను బ్రిటిషువారిమీదను దూషణ పరంపరను, బెదిరింపులను ప్రయోగించాడు. బ్రిటను కనుక ఇటలీ ప్రయోజనములకు అడ్డుతగిలినట్లయితే మధ్యధరాసముద్రంలో బ్రిటిషు నౌకాస్థానములను బాంబు చేయిస్తానన్నాడు. ఇటలీకి ఎవరు అడ్డువచ్చినాసరే వారు ఫాసిస్టుసైనికుల సన్నీలకు గురియయిపోతారని బెదరించాడు. ఇటలీకి గుణపాఠం నేర్పాలని బ్రిటిషుప్రతినిధులు నిశ్చయించుకున్నారు. లీగు శాసనము యొక్క ౧౬ వ సూత్రప్రకారము, లీగు నియమాలకు వ్యతిరేకంగా ఎవరు యుద్ధానికి దిగుతారో వారిమీద ఆర్థిక సైనిక ఆంక్షలను ప్రయోగించాలని నియమముంది. ఈ నియమం ప్రకారం ఇటలీమీద ఆంక్షలను విధించాలని సర్ సామ్యూల్ హోరు (Sir Samuel Hoare) గారు ప్రతిపాదించారు. 'జాతిసమితియొక్క పరపతి నిలబెట్టాలంటే, సమిష్టి క్షేమవిధానం ఆచరణలో ఉండాలంటే ఇప్పుడు ఇటలీ వైఖరిని తీవ్రంగా నిరోధించాలి'ని ఆయన వాదించాడు. ఈ పరీక్షా సమయంలో జాతిసమితి నెగ్గుతుందో ఓడిపోతుందో దాని

# రెండో ప్రపంచయుద్ధమా?

మీద లీగుయొక్క భావిదశ ఆధారపడిఉంటుందని బ్రిటను చెప్పింది. 'ఇటలీమీద ఆంక్షలు ప్రయోగిస్తే బ్రిటను సర్వ విధముల తోడ్పడుతుంద'ని హోరు చెప్పాడు.

కాని మంచి సుసమయంలో ఫ్రాన్సు నీళ్ళు నములడం మొదలుపెట్టింది. లావెల్ గారు ఇటీవలనే రోమునందు మైత్రి సమాఖ్య చేసుకునివచ్చాడు. ఇంతలోనే ఇటలీమీద ఆంక్షలు వెయ్యడం ఎట్లాఅని అతడు ముందువెనుకకు ఊగిసలాడి కాల హరణం చెయ్యడం మొదలుపెట్టాడు. ౧౯౨౮ నుంచీ ఫ్రాన్సు లీగుకోసమూ, సమిష్టి క్షేమసూత్రంకోసమూ చెవిని ఇల్లుకట్టుకు పోరుతూంటే బ్రిటను వినలేదు. మధ్య యూరపు రాజకీయాల్లో ఫ్రాన్సు ఉద్దేశంతో కలిసిరాలేదు. ఇప్పుడు ఇటలీ చర్యవలన బ్రిటిషువారి నైలు నదీతీర ప్రయోజనము లకు ప్రమాదం నస్తేమాత్రము ఫ్రాన్సు ఎందుకు కలగచేసు కోవాలని లావెల్ ఆలోచించుకొని ఉంటాడు. "ముసోలినీ ప్రతిష్ఠకోసం పాకులాడుతున్నాడుకాని నిజంగా అబిసీనియాను అంతనూ అతడు జయించబోడు. అబిసీనియాలో కొన్ని స్వల్ప విజయాలు కలిగినతర్వాత అతడు రాజీకి రాక మానడు. తొందరపడి ఆంక్షలువేసి ఇటలీకి ఆగ్రహం తెప్పించడం ఎందుక"ని అతని వాదము. అబిసీనియా విషయంలో బ్రిటను ఫ్రాన్సుల దృక్పథములు వేరువేరుగా ఉన్నట్లు తేలింది. ఇటలీకి కావలసిన సదవకాశము ఇట్టిదేకదా! ఫ్రాన్సు సహాయం లేకుండానే బ్రిటిషుప్రభుత్వము కొంత నౌకాబలమును మధ్యధరాసముద్రంలో నిలబెట్టింది.

జెనీవాలో వాగ్యుద్ధం జరుగుతూండగానే ముసోలినీ

## లీగుకు అగ్నిపరీక్ష.

అబిస్సీనియామీద దాడి నడిపించాడు. లీగువారు ఇటలీ మీద ఆర్థికమైన ఆంక్షలు ప్రయోగించారు. ఈ ఆంక్షలనైనా అన్నీ ఒక్కమాటు ప్రయోగించకుండా క్రమక్రమంగా ప్రయోగించాలని లావెల్ సమర్థించాడు. ఫ్రాన్సు తనతో కలిసి రాదని తెలుసుకొని బ్రిటను క్రమంగా వెనుదియ్యడం మొదలుపెట్టింది. బ్రిటిషువారొక్కరే ఇటలీ ఆగ్రహమునకు గురికావడం ఎందుకని వారు తలచిఉంటారు. అందుచేత వారుకూడా ఇటలీని ప్రసన్నంగా చేసుకోవాలని యత్నించారు. ఆంక్షలు మాటవరుసకు అమలులో ఉండేవి కాని ఇటలీకి ఒత్తిడి కల్గించేటట్లు ఇవేమీ ప్రయోగింపబడలేదు. ఇటలీ సైన్యానికి సమృద్ధిగా నూనె సప్లయి ఉంటేకాని అబిస్సీనియాలో విజయం కలగదు. కావున నూనె ఆంక్షలు ప్రయోగిస్తే ఇటలీ కాళ్లుజాచిఉండేది. తప్పకుండా దారికి వచ్చి తన ధోరణి మార్చుకొనిఉండును. నూనె ఆంక్షలు ప్రయోగిస్తే యూరపులో యుద్ధం తప్పదని ముస్సోలినీ బెదిరించాడు. యుద్ధం పేరుచెప్పితే విముఖులుగాఉన్న డెమాక్రిసీలు ఈ కపట బెదరింపుకి లొంగిపోయారు. ఈ లోపులో ఇటలీని తృప్తిపరచడానికి హోరు-లావెల్ గార్లు ఒక పెద్ద పన్నాగం పన్నారు. రూపాయలో పదునాలుగు అణాలు అబిస్సీనియాదేశం ఇటలీకి ఇప్పిస్తామని సూచనలు చెయ్యబోయారు. ముస్సోలినీ వీటిని తిరస్కరించాడు. అబిస్సీనియా సాంతము ఇటలీ సామ్రాజ్యంలో కలవాలని పట్టుపట్టాడు. చివరకు ఆతని పట్టు నెగ్గింది. అబిస్సీనియా త్వరలోనే ఇటలీకి స్వాధీనం అయింది. హతభాగ్యులైన అబిస్సీనియా ప్రజలు

విషవాయువులకు, బాంబులకు ప్రాణాలు అర్పించారు. వారి స్వాతంత్ర్యం నశించింది. ఇటలీ చర్యను వ్యగ్రరూపంగా ఖండించడంలో ఒకరి నొకరు మించారు కాని యూరపుజాతులు ఎవరూకూడ నిరపరాధులైన అబిస్సినియావారికి ఆత్మరక్షణార్థకై ఆయుధాలుకూడా సప్లయిచెయ్యలేదు. జర్మనీమాత్రం కాపట్యం ఏమీ చూపెట్టలేదు. ఇటలీ చర్యను బహిరంగంగా ఆమోదించింది. ఆంక్షలను వెయ్యవద్దని ఎదుర్కొంది. ఈ ఉపకారమును ముస్సోలినీ మరిచిపోలేదు. ఈ మైత్రియే క్రమంగా చిక్కబడి ముందుముందు రోము-బర్లినుకాడి (రోమ్-బర్లిన్ ఆక్సిస్)గా పరిణమించింది. ఫ్రాన్సు బ్రిటనులు తమ తటపటాయింపుమూలంగా ఇటలీని ఎదుర్కొలేకపోయారు. ఇటలీ మైత్రినిసంపాదించలేకపోయారు. రెండు విధముల వారు పరాజయంతిన్నారు.

యూరపు దృష్టిఅంతా ముస్సోలినీమీద లగ్నమయి ఉండగా చూసి తరుణం కనిపెట్టి హిట్లరు వెర్సాయిల్సు సంధి నిర్ణయాలను బలవంతంగా రద్దు చెయ్యడం మొదలుపెట్టాడు. జర్మన్ ప్రాంతమైన సార్‌లోయ ౧౫ సంవత్సరములదాకా అంతర్జాతీయ కమిషనువారి అధీనంలో ఉండాలని షరతు ఉన్నదికదా! ౧౯౩౫లో ఈ ప్రాంతమందు ప్రజాసమ్మతి గైకొనబడింది. హిట్లరు సమగ్రమైన నాజీప్రచారం మూలకంగా సార్ ప్రజాసమ్మతి అనుకూలంగా నెగ్గించుకో గలిగాడు. సార్ ప్రాంతం జర్మనీకి లభించినట్లయితే నేను పూర్తిగా సంతృప్తిపడానని హిట్లరు ఫ్రాన్సుకు అభయం ఇచ్చాడు. ౧౯౩౫ లోనే వెర్సాయిల్సు నిర్ణయానికి వ్యతి

రేకంగా జర్మనీలో నిర్బంధ సైనికవరణ విధానము ఆచరణలో పెట్టాడు. దీని మూలకంగా జర్మనీలో అసంఖ్యాకమైన సైన్యాలు సంసిద్ధమవుతున్నాయి. హిట్లరు కడు నేర్పరి. ఒక చెంప పగిలేటట్లు కొట్టుతూ మరొక చెంప ముద్దుపెట్టుకునే కపటం ఆతని సొమ్ము. సంధిపత్రాలను చించిపారవేస్తూ క్రొత్త సమాఖ్యలను చేసుకుందామని పరరాజ్యాలకు ఆతడు ఆశగొల్పుతూంటాడు. ముఖ్యంగా బ్రిటిషువారి సుముఖత్వం సంపాదించాలని ఆతడు వెంటనే ఆంగ్లో-జర్మన్ నౌకా సమాఖ్య చేసుకుంటానని తెలియబరిచాడు. నౌకాబలంలో బ్రిటనుతో పోటీ పడడం తన అభీష్టము కాదని చెప్పి బ్రిటనుకు మనోనిబ్బరం కలిగించాడు. నదరు సమాఖ్య ప్రకారము జర్మన్ నౌకాదళము బ్రిటిషు నౌకాబలంలో నూటికి 3౫ పాళ్లు వొప్పున మాత్రమే ఉంటుందని ఏర్పాటు. బ్రిటిషు నౌకాధిపత్యమునకు ఇంక ఉపద్రవం లేదుకదా అని బ్రిటిషు వారు తృప్తిపడ్డారు. చర్చిలుగారొక్కరే ఇందులో ఆపద లేకపోలేదని శకునం చెప్పాడు. కాగితంమీద జర్మన్ నౌకలు బ్రిటిషు నావికబలంలో మూడవవంతైనప్పటికీ, బ్రిటిషు నౌకలు పురాతనము లవడంచేతనూ, జర్మనీ ఇప్పుడు క్రొత్తగా నిర్మిస్తుందిగనుకనూ, ఈ రెండు నౌకాబలముల తారతమ్యమూ ఒకటిలో మూడవ భాగం కాదని ఆతడు వాదించాడు.

---

## ౫. సమిష్టి క్షేమవిధానము.

౧౯౩౬ సంవత్సరములో అంతర్జాతీయ రాజకీయాకాశమునందు విపత్తు మేఘాలు గుమికూడుతున్నాయి. ఇటలీ అబిసీనియామీద దౌర్జన్యంచేస్తూంది. నానాజాతిసమితి ఏమీ చెయ్యలేక తన అశక్తతను కనబరిచింది. బ్రిటను విచిత్రావస్థలో తగుల్కొని యూరపులో తన పలుకుబడిని ప్రయోగించలేకపోతూంది. బ్రిటను ఆయుధబలము ఇప్పుడు సమగ్రస్థితిలో లేదు. ప్రపంచ ఆర్థికదుస్థితిమూలంగా బ్రిటిషు ప్రభుత్వము, దేశముయొక్క ఆయుధబలంపైన ఎక్కువ ధనము వ్యయం చేయలేకపోయింది. జర్మనీ రహస్యంగా ఆయుధాలు నిర్మించుకుంటూందని తెలిసినతరువాత కూడా రెండు సంవత్సరాలదాకా ఆయుధనిర్మాణమునందు బ్రిటను తీవ్రప్రయత్నాలు చెయ్యలేదు. జర్మనీ వైమానికబలము బ్రిటనుకు ప్రమాదస్థానమని గుర్తింపబడిందికాని రెండుదేశాల వైమానికబలంలో తారతమ్యం ఎక్కువలేదని బ్రిటిషు ప్రభుత్వము ఊరడిల్లేది. చర్చిలువంటివారు కొందరు జర్మన్ వైమానికబలము బ్రిటిషుబలంకన్న చాలాపెద్దదనియూ, నాల్గైదు సంవత్సరములలో రెండు వైమానికబలముల నడుమఉండే తారతమ్యం చాలా భయంకరంగా ఉంటుందని హెచ్చరిస్తూ వచ్చారు. నౌకాబలంలోకూడా నూటికి ౩౫ వంతు నిర్ణయమువలన జర్మనీ నౌకాబలము బ్రిటను నౌకాశక్తిలో సగం మించిన బలం కలది అవుతుందని చర్చిలు వాదించాడు. ఈవిధంగా యూరపులో బ్రిటనుయొక్క గొప్ప పలుకుబడి తగ్గిపోవడమే కాకుండా బ్రిటిషు దీవుల క్షేమానికే ప్రమాదం పుట్టి పెరుగుతూందని ఆయన భయం వెలిబుచ్చాడు.

## సమిష్టి క్షేమవిధానము.

౧౯33 మొదలుకొని ఇప్పటికి మూడున్నర సంవత్సరాలనుంచి జర్మనీలో పునరాయుధనిర్మాణం నిరంతరాయంగా జరుగుతూంది. లక్షలకొద్ది కార్మికులు దీనిలో నియుక్తులై ఉన్నారు. ఈ కాలంలో ఆయుధనిర్మాణంమీద జర్మనీ ౧,౫౦౦,౦౦౦,౦౦౦ పౌండ్లు వెచ్చించిందని కొందరు అంచనా వేశారు. ఇంతపెద్ద మొత్తము జర్మనీ ఎల్లా వెచ్చించగలుగుతూంది? జర్మనీ ధనాఢ్యమైన దేశము కాదే? దీనికి సమాధానము ఋణము చేయుట. దేశంలో ఉండే సర్వ ఆర్థిక శక్తులనూ ప్రభుత్వం చేతిలో పెట్టుకుంది. ఎడాపెడా అప్పు చేసి ఆయుధ యంత్రాగారములను నడిపిస్తూంది. జర్మనీ యొక్క దేశాదాయము మూడునాలుగు సంవత్సరముల దాకా కుదువపెట్టి అప్పు పుట్టించి జర్మనీ యుద్ధానికి సిద్ధమవుతూంది. కాని హిట్లరుకు ఎన్నాళ్లు ఇల్లా అవిచ్ఛిన్నంగా ఋణాలు దొరుకుతాయి? దేశంలో అప్పు ఇచ్చే శక్తి తగ్గిపోతూంది. ఇంక ఎంతో కాలము ఆయుధయంత్రపు మరలు తిరగడానికి అవకాశంలేదు. ఆయుధనిర్మాణం ఆగిపోతే ఈ భయంకర పరిశ్రమలో ఉన్న కార్మికులంతా మళ్ళీ 'అన్నమో రామచంద్రా' అంటూ వీధుల పడతారు. నాజీ ప్రభుత్వము యొక్క జనరంజకత్వము కడముట్టుతుంది. మళ్ళీ విప్లవపరిస్థితులు ఎదుర్కొంటాయి. నాజీ ప్రభుత్వము ప్రజలనాకర్షిస్తూ ఉండాలంటే ప్రజాదృష్టిని గృహచ్ఛిద్రములమీద ప్రసరింపనీయక వారి భావంఅంతా విదేశములవంక మరలించాలి. ప్రజలకు తమ దురవస్థనుగురించి వాపోవడానికి అవకాశం కలిగించకూడదు. నాజీ ప్రభుత్వము విదేశాంగ

నీతిలో విజయం పొందుతూంటే వారి ఇంటి పరపతి నిలుస్తుంది. 'హిట్లరు దేశగౌరవం పెంపొందిస్తున్నాడు కదా; మనం కొంతవరకూ కష్టాలు సహించాల'ని ప్రజలు అణగిమణగి ఉంటారు. జర్మనీ ప్రజలు దేశగౌరవం ముందర ఆకలిదప్పులనుకూడా గణించని ధీరులనడంలో సందేహంలేదు. వెర్సాయిల్సు విధానంమీద దాడి చేస్తూ జర్మనీని బంధించిన సంకెళ్ళను హిట్లరు త్రెంపగలిగినన్నాళ్ళూ ప్రజలు ఓపికపడతారు. కావున హిట్లరు వెంపరియై పొరుగురాజ్యాలను నిర్బంధించడానికి పూనుకున్నాడు. నాజీ ప్రభుత్వమునకు ఇంటనో బయటనో ప్రళయం తప్పదు. అందుచేత బయటి ప్రళయమే వారు నిశ్చయించారు. జర్మనీయొక్క ప్రచండఆయుధనిర్మాణాన్ని బట్టిచూస్తే ఈ ప్రళయము త్వరలోనే వచ్చేటట్లు కనబడింది.

సార్ ప్రాంతం చేజిక్కించుకొని హిట్లరు తన దృష్టిని రైన్‌లాండు వంకకు మరల్చాడు. లోకర్నో సంధిషరతుల ప్రకారం రైనుప్రాంతంలో సైన్యాలు నిలపమనీ, అచ్చట దుర్గనిర్మాణములు చెయ్యమనీ జర్మనీవారు ఒప్పుకున్నారు. కాని కేవల జర్మన్ భూమిలో ఆత్మరక్షణకై కట్టుదిట్టాలు చేసుకోకూడదని నిష్పాక్షికులెవరూ చెప్పలేరు. కాని ఫ్రాన్సుకు జర్మనీపై ఉన్న అనుమానంచేతనూ భయంచేతనూ ఈ షరతు విధింపబడింది. రైన్‌లాండులో బలాత్కారంగా సైన్యాలు నిలిపితే బ్రిటను ఫ్రాన్సులు ససైన్యంగా అడ్డుకుంటారేమోఅనే భయం హిట్లరుకు లేకపోలేదు. ఆతని సేనాపతులు పొరవచెయ్యకూడదని వాదించారట. కాని

# సమిష్టి క్షేమవిధానము.

హిట్లరుకు ఆత్మప్రత్యయం ఎక్కువ. "ప్రజాస్వామిక ప్రభుత్వములు సంధిపత్రాలు చించిపారవేస్తూంటే 'మొర్రో, మొర్రో' అని కుయ్యోడవచ్చునుగాని వారు ధైర్యం చిక్కబట్టి యుద్ధానికి దిగరు"ని హిట్లరు విశ్వాసము. ఒకవేళ ఫ్రాన్సు ఎదురు తిరిగినచో జర్మన్ సైన్యాలు యుద్ధానికి తయారుగా లేవని హిట్లరు సేనానులు అన్నారు. "నా దౌరవఫలితంగా ఫ్రెంచి సేనలు జర్మన్ ప్రాంతంలో అడుగుపెట్టినట్లయితే నేను వెంటనే ఆత్మహత్య చేసుకుంటాను. మీరు సమయోచితంగా దేశం కాపాడవచ్చును"అని హిట్లరు చెప్పాడట. విదేశాల్లో ఉన్న జర్మనీ ప్రతినిధులు రహస్యంగా ఆచోకీ మొదలు పెట్టారు, రైన్ లాండులో జర్మనీ సైన్యాలు నిలిపితే వారు ఏమి చర్య తీసుకుంటారని. రైన్ లాండు విషయంలో తాను సంప్రతింపులు జరపడానికి సిద్ధంగా ఉన్నానని హిట్లరు అభయం ఇస్తూండేవాడు. హఠాత్తుగా మార్చి ౧౯౩౬ లో జర్మన్ సైన్యాలు రైన్ లాండు ఆక్రమించాయి. అదే గ్రుక్కలో హిట్లరు లోకర్నో సంధికి జర్మనీ కట్టుబడి ఉండదనియూ, రైన్ లాండును ససైనికంగా చెయ్యడానికి జర్మనీ నిశ్చయించినదనియూ ప్రకటించాడు. ఫ్రెంచివారికి ఏమి చెయ్యాలో తోచలేదు. కాళ్ళు కాలిన పిల్లుల్లాగ లోకర్నో సంతకం చేసిన ప్రభుత్వాలకోసం ప్రాకులాడారు. బ్రిటను సహాయం లేకుండా ఫ్రాన్సు ఎట్టి చర్యనూ తీసుకోడానికి సాహసించలేదు.

జర్మనీమీద తీవ్రచర్య తీసుకోవాలని ఫ్రాన్సు వాదించింది. ఇతర లోకర్నో ప్రతినిధులు దీనిని ఆమోదించలేదు.

సోవియటువారు మాత్రమే ఫ్రాన్సును సమర్థించారు. తమకు ఇష్టంలేని సమస్య వచ్చినట్లయితే యూరపు రాజకీయవేత్తలు అంతులేని వాగ్వ్యయంలో కాలయాపన చెయ్యగలరు. ఫ్రాన్సుకి ఇదే అవస్థపట్టింది. అబిస్సీనియా సందర్భంలో ఫ్రాన్సు తమతో కలసి రాలేదు గనుక రైనులాండు విషమ సమస్యలో బ్రిటిషువారు ముభావంగా ఉండిపోయారు. ఫ్రాన్సులోనే కొంతమంది యథాస్థితి వాదులు ఉన్నారు. 'జర్మనీ ప్రాంతమును జర్మనీ ససైనికంగా చేసుకుంటే మునిగిపోయిందా', అని ప్రభుత్వాన్ని నిరుత్సాహపరిచారు. ఇదంతా ఫ్రాంకో-సోవియటు సమాఖ్యవలన వచ్చిన అనర్థపరంపరయని ఫ్రెంచి ధనాఢ్యవర్గము గోలపెట్టారు. హిట్లరుకూడా ఇదే ప్రచారం చేశాడు. ఇంతలో బ్రిటనుకు విశ్వాసభంగం కలగకూడదని హిట్లరు ఒక ప్రకటన చేశాడు. 'రైనులాండులోకి పంపిన సైన్యం స్వల్పసంఖ్యాకంగా మాత్రమే ఉంటుంది. ఇప్పటినుంచి ౨౫ సంవత్సరములదాకా శాంతిని కాపాడడానికి జర్మనీ సిద్ధంగా ఉంది. వైమానిక సమాఖ్యకుకూడా జర్మనీ అంగీకరిస్తుంది. జర్మనీ నానాజాతి సమితిలో పునః ప్రవేశం చెయ్యడం ఆలోచిస్తుంది.' అని ప్రపంచానికి జోల పాడాడు హిట్లరు. 'అయినదేదో అయిపోయింది. ఇకముందైనా యూరపు వ్యవస్థను పునర్నిర్మాణం చెయ్యడానికి అవకాశాలు కనబడుతున్నా'యని లండను టైమ్సు పత్రిక బ్రిటిషువారిని ఓదార్చింది)

'ఓడ దాటేదాకా ఓడమల్లయ్య, ఓడ దాటినతర్వాత బోడమల్లయ్య' అన్నట్లు రైనులాండు ససైనికం చెయ్యడం

# సమిష్టి క్షేమవిధానము.

యుద్ధం లేకుండా, ఒక్క తుపాకి పేలకుండా జరిగిపోయిన తర్వాత హిట్లరు తాను వాగ్దానం చేసిన శాంతి సమాఖ్య మాటను ఎత్తడం మానేశాడు. ఆతని అవసరం గడిచి పోయింది. రైన్‌లాండులో దుర్గశ్రేణులు నిర్మించకుండా హిట్లరు ఊరుకుంటాడేమో అని ఆశపడ్డారు. కాని ఆ యాశ కూడా అడియాసయైపోయింది. రైన్ నదీతీరం వెంట జర్మనీ దుర్గాలు నిర్మించుకోగలిగితే జర్మనీమీద బలప్రయోగం చెయ్యడానికి బ్రిటను ఫ్రాన్సులకు అవకాశం చిక్కదు. పశ్చిమ సరిహద్దుమీద ప్రమాదభయం లేకపోవడంచేత జర్మనీ మధ్య యూరపులో తన ఇష్టంవచ్చినట్లల్లా వ్యవహరించడానికి వీలు కలిగింది. తూర్పు యూరపులోని చిన్న చిన్న రాజ్యాలు భయంచేత దిక్కులు చూస్తున్నాయి. కూలిపోతూ ఉన్న లీగును నమ్మి సమిష్టి క్షేమసూత్రం అవలంబముగా స్వీకరించడమా? లేక ప్రబల శక్తివంతముగా కనబడుతూన్న జర్మనీని ప్రసన్నంగా చేసుకొని సఖ్యపడడమా ? ఈ విషమ సమస్యలో వారు తన్నుకుంటున్నారు.

ఏ అదను చూసి జర్మన్ సైన్యాలు తనమీద పడతాయో అనే భయంచేత ఫ్రాన్సు తన తూర్పు సరిహద్దుమీద అభేద్యమైన దుర్గాలు నిర్మించుకుంది. వీటినే 'మాజినో' (Maginot) దుర్గశ్రేణి అంటారు. ప్రపంచకంలో ఎక్కడా ఇట్టి దుర్భేద్యమైన దుర్గపంక్తి లేదని వ్యూహజ్ఞులు చెప్పుతారు. విశేషభాగం ఇవి భూగర్భంలో నిర్మించబడ్డాయి. ఇందులో సైనికులకు సర్వ సౌకర్యములూ ఏర్పరుపబడ్డాయి. రైన్‌లాండు ససైనికం చెయ్యబడిన తర్వాత ఫ్రాన్సు ఈ

# రెండో ప్రపంచయుద్ధమా?

దుర్గాలను పొడుగించి ఉత్తరమున సముద్రతీరందాకా వ్యాపింపచేసింది. ఈ దుర్గశ్రేణుల చాటున నిలిచి జర్మనీయొక్క అసంఖ్యాక సైన్యాన్ని నిలవరించి ఆత్మరక్షణచేసుకోవచ్చును గదా అని ఫ్రాన్సు ఊరడిల్లింది. రైన్‌లాండును ససైనికం చెయ్యగానే బెల్జియం హాలండులకు ఎప్పుడో ఒకప్పుడు ప్రమాదం రాకతప్పదని తెలిసినవారు నిశ్చయించుకున్నారు.

హాలండు బెల్జియముల ప్రమాదమే తన ప్రమాదమని చిరకాలమునుంచీ బ్రిటను తలిచింది. బెల్జియంకి ఆపద రాకుండా చూడడం బ్రిటను క్షేమానికి అవసరము. రైన్‌లాండును ససైనికం చెయ్యడంచేత తన క్షేమానికి భావి కాలంలో విపత్తు రాగలదని బ్రిటను గుర్తించింది. బ్రిటను సరిహద్దు రైన్ నదీతీరంమీద ఉందని బాల్డ్విన్‌గారు వెనకట పార్లమెంటులో చెప్పాడు. కాని ఈ నీతిని ఆచరణలో పెట్టలేదు. ప్రస్తుత పరిస్థితులలో బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం దేశాలు మూడూ కలిసి వ్యవహరించడం అవసరమని తేలింది. ఫ్రాంకో-బ్రిటిషు వైమనస్యములు జర్మనీ భయంచేత కరిగిపోయాయి. ఈ మూడు రాజ్యాలు అన్యోన్య సహాయం చేసుకోడానికి అంగీకరించాయి. "ఫ్రాంకో-సోవియటు సమాఖ్య విషయంలో తనకుగల ఆక్షేపణలను అంతర్జాతీయ న్యాయస్థానములో జర్మనీ చెప్పుకోవాలి. రైన్‌లాండులో సైన్యాలు హెచ్చించకుండా వాగ్దానంచెయ్యాలి. ఇట్లా చెయ్యకపోతే ఫ్రాన్సు, బెల్జియం, బ్రిటను ప్రభుత్వాలు వెంటనే సైనిక సంప్రతింపులు ఆరంభిస్తార"ని ప్రకటించారు. ఫ్రాన్సు బ్రిటనుల నడుమఉండే వైమనస్యాలు పోతున్నాయని

గుర్తించి జర్మనీ ఆందోళన పొందింది.

ఫ్రాన్సు బ్రిటనులు సన్నిహితసంబంధాలు పెంచుకుంటూంటే ఇటలీ జర్మనీలు అన్యోన్య మైత్రికోసం బీజాలు చల్లుతున్నాయి. హిట్లరు అధికారంలోకి వచ్చినప్పటినుంచీ కూడా ముస్సోలినీసఖ్యత సంపాదించడం లాభకరమని తెలుసుకుని తదనుకూలంగా వ్యవహరించడం మొదలుపెట్టాడు. నేషనల్ సోషలిజముకున్నూ ఫాసిజంకున్నూ మధ్యన గాఢ మైత్రి నెలకొంటూందని ౧౯౩౪ లోనే హిట్లరు ఉపన్యసించాడు. ముస్సోలినీని తృప్తిపరచడానికి, టైరోలు ప్రాంతం జర్మనీ వాంఛించదని హిట్లరుమాటఇచ్చాడు. ఇంతమాత్రంతో ఫాసిస్టునాయకుడు పూర్తిగా తృప్తిపడలేదు. హిట్లరు స్నేహం వలన అతను అర్థించిన ప్రయోజనం వేరేఉంది. ఈ పేరు పెట్టుకొని బ్రిటను ఫ్రాన్సులను అదరబెట్టి మధ్యధరా సముద్రంలో ఇటలీకి విశేషాధికారం సంపాదించడమే అతని ప్రధానప్రయోజనం. మధ్య యూరపులో జర్మనీ బలపడడం ఇటలీకికూడా ఇష్టంలేదు. ముఖ్యంగా ఆస్ట్రియా, హంగేరీ, బాల్కను ప్రాంతము ఇవన్నీ ఇటలీ గిరిలో చేరవలసి ముస్సోలినీ వాదము. ఆస్ట్రియా జర్మనీల సమ్మేళనము సంభవిస్తే ఇటలీ ఉత్తరసరిహద్దుకి ప్రమాదం కలదు. అందుచేత ఈ సమ్మేళనం నిరోధించడానికి ఇటలీ మొదట పూనుకుంది. ౧౯౩౪లో నాజీలు ఆస్ట్రియాలో కల్లోలం లేవదీశారు. ఆస్ట్రియా ఛాన్సలరు డోల్ఫసు ( Dollfuss ) హత్య చెయ్యబడ్డాడు. ఈ దౌర్జన్య కలాపంలో హిట్లరు చెయ్యి లేకపోలేదని కొందరు అన్నారు. ఆస్ట్రియా సమ్మేళనం జరగకూడదని

నిశ్చయించి ముస్సోలినీ తన సైన్యాలను బ్రెన్నర్ కనుమకు తరలించి సిద్ధంగా ఉంచాడు. ఈ సంరంభంచూసి హిట్లరు తొందరపడడం క్షేమంకాదని తెలుసుకొని ఆస్ట్రియాలో కలవరం కలిగించడం తాత్కాలికంగా మానేశాడు. ఆస్ట్రియా స్వతంత్రస్థితిని జర్మనీ అంగీకరించింది. కాని నాజీప్రచారమునకు ఆస్ట్రియాలో కొన్ని సౌకర్యాలు లభించాయి. ఆస్ట్రియా విషయంలో ఇటలీ జర్మనీలు వేర్వేరు ఆశలు కలిగిఉన్నాయి. కనుక ఈ రెండురాజ్యాలు ఎప్పుడూ ఐకమత్యంతో వ్యవహరించ లేవుగదా అని బ్రిటను ఫ్రాన్సులు గమనించి సంతృప్తి పడ్డాయి.

కాని త్వరలోనే ఈ ఆశలు అపోహాలని తేలింది. ఇటలీ అబిస్సీనియా యుద్ధంలోతగుల్కొంది కనుక ఆస్ట్రియా విషయం ఎక్కువ జోక్యంకలిగించుకునే స్థితిలోలేదు. అందుచేత జర్మనీ అవకాశాలు ప్రకాశవంతములయాయి. అబిస్సీనియా యుద్ధం దీర్ఘమైనకొద్దీ ముస్సోలినీ హిట్లరువంక చూడవలసి వచ్చింది. ఫ్రాన్సు బ్రిటనులు కనుక తీవ్రంగా ఆర్థిక ఆంక్షలను ప్రయోగిస్తే జర్మనీఒక్కటే ఇటలీముప్పుకు ఉపయోగపడేది. హిట్లరు, ఇటలీపై ఆంక్షలలో పాల్గొనలేదు. హిట్లరును ప్రసన్నం చేసుకోవాలని ముస్సోలినీ తనపూర్వ విదేశాంగ మంత్రిని తొలగించి తన అల్లుడు కౌంటుసియానోను ఆ స్థానంలో పెట్టాడు. ఇతడు జర్మన్ పక్షపాతి అవడమే దీనికి కారణము. ముస్సోలినీగారి ఎరుకతో 'ఆస్ట్రియా-జర్మనీ' సమాధానము ౧౯౩౬లో జరిగింది. ఆస్ట్రియా ప్రత్యేక స్వతంత్రరాష్ట్రమనీ, ఆస్ట్రియాగృహవ్యవహారముల మీద రహస్యంగా కాని

బహిరంగంగా కాని ఎట్టిద బావునూ చెయ్యనని జర్మనీ అంగీకరించింది.

ఆస్ట్రియా విషయం సమాధానం కుదరగానే అంతర్జాతీయ రాజకీయములలో భయంకర పరిణామమునకు మూలబీజము కాగల రోమ్-బెర్లిన్ కాడి ఏర్పడింది. ఇటలీ జర్మనీలు భావికాలంలో కలిసి వ్యవహరించడానికి ఏర్పాటు చేసుకున్నాయి. దీని షరతులు కొన్ని బహిరంగముగా తెల్పబడినను కొన్ని రహస్యంగా ఉంచబడ్డాయి.

౧. ఇటలీ జర్మనీలు స్పెయిన్ వ్యవహారాల్లో కలిసి ఏకముఖంగా వర్తిస్తాయి.

౨. జెనీవాలోకూడ ఉభయరాష్ట్రములూ ఒకదానికొకటి సమర్థించుకుంటూ నడవాలి. ఇటలీ చేసిన అబిస్సీనియా ఆక్రమణమును లీగు ప్రభుత్వాలు ఆమోదించేదాకా జర్మనీ తిరిగి జాతిసమితిలో చేరకూడదు.

౩. ఉభయరాష్ట్రములు పరప్రభుత్వాల్లో వేర్వేరుగా సంప్రతించక కలిసి వ్యవహరించాలి. ముఖ్యంగా ఫ్రాన్సును, ఫ్రాన్సు మిత్రరాజ్యములనూ దూరదూరంగా బహిష్కరించాలి.

రోమ్-బెర్లిన్ కాడి ఏర్పడినందుకు ముస్సోలినీ చాల సంతోషం ప్రకటించాడు. ప్రపంచానికి ఈ మైత్రిని వెల్లడిస్తూ ఆతడు పెద్ద ఉత్సవాలు చేయించాడు. ఇటలీ జర్మనీ జాతీయగీతాల్తో రోదోంతరములు చిల్లులుపడ్డాయి. ఇటలీజర్మనీలుకలిసి 'ఇస్తావా, చస్తావా' అనేసీతిని అనుసరిస్తూంటే బ్రిటను ఫ్రాన్సులు అన్యోన్యం పోరాడుకుంటూ రోమ్ బెర్లిన్ కాడి

లో చేరనేనా చేరుతాయి. లేదా ఏకాకులై నిల్చిపోతాయి. 'ఇంక ఉన్న బలవత్తరమైన శక్తి సోవియటు రష్యా. సోవియటు వారికి ఫ్రాన్సు బ్రిటనులకు పడిరాకుండా చెయ్యవచ్చును', అని నియంతలు గుణించుకున్నారు. 'ఫ్రాన్సు మిత్రములైన మధ్య యూరపు రాజ్యాలు, బాల్కను రాష్ట్రాలు ఇటలీ జర్మనీల శక్తిసామర్థ్యములూ, చొరవనూ గుర్తించి ఆత్మరక్షణంకోరి క్రమంగా కాడివంకకే మరలుతారు,' అని వారు ఊహించారు.

నవంబరు ౧౯౩౬ లో జర్మనీ మరియొక అపూర్వ సమాఖ్యను పుట్టించి రాజకీయులోకాన్ని ఆశ్చర్యపెట్టింది. దీనిని ఆంటీ-కమింటరన్ పాక్టు అంటారు. అనగా రష్యా వ్యతిరేక సమాఖ్య. జర్మనీ జపానులిద్దరూ సమాఖ్యదారులు. యూరపు వ్యవస్థకంతకూ సోవియటు ఒక్కటే మహామారి వంటిదని హిట్లరు నటించేవాడు. కావున రష్యాను యూరపులోంచి తరిమి వెయ్యడానికి సదరుసమాఖ్య ఏర్పడిందని లోకం భ్రమించాలని అతని ఉద్దేశము. అటు జపాను, రష్యా అంటే దద్దరిల్లుతూంది. చీనాలో తాను పూనుకొన్న దురాక్రమణకు రష్యా అడ్డుపడకుండా భయపెట్టాలని జపాను ఆశయము. రెండుప్రక్కలా ఇద్దరు ప్రబలశత్రువులుండడంవలన సోవియటు శక్తి కుక్కిన పేనులా పడిఉంటుందని వారు విశ్వసించారు. అచిరకాలంలోనే ఇటలీకూడా ఈ సమాఖ్యలో చేరడంచేత ఇది త్రిభుజసమాఖ్య అయింది.

ఆంటీ-కమింటరన్ సమాఖ్యయొక్క అంతరంగికోద్దేశమును దూరదృష్టిగల ఏ కొద్దిమంది రాజకీయ వేత్తలు

మాత్రమే తెలుసుకున్నారు. నిజంగా రోమ్-బెర్లిన్ టోకియో ప్రభుత్వాలు రష్యామీద పడదలచుకున్నాయా? అట్లా పడితే ఏమైనా లాభం ఉందా? వారి ఉద్దేశం ఇది కానే కాదు. రష్యావంటి మహత్తరశక్తితో యుద్ధానికి పూనుకోవడంవలన గాయాలు తప్ప ఏమీ మిగులదు. రష్యానుంచి గుంజుకోదగ్గ పారితోషికము లేవీలేవు. అయితే ఎందుకీ శ్రమ? రష్యా వ్యతిరేక సమాఖ్యను ఒక కపట నాటకానికి తెరగా వాడదలచుకున్నారు. 'బ్రిటను, ఫ్రాన్సు, అమెరికా మున్నగు ధనాఢ్య సామ్రాజ్యవాద దేశాలను కొట్టితే ఏదైనా లబ్ధి ఉంటుంది. ఈ దేశాలు తమతమ ప్రపంచవిస్తృత పరిమేయాలను రక్షించుకోడానికి సంగ్రామంలో దిగే సూచనలు కనబడడంలేదు. వీరిమీద కొంత వేడి పుట్టిస్తే మెల్లమెల్లగా వీరు తమ ఆయువుపట్టులను త్రిభుజసమాఖ్యదారుల చేతికి అప్పగిస్తారు. వీటిని చేజిక్కించుకొని ఇంకా శోధించి ఉన్నదంతా అపహరించి ప్రజాస్వామిక ప్రభుత్వాలను పీల్చి పిప్పిచేసి పారవెయ్యవచ్చును. ప్రపంచాన్ని తిరిగి విభజించుకునే సుముహూర్తం వచ్చింది. డెమాక్రసీల అదృష్టదినాలు చెల్లిపోయాయి. విజయలక్ష్మి రోమ్-బెర్లిన్-టోకియో జెండాలమీద వ్రాలడానికి ఉత్సాహపడుతూంది. నేర్పుతో ఆమెకు స్వర్ణశృంఖలములు తగిల్చి త్రిభుజంవంకకు లాగుకోవాలి,' ఇది వారి రహస్యనీతి. అయితే సామ్రాజ్యవాద దేశాలని కన్ను కప్పడం ఎట్లా? ఆరంభంలోనే వారిని బెదరకొట్టి వారు ఆత్మరక్షణకై నిలబడేటట్లు చేస్తే వేసిన ఎత్తు విఫలమవుతుంది. అందుకై త్రిభుజమే వారికి క్షేమకరమైన కవచ

మనే విశ్వాసం పుట్టించాలి. సామ్రాజ్యవాద దేశాలకు సామ్యవాదం అన్నా, కమ్యూనిజంఅన్నా, సోవియటు విధానం అన్నా సింహస్వప్నము. ధనాఢ్యవర్గము పాలిటి వినాశబీజము రష్యాలో మొలకెత్తి వృక్షమవుతూందని వారు కుమిలి పోతూంటారు. ఈ విషవృక్షంమీదపడి తెగనరికే సాహసులు దొరికితే వారికి ఏదో స్వల్ప లంచము ఇచ్చి ఈపుణ్యకార్యం చేయించడం ఆత్మక్షేమమునకు అవసరముగదాఅని వారు అనుకుంటారు. తమ సామ్రాజ్యాల్లో ఒకవంతు అర్పించి యైనా సంఘువిప్లవం కోసం కంకణం కట్టుకొన్న సోవియటును నిర్జింపచెయ్యాలి. ఇది ధనాఢ్యవర్గనీతి. ఊహాపరులైన త్రిభుజ పాలకులు ధనస్వామికవర్గమువారి మనోభయములను పసిపట్టారు. పసిపట్టి సామ్యవాద విప్లవంమీద తాముకూడా కత్తికట్టినట్లు నటించడం మొదలుపెట్టారు. ఈ పేరు పెట్టుకొని సామ్రాజ్యవాదుల ఇనుప పెట్టెల్లో చెయ్యిపెట్టవచ్చును. ఆంటీ-కమింటరన్ సమాఖ్య యొక్క తత్వం ఇది. కాని సామ్రాజ్యవాదులు తమ ప్రమాదం గుర్తించలేకపోయారు. సోవియటు విధ్వంసానికి సర్పయాగం నడుస్తూందికదాఅని చాలా ముచ్చటపడ్డారు. పైగా తామొక్క రక్తపు బొట్టు వ్యయించనక్కరలేదు. ఎంత లాభసాటి బేరమోకదా !

రోమ్-బెర్లిన్ కాడి ఏర్పడగానే ఇటలీ మధ్యధరా సముద్రపునీతిని అమలులోనికి పెట్టదలచింది. మధ్యధరాసముద్రము ఇటాలియన్ ప్రయోజనమని ముస్సోలినీ వాదము. ఈసముద్రతీరంలో నివసించని బ్రిటనుకు ఇందులో ప్రాధాన్యం ఉండకూడదని ఇటలీ అభిప్రాయము. అట్లే ఫ్రాన్సుకు

కూడా అట్లాంటిక్ సముద్రతీరం ఉందిగనుక మధ్యధరా సముద్రంలో స్థానం అవసరంకాదు. ఇటలీ ప్రధానంగా మధ్యధరా సముద్రశక్తి గనుక ఇటలీకి ఈ జలభాగంమీద సంపూర్ణాధికారం ఉండాలి. అందులో పూర్వరోమక సామ్రాజ్యమును పునఃనిర్మించదలకున్న ముసోలినీకి మధ్యధరాసముద్రాధిపత్యం అత్యవసరము. ఇటలీయొక్క వలస ఆశయములనుగురించి ఒక ఫాసిస్టుపత్రిక ఇట్లా వ్రాసింది. "నీస్, కార్సికా, మాల్టా మున్నగునవి ఇటలీయొక్క సహజ సరిహద్దులలో పడవలసినవైనను ఇటాలియను ప్రభుత్వము క్రింద లేవు. ఫ్రాన్సు ఇటలీతో యుద్ధమునైనా ఎదురుచూడాలి. ఇట్లా అయితే ఫ్రాన్సుతన వలసదేశములన్నిటినీ ఇటలీకి పోగొట్టుకొంటుంది. లేదా ఇటలీమైత్రిని సంపాదించాలంటే ఆసియా ఆఫ్రికాలలో తనకున్న వలసప్రాంతములలో విశేష భాగము ఇటలీకి ఇష్టంమీద ఇవ్వాలి. ఫ్రాన్సువంటి స్వల్ప జనసంఖ్య కలదేశమునకు ఇంతపెద్ద వలస సామ్రాజ్యము భరింపరాని వెల్ల యేనుగు. ఇటలీయొక్క విశాలమైన వలసకోరికలను నిజంగా విప్పిచెప్పతున్నాము. ఆఫ్రికాఖండంలో మాకు కుడి ఎడమ భాగములకు కాలు చేతులు చాపుకోడానికి అవకాశం ఉండాలి. ట్రిపోలీని కేంద్రంగా తీసుకొని ట్యూనిస్‌ను, మొరాకోను మనం ఆక్రమించుకోవాలి. ఇటు ఈజిప్టులో కొంతతునక మరిచిపోరానిది. నైలునదిద్వారా మనం ఎట్లు సముద్రంచేరేటట్లు చూసుకోవాలి. ఇంక ఆసియాఖండంలో డోడికానీసు దీవులకూ, సైప్రసుకూ ఎదురుగాఉన్న భూభాగము అంతా మన ప్రమేయం అని నొక్కి వక్కాణించ

వచ్చును."

దీనిని బట్టి ఇటలీయొక్క వలస ఉద్దేశములు వ్యక్త మవుతున్నాయి. ఇటలీకన్న వేసిన ప్రాంతాలన్నీ బ్రిటను ఫ్రాన్సుల అధీనంలో ఉన్నాయి. ఇటలీ మధ్యధరాధిపత్యము సాధకం కావాలంటే సరిహద్దుప్రదేశాలను నయానోచేతనో భయం చేతనో చేజిక్కించుకోవాలి. బ్రిటను ఫ్రాన్సులకు మధ్యధరా సముద్రాధిపత్యం వలన ప్రయోజనం ఏమిటి ? దూరప్రాచ్య దేశములకూ, హిందూదేశమునకూ త్వరలో చేరడానికి మధ్యధరాసముద్రము చాలా ముఖ్యమైన రహదారి. ఈ మార్గంమీద బ్రిటనుకు పట్టుతప్పితే ఆఫ్రికా ఖండమును ప్రద క్షిణంచేస్తూ వాస్కొడగామా దినములలో మాదిరిగా రావలసి ఉంటుంది. ఈదారి చాలా దూరభారము. కాని మధ్యధరాసముద్రంలో యుద్ధం తటస్థిస్తే కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గమే బ్రిటనుకు క్షేమకరమైనది. యుద్ధకాలంలో జిబ్రా ల్టరునుంచి ఎర్ర సముద్రాంతందాకా ఉన్న 3000 మైళ్ళ కూడా శత్రువుల విమానదాడికి, జలాంతర్గాములకూ ( సబ్మెరైన్లు ) గురియైపోతాయి. మధ్యధరాసముద్రం ఎక్కువ వెడల్పు లేదుగనుక దీనిలోనుంచి తప్పించుకొని దూరంగా పోవ డానికి ఓడలకు అవకాశంచిక్కదు. ఇట్లు ప్రమాదవంతమైన ఈ రహదారికోసం ప్రాకులాడడం ఈరోజుల్లో కోరదగినది కాదని కొంతమంది బ్రిటిషు వ్యూహజ్ఞులు అన్నారు. పైగా బ్రిటనుకు మధ్యధరా సముద్రతీరములనుంచి ప్రధానమైన ముడిసరకులేమీ రావడంలేదుకదా! పోనీ ఈ మార్గమున బ్రిటనుకు నూనెవస్తువులు ఏమైనా సప్లయి అవుతున్నాయా

అంటే అదీ లేదు. పర్షియా, ఇరాక్ మున్నగు దేశాలనుంచి ఎగుమతి అయ్యే నూనెపదార్థాలలో మూడొంతులు ఫ్రాన్సు తీసుకుంటుంది. ఒకవంతుమాత్రమే బ్రిటను తెచ్చుకుంటుంది. మధ్యధరాసముద్రతీర దేశాలు బ్రిటిషు ఎగుమతులను చాలా తక్కువగా కొంటాయి. అయితే బ్రిటను ఈ సముద్రమార్గం కోసం ఎందుకు పీకులాడుతుంది? ఈ మార్గంగా ఇండియాకు, సింగపూరుకు త్వరలో చేరవచ్చును. రెండవది. తూర్పు రాజకీయాల్లో బ్రిటనుకు పలుకుబడి గౌరవం ఉండాలంటే మధ్యధరాసముద్ర రాజ్యాలమీద ఒత్తిడి తేగలశక్తి ఉంచుకోవాలి. ఒకవేళ ఇటలీతోగాని టర్కీతోగాని యుద్ధం తటస్థిస్తే ఈ దేశాలను జిబ్రాల్టరు నుంచిగాని, సూయజ్ కాలువ ముఖం నుంచిగాని బ్లాకేడ్ చేస్తే చాలదు. ఆ దేశముల గృహసమీపానికి బ్రిటిషు నౌకాదళం తరలించి వాటిని ముట్టడించ వలసివస్తుంది. ఇందుకైనా మధ్యధరాసముద్రాధిపత్యం కాపాడుకోవాలని బ్రిటిషువారు తలుస్తారు. ఈ సముద్రంలో ఇటలీ దురాక్రమణమును అరికట్టడానికై బ్రిటను, ఫ్రాన్సు, యుగోస్లావియా, గ్రీస్, టర్కీ దేశాలు ౧౯౩౬లో ఒకసమాఖ్య చేసుకున్నాయి.

ఫ్రాన్సుకు మధ్యధరాసముద్ర ప్రయోజనం ఏమిటి? ఫ్రెంచివారికి ఎప్పుడూ ఒక భయము పీడిస్తూంటుంది. జర్మని నుంచి ఆత్మరక్షణ చేసుకోడం ఎట్లా? జర్మనీ ప్రజాసంఖ్య హెచ్చుతూంది. జర్మనీలో ౭ కోట్ల జనులున్నారు. ఫ్రాన్సులో ౪ కోట్లకు మించిలేరు. ఈ స్వల్పజనసంఖ్యతో జర్మనులను అణచుకోవడం ఎట్లా? వారు వెంటనే తమ ఉత్తర ఆఫ్రికా సామ్రా

జ్యం జ్ఞాపకం తెచ్చుకొని ఊరడిల్లుతారు. ఆల్జీరియా, ట్యూనిసియా, మొరాకోలు వారి సామ్రాజ్యంలో చేరినవి. ఇంటికి సమీపంగా ఉన్నవి. జనసంఖ్య విస్తారంగా కలవి. ఇక్కడ సైనికుల్ని తయారుచేసి ఫ్రాన్సు స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని వారి వ్యూహము. ఈ వలస సైన్యాలని మధ్యధరా సముద్రం మీదుగా తెచ్చుకోవాలి. ఈ మార్గానికి ఎడాపెడా అపాయం కలగవచ్చును. జనరల్ ఫ్రాంకో రాక పూర్వము స్పెయిన్ దేశము ఫ్రాన్సు మిత్రముగా ఉండేది. ఆ కారణంచేత పిరనీస్ పర్వత సరిహద్దుమీద ఫ్రాన్సు సైన్యాలను నిలపవలసిన అవసరం లేకపోయింది. అట్లాగే బాలియారిక్ (Balearic) ద్వీపాలు స్పెయిన్ అధీనంలో ఉన్నంత కాలమూ ఆ చుట్టుపట్ల ఫ్రెంచి నౌకలను నిలపవలసిన ఆవశ్యకతకూడా లేదు. అందుచేత ఇటలీ సౌష్ఠవమునుంచి తన వలసప్రాంత మార్గమును కాపాడుకోడానికి ఫ్రాన్సు తూర్పున ఎక్కువగా శ్రద్ధవహించేది. టౌలన్‌నుంచి కార్సికాద్వీపమూ, అక్కడనుంచి ట్యూనీసియాలోని బిసెర్టావరకూ ఫ్రెంచి రక్షణ విధానము ఏర్పడింది. కాని ఫ్రాంకో అధికారంలోకి వచ్చినతర్వాత స్పెయిన్‌కూడా శత్రుకోటిలో చేరే భయం ఫ్రాన్సుకు కలిగింది. ఇప్పుడు బాలియారిక్ దీవులనుంచికూడా తనకు అపాయం రాగలదని ఫ్రాన్సు తెలుసుకుంది.

ఇది ఇట్లుండ ఇటలీ, మధ్యధరాసముద్రాన్ని ఇటాలియన్ దిగుడుబావిగా చేసుకోనదలచింది. ఈ కార్యసిద్ధి కోసం స్పెయిన్‌ప్రభుత్వం ఇటలీకి మిత్రరీతిని ఉండాలి. జర్మనీకికూడా స్పెయిన్‌ప్రభుత్వాన్ని తన చెప్పుచేతల్లో ఉంచు

కోవాలని అభిలాష ఉంది. ఆక్సిస్ వారు ఉభయులూ ఏకాభిప్రాయ ప్రేరితులై యున్నారు. స్పెయిన్‌లో ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామిక ప్రభుత్వము ఇటలీ జర్మనీల అడుగుజాడల్లో నడిచే ప్రభుత్వం కాదు. ఫ్రాన్సు బ్రిటనులు రిపబ్లికన్ స్పెయిన్ ప్రభుత్వానికి అనుసరణీయములుగా ఉన్నాయి. ఈ ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కూలద్రోసి తమ అనుచరులుగా ఉండదగినవారిని అధికారంలోకి తీసుకురావాలని హిట్లరు ముస్సోలినీలు నిశ్చయించేసుకున్నారు. తమ యభిలషితమును నరవేర్చుకోడానికి వారొక క్రొత్త మార్గం కనిపెట్టారు. దేశంలో అంతర్యుద్ధం లేవదీసి ఒకపక్షానికి సహాయం ఇచ్చి వారికి విజయం లభించేటట్లు చెయ్యడం వారి ఎత్తు. తాము కలుగచేసుకున్నట్లే డెమాక్రసీలు కూడ స్పెయిన్‌లో కలగచేసుకోకుండా ఉండడానికి వారు జాగ్రత్తపడ్డారు. జనరల్ ఫ్రాంకో మున్నగువారి నాయకత్వమున స్పెయిన్ అంతర్యుద్ధం ఆరంభమయింది. స్పెయిన్ నుంచి కమ్యూనిజమనే విషాన్ని విరిచి అట్లాంటిక్ తీరప్రజలను ఈ దుష్టసిద్ధాంతము నుంచి కాపాడడమే తమ ఆదర్శమైనట్లు ఫ్రాంకో సేనాపతియు, అతని ప్రాపులైన నియంతలును నటింపజొచ్చిరి. ఇటలీకి మిక్కిలి అభిమతమైన మధ్యధరాసముద్ర సమాక్రమణమునందు హిట్లరు తోడ్పడడానికి ప్రతిఫలంగా ముస్సోలినీ ఆస్ట్రియా, జెకోస్లోవేకియాల విషయం హిట్లరు తనకు ఇష్టంవచ్చినట్లు వ్యవహరించడానికి అంగీకరించాడు.

తిరుగుబాటు ఆరంభించే ముందు వేలకొలది తుపాకులూ, రివాల్వరులూ స్పెయిన్‌లోకి రహస్యంగా చేరవేశారు.

## రెండో ప్రపంచయుద్ధమా?

స్పెయిన్‌లోని అంతర్యుద్ధ నాటకానికి భరతవాక్యందాకా సర్వవిధములైన ఏర్పాట్లూ ఇటలీ జర్మనీలు చేశారు. రిపబ్లికన్ (స్పెయిన్ ప్రభుత్వము) ప్రభుత్వము నాలుగువారాల్లో కూలిపోతుందని లెక్క వేశారు. తిరుగుబాటుదారులు కొద్ది దినముల్లోనే మాడ్రిడ్ నగర సమీపానికి చొచ్చుకుపోయారు. కాని ప్రజాస్వామిక సైనికులు దేశభక్తిపూరితులై సర్వతాల్లా నిలబడేసరికి ఫ్రాంకో ముందుకు నడవలేకపోయాడు. హిట్లరు ముసోలినీలు తమ అంచనా తప్పిపోయిందని తెలుసుకుని అపారమైన సేనలను, ఆయుధములను ఫ్రాంకోకి పంపడానికి పూనుకున్నారు. బ్రిటను ఫ్రాన్సులు రోమ్-బెర్లిన్ కాడి వారు స్పెయిన్‌లో తలపెట్టిన కార్యం తెలుసుకున్నారు. కాని వారి ఆటలను కట్టించలేకపోయారు. స్పెయిన్‌లో తాముకూడా జోక్యం కలిగించుకుంటే కోతిపుండు బ్రహ్మరాక్షసి అయినట్లు యావత్తు యూరపును యుద్ధాగ్నులు అలుముకుంటాయేమో అని భయపడ్డారు. ఇక వీరు చెయ్యదగినది ఏముంది? ఇతర ప్రభుత్వాలుకూడా స్పెయిన్‌లో జోక్యం కలిగించుకోని ఏర్పాటు చెయ్యాలి. ఇందుకని వారు స్పెయిన్ విషయంలో తటస్థవిధానమును అవలంబించాలని నిశ్చయించుకున్నారు. ఇటలీ జర్మనీలుకూడా వీరి ఒత్తిడివలన ఈ తటస్థవిధానంలో పాల్గొంటామన్నారు. స్పెయిన్‌లో పోరాడుకుంటూన్న ఏ పక్షానికీకూడా బయటివారు ఎట్టి సైనిక ఆయుధసహాయము చెయ్యకూడదు. ఇదియే తటస్థవిధానము. బ్రిటను ఫ్రాన్సులు అనుకొన్నప్రకారం స్పెయిన్‌కు ఆయుధాలు చేరకుండా కట్టుదిట్టాలు చేసుకున్నాయి. దీని

ఫలితంగా స్పెయిన్ ప్రజాస్వామిక వాదులకు ఆత్మరక్షణకై ఆయుధాలు దొరకలేదు. ఇటలీ జర్మనీలు తటస్థవిధానమును మన్నించాలని అనుకోలేదు. వారు రహస్యంగా ఫ్రాంకోకు చేయవలసినంత సహాయం చేస్తూనేఉన్నారు. ఫ్రాంకో నెగ్గి తీరాలని వారు బహిరంగంగానే పట్టుపట్టారు. ప్రహాస్వద్వేష్టులైన ధనస్వామిక ప్రభుత్వాలు నిజంగా స్పెయిన్‌లో కమ్యూనిజం చిత్రవధ చెయ్యబడుతూంది-ఇది ఒక అయాచితోపపన్నమైన మేలేఅనుకొని ఉంటారు. ప్రజాదరం పొందిన ప్రభుత్వం కూలిపోతోంది. నియంతల గుప్పెట్లోఉండే 'మిడతం భొట్లు' విజయంపొందుతున్నాడు. ఇది బ్రిటనుఫ్రాన్సుల క్షేమానికి గొడ్డలిదెబ్బయని ఎందరో వ్యూహజ్ఞులు చెవినిల్లుకట్టుకొని పోరారు. కాని వారి హితవాక్యములు అరణ్యరోదనం అయాయి.

ఇటలీ జర్మనీలు స్పెయిన్‌ప్రభుత్వాన్ని కీచుమనిపిస్తూఉండగా జపాను ఏదో వంకపెట్టి ౧౯౩౭లో చీనామీద దురాక్రమణకు పూనుకుంది. చీనాకును తనకునూ నడుస్తూన్నది యుద్ధముకాదనియు, ఇది కేవలము స్వల్పాంశమనియు, అందుచేత బ్రిటను కాని అమెరికా సంయుక్తరాష్ట్రాలుగాని జోక్యం కలిగించుకొని చీనాకు సహాయం చేస్తే వారికి దూర ప్రాచ్యదేశాల్లో ఉన్న ప్రమేయాలమీద కత్తి కడతానని జపాను బెదరించింది.

# ౬. సమిష్టి క్షేమమే శరణ్యము.

౧౯౩౭ సంవత్సరంలో రోమ్ - బెర్లిన్-టోకియో కాడి ప్రభుత్వాలు అన్యోన్య సహాయం చేసుకుంటూ విజృంభిస్తున్నాయి. ఒకరు దురాక్రమణ చేస్తూంటే రెండవవారు బాహాటంగా కాకపోయినా రాజకీయపు ఎత్తులతో తమ మిత్రులను సమర్థిస్తూండేవారు. మరియు వారొక చమత్కారం చేసేవారు. ఏదో ఒక చిన్న అంశంమీద వారు తమ శక్తిని ప్రదర్శించేవారు. వారి కోరిక కొనసాగకపోతే యూరపునంతా అల్లకల్లోలంలో ముంచేస్తామని బెదిరించేవారు. 'ఇది ఒక్కటే మా కడసారి కోర్కె,' అని ఓదార్చేవారు. కడుపునిండిన సామ్రాజ్యదేశాలు ఈ చిన్నవిషయం కోసం యుద్ధవిషభాండమును పగులకొట్టడం ఎందుకని దురాక్రమణ వాదులకు లొంగిపోయేవారు. అప్పుడే నియంతల శక్తి హద్దుమీరిపోతూంది. ప్రజాస్వామికములు తమకు తెలియకుండానే వెనకంజలు వేస్తూన్నాయి. యూరపుమీద యుద్ధంఅనే అగ్నిపర్వతం పటాపంచలు కాకుండా ఉండాలంటే నానాజాతిసమితి ఛాయలో శాంతిని కోరే ప్రభుత్వాలన్నిటినీకూడకట్టడం అవసరమని గుర్తిస్తున్నారు. ఈ ప్రభుత్వాలంతా ఎవరికివారు వేరేవేరే నియంత్ర దేశాల్తో లాలూచీపడక సమిష్టిక్షేమవిధానంమీద వ్యవహరించాలని పలువురు నీతిజ్ఞులు అన్నారు. ఇట్లా గుమికూడిన ప్రభుత్వాలన్ని కలిసి దురాక్రమణవాదుల్ని మించిన యుద్ధశక్తిని సమకూర్చుకోవాలి. ఈ సమిష్టి బలాన్ని చూసి దురాశాపరులు వెరచి శాంతిభగ్నతకు వెనుదీస్తారని ఆశింపబడింది.

సమిష్టిక్షేమవిధానమును గూర్చి బ్రిటనులో చర్చలు

గారు సమర్థతతో వాదించేవాడు. పార్లమెంటులో ఆయన చెప్పినమాటలు చాలా విచారదృష్టితో కూడిఉన్నాయి. "యుద్ధపు ఆయుధములమీద చేయు వ్యయము దుబారా ఖర్చు అనుకొనే దినాలు ఎన్నడో వెళ్ళిపోయాయి. ఆ మంచి రోజులు మళ్లీవస్తే రావచ్చును. కాని భయంకరమైన ఈ ౧౯౩౬, ౧౯౩౭ సంవత్సరములు మన ఆయుధాలు విసర్జించే కాలంకాదు. మనము అచిరకాలంలో ప్రపంచ విధ్వంసకమైన సంగ్రామం ఎట్లా నిరోధించగలమో ఆలోచించాలి. సమిష్టి క్షేమవిధానములో మనం చేరుటవలన నష్టంకన్న లాభమే ఎక్కువఉంది. ఈ పద్ధతి విజయవంతమయిందంటే మరిగెబుక ఘోరాతిఘోరమారణ కర్మను తప్పించడంలో మన దేశం కూడా పాలుగొన్నట్లవుతుంది. ఒకవేళ సమిష్టిక్షేమవిధానంలో తగినంతమంది చేరక అది విఫలమవుతుందనుకోండి. అయినప్పటికీ మన ప్రమాదస్థితి ఇంతకన్న గభీరతరం కాజాలదు. మహాశక్తివంతములైన బ్రిటను ఫ్రాన్సులు రెండూ కలిసినాయంటే ఎట్టి దురాక్రమణవాదికూడ వారివంక కన్నెత్తి తేరిపార చూడడు. సమిష్టిక్షేమం అంటే మీఅభిప్రాయమేమిటి? నానాజాతి సమితిని చాటుచేసుకొని జర్మనీకి విరుద్ధంగా ఒక ప్రబలతరమైన శత్రుకూటమును జమచెయ్యడంకాదా? జర్మనీ ఆయుధవంతమగుతూందంటే అదంతా రష్యా భయంచేత కాదా అని వాదిస్తారు. కాని ఈవాదం నిలవదు. నిజంగా జర్మనీ కనుక రష్యాభయంచేత ఆందోళనపడుతూంటే జర్మనీ కూడా ఈ సమిష్టిక్షేమవర్గంలో పాల్గొనవచ్చునుకదా. అటుపైన సోవియటు జర్మనీమీద దౌర్జన్యం చేస్తే సమిష్టిక్షేమ

ప్రభుత్వాలన్నీ రష్యామీద కత్తికట్టవచ్చును,” అని చర్చిలు అన్నాడు.

కాని బ్రిటిషుప్రభుత్వమునకు ఈ వాదం రుచించలేదు. వారింకా నియంతలను సమాధానపరచవచ్చుననే విశ్వాసమును వీడలేదు. బ్రిటనుఫ్రాన్సుల అసిగిత్వమును చూచి యూరపులోని చిన్నజాతులవారు తమ తమ క్షేమంకోసము రోమ్-బెర్లిన్లతో సఖ్యపడడమే మంచిదని తలుస్తున్నారు. అందుకు యుగోస్లావియా దారితీసింది. యుగోస్లావియా కౌన్సిలు అధ్యక్షుడు స్టొయాడినోవిచ్ (Stoyadinovitch) అనే ఆయన ఆక్సిస్ ప్రభుత్వాల్తో సఖ్యపడడానికి ప్రాకులాడాడు. బాల్కన్ ఎంటెంటేని లెక్కసేయక, యుగోస్లావియా బల్గేరియాతో మైత్రి పాటించింది. ఇది బాల్కను క్షేమానికి ఒక మొట్టికాయ. అట్లే ఇతడు ఇటలీతోకూడా ౧౯౩౭ లో చెలిమిచేసుకున్నాడు. యుగోస్లావియా స్వతంత్ర విదేశాంగ నీతిని అవలంబించదని ఇటలీతో ఒప్పుకున్నాడు. రుమేనియాలో టిటులెస్కూ (Titulescu) మంత్రి ఉన్నంతకాలమూ జాతిసమితి విధానమునందు ఆదరము ఉండేది. కాని ఆక్సిస్ వారి మైత్రిని సంపాదించుకోడానికి రుమేనియా రాజు కెరోలుకూడా ఉత్సుకుడైయున్నాడు. అందుచేత ఆయన టిటులెస్కును పదవిలో నుంచితప్పించివేశాడు. పోలండు బహిరంగంగానే జర్మనీపై అభిమానం చూపిస్తూంది. తూర్పులోకర్నోను పోలండు అంగీకరించలేదు. పైగా రుమేనియా పోలండులు రహస్యంగా ఒక ఏర్పాటుచేసుకున్నాయి. జెకొస్లొవేకియామీద జర్మనీ పడినట్లయితే రష్యా సేనలు జెక్కుల సహాయానికి సైన్యాలు

పంపదలచుకొన్నప్పుడు ఆ సైన్యాలకు దారి ఇవ్వకూడదని వారి తంత్రము. సోవియటుమీద ఈ రెండు దేశాలకు ఎంత మాత్రము సుముఖత లేదు. రుమేనియా పోలండు దేశాలు క్రమంగా ప్రజాస్వామికత్వంమీద వైముఖ్యం చూపిస్తున్నాయి. జెకోస్లొవేకియా ఒక్కటిమాత్రము తన పూర్వ దృక్పథమును మార్చుకోకుండా ఫ్రెంచివారి మైత్రిని పాటిస్తూంది. జర్మనీ పత్రికలు జెక్కు ప్రజాస్వామికంలో అంతః కలహాలు రేపడానికి ప్రచారం చేస్తున్నాయి. జెకోస్లొవేకియాకు ఫ్రాన్సునుండి రష్యానుండి సహాయాపేక్ష ఉంది. బాల్కను రాజకీయాల్లో టర్కీకి ప్రాముఖ్యత హెచ్చుతూంది. మాంట్ర్యూ కన్వెన్షన్ ఏర్పాటుప్రకారము డార్డెనల్సు జలసంధిలో టర్కీ ప్రాబల్యం హెచ్చింది. టర్కీవారు ఫ్రాన్సునాయకత్వం అంగీకరించేటట్లు సూచనలు కనబడ్డాయి. ఫ్రాన్సు జాగ్రత్తపడి ఈ సామనస్యాన్ని ఉపయోగించుకొని ఫ్రాన్సు-రష్యా-జెకోస్లొవేకియా-టర్కీ దేశాలను కుదిగుచ్చి స్నేహసమాఖ్య చేసుకోవలసిఉండెను. కాని డార్డెనల్సులో ఫ్రెంచి పలుకుబడి హెచ్చుపెరగడం బ్రిటనుకు పూర్తిగా సమ్మతంకాదు. అందుచేత బ్రిటను వైఖరి తెలియక టర్కీ సామనస్యాన్ని ఫ్రాన్సు ధ్రువపరచుకోలేదు.

ఈ లోపులో సమయంకనిపెట్టి తూర్పు యూరపుపై తన ఆర్థికపాశాన్ని బిగించడానికి జర్మనీ తొందరపడుతూంది. ఆర్థికస్నేహము రాజకీయ స్నేహముగా పరిణమించవచ్చునని జర్మనీ ఆశ. జర్మనీకి ఆహారపదార్థాలు ముఖ్యంగా గోధుమలు మున్నగునవి డాన్యూబు ప్రాంతలోనుంచి రావాలి. ఇచ్చట

పండిన గోధుమపంటనంతనూ జర్మనీ ఒక్కటే కొనగలదు. అయితే దిగుమతులకోసం చెల్లించడానికి జర్మనీవద్ద సగదు ధనంలేదు. అయితే ఏమిటిమార్గము? జర్మన్ ఆర్థికవేత్త డాక్టరు షాట్ గారు ఒకవిధమైన వస్తువినిమయ మార్గం అవలంబించి జర్మనీ చిక్కులను గట్టెక్కించాడు. ఇతనిని జర్మనీపాలిటి ఆర్థిక మాంత్రికుడని ప్రశంసిస్తారు. బాల్కను రాష్ట్రాలు ఆహారపదార్థాల ఎగుమతి రూపంగా జర్మనీకి అప్పుపెడతాయి. ఈ అప్పుతీర్చడానికి జర్మనీ తన యంత్ర నిర్మిత వస్తువులు ఎగుమతిచేస్తుంది. వస్తువినిమయ పద్ధతిమీద బాల్కనులు జర్మనీకిచాలా పెట్టుబడిపెట్టాయి. ఈ జర్మనీ బాకీపడిన మొత్తములే బాల్కనులమీద జర్మనీ పాశాన్ని బిగిస్తాయని డాక్టరుషాట్ కనిపెట్టాడు. "ఈరోజుల్లో అప్పు దారుజుట్టు బాకీదారుని చేతులో ఉంది. బాకీదారు ఋణము చెల్లించలేకపోతే ఆతనికి అప్పుచెల్లించే సౌకర్యాలు అప్పు దారు కలిగించాలి. లేకపోతే ఇదివరలో పెట్టిన ఋణముకు తిలోదకాలు విడుచుకోవాలి" అని షాటుగారి ఆర్థికనీతి. ఆర్థికసంబంధముల మూలముగా బాల్కనులు జర్మనీ బాహు బంధంలో తగుల్కొంటున్నాయి.

స్పెయిన్‌లో 'జోక్యంలేదు' అనే పద్ధతి నడుస్తూనే ఉంది. ఫ్రాంకో సేనానికి సులభ విజయం లభించలేదు. మాడ్రిడ్ పట్టుబడడంకాని, స్పెయిన్ ప్రజాస్వామిక ప్రభుత్వం కూలడంగాని జరుగలేదు. తమ ఆశ్రితుడుగెలవాలనే దీక్షతో ఇటలీ జర్మనీలు ఫ్రాంకోకు విస్తారమైన సైన్యసహాయం చేస్తు న్నాయి. ఫ్రాన్సు రష్యాలనుంచి స్పెయిన్ ప్రభుత్వానికి

# సమిష్టి క్షేమమే శరణ్యము.

కొంతవరకు ఆయుధ సప్లయి జరిగింది. కాని విజయం పొందడానికి చాలినంత ధారాళంగా జరుగలేదు. ఫ్రాంకో విజయం ఫ్రాన్సుకు భయకారణంగా ఉంది. స్పెయిన్ పితూరీదారులకు తోడుపడే మిషమీద ఇటలీ సైన్యములు బెలియారిక్ దీవులమీద పట్టుచిక్కించుకున్నాయి. కానరీదీవుల్లోను, స్పెయిన్‌కు చెందిన మొరాకో ప్రాంతంలోనూ జర్మనులుస్థానం కల్పించుకున్నారు. ఈవిధంగా ఫ్రాన్సు బ్రిటనుల మధ్యధరా సముద్రశక్తికి ప్రమాదం ఎదుర్కొంటుంది. బాలియారిక్ దీవులమీది నౌకాశ్రయములూ, వైమానికాశ్రయములూ శత్రుగతం అవడంచేత ఫ్రెంచివారు ఉత్తర ఆఫ్రికాతో రాకపోకలు జరిగించడం యుద్ధసమయంలో సులభసాధ్యం కాదు. ఫ్రాన్సును భయపెట్టడానికై ముస్సొలినీ బహుసంఖ్యాక సైన్యములను అకారణంగానే లిబియాలో చేరుస్తున్నాడు. ఫ్రెంచి ట్యునీసియామీద ఇటలీ కన్నులున్నాయని అందరెరిగిన విషయమే. స్పెయిన్ గృహకల్లోలంలో వేలు పెట్టడంచేత ఇటలీ జర్మనీలకు ఎన్నో లాభాలు అప్పుడే కలుగుతున్నాయి. ఫ్రాన్సుకు ఆత్మరక్షణ భారం ఎక్కువైంది. ఇప్పుడు పిరనీస్ పర్వత సరిహద్దునుకూడా ఫ్రాన్సు కాపాడుకోవాలి. ఇది రోమ్-బెర్లిన్ కాడికి హాస్యజనకమైన సన్నివేశము. ఇదిగాక స్పెయిన్‌నుంచి విస్తారంగా యుద్ధావసరములైన ముడిసరకులు, పాదరసము, ఇనుము, రాగి మున్నగునవి ఇటలీ జర్మనీలకు లాభసాటిగా దొరుకుతున్నాయి.

౧౯౩౮ ఆరంభంలోనే బ్రిటను - ఇటలీలనడుమ 'ఘరానా మనుష్యుల సమాఖ్య' జరిగింది. మధ్యధరాసము

# రెండో ప్రపంచయుద్ధమా?

ద్రంలో 'యథాస్థితి'ని తలక్రిందు చేయకుండా ఉండడానికి ముస్సోలినీ అంగీకరించాడు. బ్రిటను ఆయుధ పునర్నిర్మాణోద్యమంలో తలమునకలుగా దిగివుంది. బ్రిటను తన అసహాయ స్థితికి అదరి, బ్రహ్మాండమైన ఆయుధనిర్మాణం పూనుకుంది. కొద్ది సంవత్సరాల్లో దేశరక్షణకోసం ౧,౫౦౦,౦౦౦,౦౦౦ పౌన్లు ఖర్చుపెట్టాలని బ్రిటిషుప్రభుత్వం నిశ్చయించింది. బ్రిటను యొక్క సంరంభంచూసి నియంతలు తమ దుడుకుచేతలను సరిదిద్దుకొంటారని కొంతమంది బాలప్రాయంగా ఊహించారు. హిట్లరు లోకాన్ని ఆశ్చర్యంలో ముంచుతూ ఒక ప్రకటన చేశాడు. "ఫ్రాన్సుకూ జర్మనీకి వివాదం కలిగించవలసిన అంశములు నా మనుష్యబుద్ధికి గోచరించవు. హాలెండు బెల్జియముల మీద మా కెట్టి దురుద్దేశము లేదు. కావలిస్తే ఈ రాజ్యాలను తటస్థదేశాలుగా పరిగణిస్తామని హామీ ఇవ్వడానికి జర్మనీ సిద్ధంగా ఉంది." ఈ లోపులో బాల్డ్విన్ గారు ప్రధాని పదవికి రాజీనామా ఇచ్చాడు. నెవిలీ చేంబర్లేన్ గారు ౧౯౩౭ లో ప్రధాని అయాడు. ఇక్కడ నుంచి రెండుసంవత్సరాలదాకా యూరపు రాజకీయాలు నానాటికి అధ్వాన్నంలో దిగబడిపోయాయి. ఈ ప్రమాద కాలము చేంబర్లేన్ నాయకంగా గడిచిపోయింది. చేంబర్లేన్ శాంతిప్రియుడు. శాంతిప్రియుడేకాదు. శాంతి సంపాదనకై తాను 'నిరంతర పర్యటనశీలుడను' అని అతడు చెప్పుకున్నాడు. ఈ పర్యటనయొక్క విషాదపరిణామము త్వరలోనే తెలియగలదు. చేంబర్లేన్ గారు తన నీతిని 'ఎపీస్మెంటు' (సాంత్వనము) అని నామకరణం చేశాడు. అనగా నియంత రాజ్యా

లకు వారి అభిలషితములను పూర్తిగా ఇచ్చి వారిని సుముఖం చేసుకుని వారినికూడా 'సమిష్టిక్షేమసంఘం'లోకి గొనివచ్చి యూరపుశాంతిని కాపాడడము ఈయన లక్ష్యము. ఛేంబర్లేన్ ఆదర్శము మహత్తరమైనది. లోకం అంతా అభినందించదగినది. కాని సాంత్వననీతిలో ఇతనికి విజయం ఎంతవరకూ సిద్ధిస్తుందనే సమస్యమీద ఎంతో చర్చ బయలుదేరింది. నియంతల రాజ్యతృష్ణను ఇతడు నిజంగా తృప్తిపరచగలడా? ఇందుకు అవసరమైన త్యాగాలకు బ్రిటను ఒప్పుకుంటుందా? ఇతరదేశాలు సమ్మతిస్తాయా అనే ప్రశ్నలకు ముందుముందు సమాధానం దొరుకుతుంది. ఆరంభంలోనే ఛేంబర్లేన్ మంత్రికి మధ్యధరాసముద్రంలో విషమసమస్య ఎదుర్కొన్నది. ఓడ దొంగలగుంపొకటి జలాంతర్గాములలో వచ్చి పడవలను ముంచివెయ్యడం సాగించింది. ఈ ప్రమాదం ముదిరిపోవడం చూసి బ్రిటనుఫ్రాన్సులు తీవ్రచర్య తీసుకోడానికి నిశ్చయించాయి. నియాన్ ( Nyon ) సమావేశంలో మధ్యధరా సముద్రమునందు నౌకా గస్తీ ఏర్పాటుచెయ్యాలని నిర్ణయింపబడింది. ఇటలీ దీనికి మొదట ఒప్పలేదు కాని తరువాత అభిప్రాయం మార్చుకుంది. దొంగలభయం నిశ్శేషంగా పోయింది. ఛేంబర్లేన్ గారికి ముస్సోలినీమీద సదభిప్రాయం కలిగింది.

నియంతలతో సఖ్యబంధములు వృద్ధిచేసుకుంటే యూరపులో యుద్ధభయం తొలగించి శాంతి చిత్రమును గట్టిచేయవచ్చునని ఛేంబర్లేన్ విశ్వసించాడుగదా! నాజీ ప్రభువర్గంతోను, ముస్సోలినీతోను ముఖాముఖి సంప్రతిస్తే వారి

మనస్సులో ఉండే భయసంశయాలు తీర్చవచ్చునని అతడు తలిచాడు. శాంతిని కొనితెచ్చే విధానాన్ని చేంబర్లేన్ గారు అచిరకాలంలోనే ఆచరణలోకి తెచ్చాడు. ఈ ఉద్దేశంతో బ్రిటిషుమంత్రి హాలిఫాక్సు ప్రభువు ౧౯-౩౮ సంవత్సరం ఆఖరులో నక్కవేట పేరు చెప్పుకొని సేనాపతి గోరింగుగారి ఆహ్వానంమీద బర్లిన్ నగరం ప్రయాణంకట్టాడు. హాలిఫాక్సు ప్రభువు నాజీ ఉన్నతాధికారులను దర్శించిఉంటాడు. హిట్లరును సందర్శించి ఆయనతో కూడా మాట్లాడాడు. ఈ ప్రయాణంలో రాజకీయోద్దేశం ఏమీ లేదని ప్రకటించారు. హాలిఫాక్సు ప్రభువు భారతదేశపు రాజప్రతినిధిగా మనకు పరిచితుడు. ఈయన ఉదారస్వభావుడని అంటారు. దైవభీతి కలవాడు. పరమ క్రైస్తవాచార సంపన్నుడట. చేంబర్లేన్ కు ఈయన కుడిభుజంవంటివాడు. కుటిల రాజనీతికినీ, మంచితనమునకూ చుక్కెదురు. హాలిఫాక్సు ప్రభువు మెత్తని స్వభావము, సులభవిశ్వాసము ఎన్నో అనర్థాలకు ముందు ముందు కారణమైంది. హాలిఫాక్సు ప్రభువు హిట్లరు మున్నగు వారితో చేసిన సంభాషణలేమిటి? ఈ చిదంబర రహస్యం తరువాతకాని విడివడలేదు. ఇటీవల గత మహాయుద్ధంలో తన వద్దనుంచి గుంజుకొన్న వలసప్రదేశాలను కక్కమని జర్మనీ అడుగుతూంది. కాలనీలవిషయంలో పునర్విమర్శనమంటే బ్రిటిషు సామ్రాజ్యంలో సంచలనం కలుగకతప్పదు. అందుచేత ఈ సమస్యను దూరదూరంగా వాయిదా వేయించాలి. హిట్లరుకు అన్యత్ర లాభాలు చూపిస్తే ఆరుసంవత్సరముల దాకా వలసప్రదేశాలమాట జర్మనీ ఎత్తదని అతడు అన్నాడు.

## సమిష్టి క్షేమమే శరణ్యము.

బహుశః ఇదే సందర్భంలో జర్మనీ ఆస్ట్రియా సమ్మేళనమును, బ్రిటన్ తీవ్రంగా నిరోధించదని హిట్లరు తలచిఉంటాడు.

ఇప్పుడు వలసప్రదేశ సమస్య హఠాత్తుగ ఎందుకు తలయెత్తింది? జర్మనీకి కాలనీలెందుకు? దీనికి సమాధానము నాజీల ఆర్థికనీతిలో దొరుకుతుంది. జర్మనీ ఆర్థిక విధానం ఎటువంటిది? వారు ఇప్పటికి కొన్ని సంవత్సరాల నుండి యుద్ధసాధనాలమీద కుబేర మొత్తాలు సెలవుచేస్తున్నారు. ఇంక ధనప్రవాహం కట్టుబడుతూంది. ఆయుధనిర్మాణం నిలిచిపోకూడదు. ప్రజలనుంచి ధనప్రవాహం జారీగా ఉండాలంటే నిత్యావసరములను వారు మితపరచుకోవాలి. "వెన్న విడిచి తుపాకులు సంపాదించాలి," అను సూక్తి నాజీ ప్రభువుల నాలుకమీద ఆడుతుండేది. జర్మన్ ప్రజలు ఈ త్యాగంకోసం సిద్ధంగానేఉన్నారు. అయినప్పటికీ జర్మనీకి మరొక చిక్కువచ్చింది. జర్మన్ యంత్రాగారములకు కావలసిన ముడిపదార్థాలు శరపరంపరగా దొరకాలి. ముడిపదార్థాలను కొనుక్కోడానికి జర్మనీవద్ద బంగారంలేదు. అందుచేతనే జర్మనీ తన ఎగుమతులు వృద్ధిచేసుకుని తన దిగుమతులకు వినిమయంగా చెల్లించుకోవాలి. ఈ ఉద్దేశంతోనే హిట్లరు ఇట్లా సూత్రీకరించాడు, "జర్మనీ విస్తారంగా ఎగుమతిచేసుకోవాలి; లేదా నశించిపోవాలి." నాజీ ఆర్థికవేత్తలు సదరుసమస్యను ఇట్లా చర్చిస్తూంటారు: "ఎగుమతులు చెయ్యడానికి క్రొత్త భూభాగాలులేవు. ఉన్నవన్నీ ధనస్వామిక దేశాల ఇనుపగుప్పిడిలో ఉన్నాయి. ముడిపదార్థాలు ధారాళంగా లభించడానికి, వాటివెలకిక్రింద యంత్రనిర్మాణ వస్తువులు

## రెండో ప్రపంచయుద్ధమా?

జర్మనీ విధించిన ఖరీదులమీద కొనుక్కోడానికి సిద్ధపడే భూభాగాలు జర్మనీ అధీనంలో ఉండాలి. బ్రిటిషు సామ్రాజ్యం బ్రిటను నిర్మిత పారిశ్రామిక వస్తువులు కొనుక్కొని బ్రిటనుకు కావలసిన ముడిపదార్థాలు ఎగుమతీచేస్తుంది. బ్రిటనుకు బంగారపు కరవులేదు గనుక తాను కొనుక్కొన్న పదార్థాలకు సొమ్ము చెల్లించగలదు. తన ఫ్యాక్టరీవస్తువులనే కొనమని సంపూర్ణంగా నిర్బంధించవలసిన ఆవశ్యకత బ్రిటనుకులేదు. జర్మనీకి ఈ ఆవశ్యకత తప్పలేదు. జర్మనీ కోరిన వస్తువులు ఎగుమతిచేసి జర్మనీ విడుదల చేయగల సరకును జర్మను షరతులమీద కొనుక్కొనే దేశాలు మాకు కావాలి." పూర్వపు జర్మన్ కాలనీలు ఈసందర్భంలో ఉపయోగపడతాయని వారు విశ్వసించారు. జర్మన్ కాలనీలను అనుభవిస్తూన్న వారు వాటిని వాపసుచెయ్యడానికి ఇష్టపడడంలేదు. వారు ఈ కారణాలను ఉదహరిస్తూంటారు."జర్మనీ ఎప్పుడూకూడా తన వలససామ్రాజ్యాన్ని చక్కగా ఉపయోగించుకోలేదు. ౧౯౧౪ యుద్ధానికి పూర్వంకూడా జర్మన్ వలసప్రదేశాలనుంచి ఎగుమతి దిగుమతీలు చాలా తక్కువగా ఉండేవి. కాలనీలనుంచి ధనం పితుక్కునే కౌశల్యం జర్మనులకులేదు. ఇవే కాలనీలు జర్మనీనుంచి తొలగిపోయిన తర్వాత సర్వసంపత్సమృద్ధి కలిగి ఉన్నాయి. వీటిని ఇప్పుడు మేము విడిచిపెడతామా? అసలు ఈ వలసప్రదేశాల్లో నివసిస్తూఉన్న ప్రజాసమూహములు జర్మనీ హస్తగతం అవడానికి బొత్తిగా నిరాకరిస్తూన్నారు. నోరులేని ఈ అనాగరికమూకలను వారి సమ్మతి లేకుండా నాజీ ప్రభుత్వానికి మేము బలిచేస్తే మేము భగవదాజ్ఞను

వ్యతిరేకించినవారము కామా? కావున జర్మనీ తన వలస దేశాల విషయంలో నిరాశ చేసుకోవడమే ఉత్తమపద్ధతి" అని వీరు వాదిస్తారు.

అయితే జర్మనీ బయట ప్రపంచంలో విస్తరించడానికి సామ్రాజ్యవాదులు ఇష్టపడకపోతే యూరపులోనైనా 'స్థలం' ఇస్తారా లేదా? జర్మనీ ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించెయ్యడానికి ఇంటి చుట్టుపట్లనే ప్రయత్నించాలి. అనగా చుట్టూ ఉన్న చిన్న చిన్న రాజ్యాలను మెడవంచి వాటిని జర్మన్ ప్రయోజనాలకు స్థానాలుగా చేసుకోవాలి. అనగా కాలనీలు ఏవిధంగా జర్మనీకి ఉపయోగపడతాయో ఈ రాజ్యాలుకూడా ఆవిధంగానే ఉపయోగించాలి. జర్మనీ పారిశ్రామిక వస్తువులను కొనుక్కొని జర్మనీకి కావలసిన ముడి పదార్థాలు ఎగుమతి చెయ్యాలి. కావున ఈ ప్రాంతములన్నీ వ్యవసాయ దేశములుగా ఉండి జర్మనీ పారిశ్రామికస్థితికి హంగుదారులుగా ఉండాలి. ఈ చిన్న రాజ్యాలు జర్మనీ చెప్పినట్లు నడుచుకుంటాయా? జర్మనీకి ఉపగ్రహాల్లాగ చుట్టూ తిరుగుతూంటాయా? దీనికి ఆ రాజ్యాలు ఒప్పుకోకపోతే వాటి స్వాతంత్ర్యం నిర్మూలించి వాటిని బలప్రయోగంచేత జయించాలి. ఇది నాజీ వాదము. ౮ కోట్ల జర్మనీ ప్రజల జీవస్థితికి ఈ విధానము అత్యవసరమని వారు అంటారు. మా ప్రజాసమూహం తిండిలేకుండా ఉంది. వారికి విస్తరించడానికి స్థలంలేదు. కాలనీలు మాకు ఇవ్వకపోతే యూరపు తూర్పు భాగంలో విస్తరించడానికి మాకు అవకాశం ఇవ్వండి అని నాజీలు చెప్పతారు. 'ఇదంతా బూట

కము. జర్మనీయొక్క సామ్రాజ్యకాంక్షయే దీనికంతకూ మూలం' అని జర్మనీ ప్రతిపక్షులంటారు. "అయితే ఇతర సామ్రాజ్యములకు ఏ నీతి ఉచితమయిందో ఆ నీతి జర్మనీకి మాత్రం కాకపోతుందా? కాదంటే మానుతుందా?" అని జర్మనువారు బదులుచెప్తారు.

డాక్టరు షాటు (Schacht) బాల్కను రాజ్యాల్లో అవలంబించిన ఆర్థికనీతికి ఇదే మూలసూత్రము. జర్మనీ యుద్ధశక్తినిగురించి పొరుగు రాజ్యాలవారు భయభ్రాంతులై జర్మన్ కోరికలు మన్నించడమే క్షేమం అనుకుంటున్నారు. బాల్కను రాష్ట్రములన్నీ జర్మన్ ఆర్థిక చక్రంలో ఇముడడానికి యత్నిస్తున్నాయి. యుగోస్లావియా బల్గేరియాలు జర్మనీకోరినట్లు జర్మనీకి అవసరమైన ముడిపదార్థాలు, ముఖ్యంగా నూనె విత్తులు పండించడానికి అంగీకరించాయి. రుమేనియాకూడా జర్మనీ ప్రసాదంకోసం ఎదురుచూస్తూంది. హంగేరీ స్వతహాగా నాజీ అభిమానంకల దేశమేకదా. జెకోస్లోవేకియా ఒక్కటిమాత్రమే పెడసరంగా ఉంది. జెకోస్లోవేకియాలో జర్మను వ్యాపారంకన్న బ్రిటిషువ్యాపారమే ఎక్కువగా ఉండేది. ఇది నాజీలను కొరకొరలాడించి జెక్కులకు భావికాలంలో ముప్పు తెచ్చిపెట్టగల విషయంగా కనబడుతూంది. జర్మనీకి లొంగని దేశాలను బలప్రయోగంచేత నిర్జించడమే నాజీలు తలపెట్టిన విధానము. టర్కీకూడ జర్మనీకి సులభంగా లొంగేటట్లు లేదు. బ్రిటిషువారు టర్కీలో ధనం పెట్టుబడిపెట్టడం జర్మనీకి ఇష్టంలేదు. టర్కీ ప్రజాస్వామికము జర్మను ఆర్థిక సరిహద్దుల్లోనిదని జర్మనీ తలుస్తుంది. పర్యవ

పానమేమిటంటే-జర్మనీ ప్రపంచమహా ప్రభుత్వముల్లో ఒకటి కావాలి. దీనికితగిన ప్రజాశక్తి, శౌర్యోత్సాహములూ జర్మనీలో పొంగిపొర్లుతున్నాయి. ఆరంభంలో జర్మనులు 'వెన్న ఇచ్చి తుపాకులు' అనేనీతిని అవలంబించారు. తరువాత 'జర్మనీ ఎగుమతి చెయ్యాలి-లేకపోతే స్తంభించిపోవాలి' అని వ్యవహరించారు. ఈ నీతికిమూడు అంగములుఉన్నాయి. ముడిపదార్థములను సప్లయిచేసే ప్రాంతాలను జయించుకోడం మొదటిది. జర్మన్ మూలధనం పెట్టుబడిపెట్టడానికి, జర్మను వస్తువులుకొనడానికి అవసరమైన దేశాలమీద జర్మనుపలుకుబడిని రుద్దడం. ఈ దేశాలను సమూలంగా జయించ నక్కరలేదు. ఆరాజ్యాలు జర్మన్ ఆజ్ఞాబద్ధులై ఛాయామాత్ర స్వాతంత్ర్యం కలవారైనా అంగీకారమే. ఇదిరెండవఅంగము. జర్మనీకి అవసరమైన కూలిజనాన్నికూడ అందుబాటులో పెట్టుకోవడం మూడవఅంగం. నాజీలు తమ ముందుంచుకొన్న ఆర్థిక విధానమే జర్మన్ దురాక్రమణకు విధాయకబీజమైంది. క్రమంగా ఎగుమతులతో మాత్రమే జర్మనీ తృప్తిపడేట్లు లేదు. జర్మనీ పెద్దసామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలి. దీనికి నానాదేశ విజయంతప్పదు. హిట్లరు తన విజయ డిండిమను మ్రోగించడానికి ఇంకా సాహసించడంలేదు. తరువాత తరువాత ఆతడు బహిరంగంగానే ఇట్లాచెప్పాడు. "ఎగుమతులు మాత్రమే జర్మనీ కష్టాలను గట్టెక్కించలేవు. జర్మనీకి క్రొత్త 'స్థలం' కావాలి." జర్మనీకి ముడిపదార్థాలు ఆహారపదార్థాలు నిరంతరంగా సప్లయిచేసే భూభాగములను జర్మనీ బలాత్కారంగా రాబట్టుకోవాలి. జర్మనీ విజయకాంక్షను డెమాక్రి

సీలు తీవ్రంగా నిరోధించారంటే భయానకయుద్ధం రాక మానదు. జర్మనీ నశించడానికైనా సిద్ధపడుతుంది కాని తన సామ్రాజ్య సంరంభమును మానదు. జర్మనీ జీవితమునకు ఇది కొంత అవసరంఅనికూడా తేటబడింది. యూరపుయొక్క ఆగ్నేయభాగమూ, ఏషియామైనరు ప్రాంతమూ జర్మనీకి కావలసిన వస్తువులన్నీ సప్లయిచెయ్యగల కామధేనువులని నాజీ ఆర్థికమంత్రి ఫంక్ (Funk) అన్నాడు. జర్మనీ దృష్టి ఇక్కడ లగ్నమయి ఉందన్నమాట.

హాలిఫాక్సు ప్రభువు శాంతిపర్యటనమునకై వెడలి కందిరీగల పుట్టను గెలికివచ్చాడన్నమాట. కాలనీల విషయంలో తొండలు విడిపించకుండా ఉన్నదానికి ప్రతిఫలంగా హిట్లరుకు మధ్య యూరపులో జర్మనీ అధికార ప్రాబల్యం వృద్ధినొందించుకోడానికి అవకాశం లభించింది. ఆస్ట్రియా ఆక్రమణమును బ్రిటను బహిరంగంగా ఆమోదించ నక్కర లేదు. జర్మనీ చర్యమీద బ్రిటను యుద్ధానికి దిగకుండా, చూసీ చూడనట్లు ఊరుకుంటే చాలు హిట్లరు తక్కినదంతా అల్లుకుపోతాడు. ప్రజాస్వామిక ప్రభుత్వాలతో కత్తికట్టి యుద్ధంచేసే శక్తి జర్మనీకి ఇంకా రాలేదని ఆతడు గుర్తించి యుండవచ్చును. అందుచేత ఎట్లాగైనా వారు తన చర్యను యుద్ధంతో నిరోధించకుండా జాగ్రతపడడం ఆతని మతము.

బ్రిటిషు విదేశాంగనీతి ఈవిధంగా గందరగోళంలో పడిపోయి, హిట్లరు ముసోలినీలు కోరదగిన మార్గంలో నడవ మొదలుపెట్టింది. ఫ్రాన్సు ఈ నడుమ బ్రిటను నడిచిన త్రోవనే నడుస్తూంది. నియంతలకు భయకారణమైన సోవి

## సమిష్టి క్షేమమే శరణ్యము.

యిటు రష్యాలో ఏమిజరుగుతూంది? సోవియటు సైన్యాలోని పెద్దపెద్ద సేనాపతులంతా పితూరీదారులనే నెపంమీద ఉరితీయబడుతున్నారు. అందుచేత సోవియటు సైన్యము యొక్క యుద్ధశక్తి క్షీణించి నియంతలకు భయకారణం కొంతవరకు తొలగిపోయింది.

---

# ౭. సాంత్వన నీతి.

చేంబర్లేన్ ప్రధాని అవలంబించిన సాంత్వన నీతి ఫలితములు ౧౯౩౮ సంవత్సరం ఆరంభంనుంచీ కనబడ జొచ్చాయి. ముస్సోలినీగారి సౌమనస్యం సంపాదించాలని చేంబర్లేన్ చూస్తున్నాడు. ఇంతట్లో వెతకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లు ఇటాలియన్ నియంతస్వయంగా బ్రిటను మైత్రిని కాంక్షించడం మొదలుపెట్టాడు. ఈ గాలి ఇట్లా ఎందుకు విసిరింది? ముస్సోలినీకి ఇంటి కష్టములు దొంతరులుగా పెరిగిపోతున్నాయి. ఇటలీప్రజలు అబిస్సీనియా యుద్ధంకోసమూ, స్పెయిన్ అంతఃకలహంకోసమూ ఎంతో అలిసిపోతున్నారు. పన్నులభారం మితిమీరిపోయింది. ఆర్థికస్థితి దుర్భరంగాఉంది. ఇటలీకి కావలసిన ముడిపదార్థాలు కొనుక్కోడానికి ధనంలేదు. అబిస్సీనియాలో ఏదో స్వర్గం కనబడుతుందనుకున్న ఇటలీ ప్రజలకు ఎంతో నిరాశ కలిగింది. ఈ దేశాన్ని వృద్ధిచేసి లాభాలు సంపాదించాలంటే ఎంతో పెట్టుబడి పెట్టాలి. చర్చిలుగారు చెప్పినట్లు 'అబిస్సీనియాదేశము వేటకాని పీపుమీద పడిఉన్న శవము'లాఉంది. ముస్సోలినీకి ఇప్పుడు బ్రిటిషుసహాయం కావలసివచ్చింది. లండను నగరంలోకాని అప్పు పుట్టేటట్లు లేదు. అందుచేత ముసిముసి నవ్వులతో ముస్సోలినీ చేంబర్లేన్ వంక తిరిగాడు. ఇకనేముంది? బ్రిటిషుప్రధాని ఉబ్బిపోయాడు. తాను ఎదురుచూస్తూఉన్న సుముహూర్తం సమీపించింది. అబిస్సీనియా ఆక్రమణమును మన్నించి, ఇటలీ సామ్రాజ్యభాగంగా అంగీకరించి, ముస్సోలినీకి కొంత పెట్టుబడి పెట్టితే ఆతడు తృప్తిపడి శాంతిస్థాపనలో తనకు తోడ్పడతాడని చేంబర్లేన్

అనుకున్నాడు. అప్పుడు విదేశాంగ కార్యదర్శిగా ఉన్న ఈడెన్ (Eden) గారు నానా జాతిసమితి సరిహద్దుల్లో ఇటలీతో సంప్రతింపులు జరపాలి కాని వేరువేరుగా వ్యవహరించడం క్షేమదాయకంకాదని వాదించాడు. సమిష్టిక్షేమ విధానం బలపరచడం ఆతనికి ఇష్టము. ఈడెన్ ఉన్నంత కాలమూ బ్రిటిషు విదేశాంగనీతి ఇటలీకి అనుకూలంగా ఉండదని ముసోలినీ గుర్తించి ఆతనిని తొలగిస్తేనేకాని బ్రిటనుతో సమాధానము కుదరదని బెదిరించాడు. ఇటలీ నియంతను ఎట్లాగైనా సమాధానపరచాలని చేంబర్లేన్ నిశ్చయించి ఇటలీతో సంప్రతింపులను తాను స్వయంగా చెయ్యడానికి పూనుకున్నాడు. ఈడెన్ రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయాడు. హాలిఫాక్సు ప్రభువు ఆస్థానే నియోగింపబడ్డాడు. ఈయన చేంబర్లేన్‌ను కాదని తనస్వంత విదేశనీతిని అవలంబించే ధోరణికలవాడు కాడు. ఈడెన్ పతనముతో టోటాలిటేరియన్ ప్రభుత్వాలకు (నియంతరాజ్యాలు) ఎంతపలుకుబడి ఏర్పడిందో తెలిసిపోయింది. బ్రిటనువంటి మహాప్రభుత్వము ఇటలీ సౌమనస్యమునుకోరి తన విదేశాంగ కార్యదర్శికి ఉద్వాసన చెప్పుతూంటే చిల్లర రాజ్యాలమాట చేప్పేదేమిటి? సమిష్టి క్షేమవిధానసూత్రం గాలికి ఎగిరిపోయింది.

ఈ లోపులో హిట్లరు ఊరికే ఉండలేదు. ఆస్ట్రియా మీద ఆతడు తన పాశంబిగిస్తున్నాడు. ౧౯౩౬లో ఆస్ట్రియా ప్రత్యేక రాజ్యమని ఆతడు అంగీకరించినా ఆవాగ్దానమును ఆతడు మన్నించలేదు. జర్మను జాతివారెక్కడెక్కడున్నా సరే వారందరినీ జర్మనీ అధికారం క్రిందికి తెచ్చి జర్మన్

జాతిని ఏకీకరణం చెయ్యడం అతని జీవితాదర్శములలో ఒకటి. ఇంతేకాక జర్మనీ ప్రాంతములని అతడు తలంచిన వాటినికూడా జర్మనీసరిహద్దులో కలుపుకోడం హిట్లరు కార్యక్రమంలో ప్రధానాంశము. ముందు ఆస్ట్రియా ను జర్మన్ ప్రభుత్వంక్రిందికి తేవాలని అతడు పూనుకున్నాడు. ఆస్ట్రియాలో ఇదివరకే అనేకరహస్య నాజీవర్గములు ఏర్పడి పనిచేస్తూన్నాయి. దేశంలో ఇంచుమించు అరాజక పరిస్థితులు ఉంటున్నాయి. ఆస్ట్రియా రాజ్యపు నాజీలు దేశంలో తిరుగుబాట్లు చేయించి కల్లోలం పుట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఒకకుట్ర బయలుపడింది. ఈకుట్ర దారులకు జర్మనీ సానుభూతి సహాయాలు ఉన్నాయి. నాజీ తిరుగుబాటు దార్ల మీద ఆస్ట్రియాప్రభుత్వం చర్యతీసుకోడానికి పూనుకోగానే జర్మన్ సేనలు 'రక్తపాతం నివారించుటకై' ఆస్ట్రియా మీద పడతాయి. ఇదిఎత్తు. కానికుట్ర అసమయంలో బయలుపడిపోయింది. నాజీ కుట్రనాయకుడైన డాక్టరు టావ్సను ఆస్ట్రియాప్రభుత్వం అరెస్టుచేసింది. ఆస్ట్రియా ఛాన్సెలరు డాక్టరు షూస్నిగ్‌ను హిట్లరు తనవద్దకు పిలిపించుకొని వానిని గట్టిగా బెదిరించాడు. నాజీనాయకుడైన సేస్ఇన్ క్వార్టును ఆస్ట్రియా ప్రభుత్వంలోకి తీసుకొని నాజీ ఖైదీల నందరినీ విముదల చేయకపోతే జర్మన్ సైన్యాలు ఆస్ట్రియామీద నడుస్తాయని మందలించాడు. డాక్టరు షూస్నిగ్ విధిలేక హిట్లరు కోరికలను కొన్నింటిని అంగీకరించాడు. నాజీల ఔద్ధత్యం మితిమీరి పోతూంది. ఆస్ట్రియా జర్మనీతో కలిసి ఏకరాష్ట్రం అవడం షూస్నిగ్‌కు ఇష్టంలేదు. అందుచేత అతడు మార్చి ౧౯౩౮

లో అఖిలప్రజాసమ్మతి గైకొంటామని ప్రకటించాడు. ఆస్ట్రియా ప్రజలు స్వతంత్ర రాజ్యంగా ఉండాలని అభిల షిస్తూన్నట్లు ఋజువుచెయ్యాలని ఆతని తలంపు. హిట్లరు కోరిన ఆస్ట్రియా-జర్మనీ సమ్మేళనం చెడిపోయే సూచనలు కనబడజొచ్చాయి. ఇంక ఆలసించి లాభంలేదని హిట్లరు ప్రజాసమ్మతి ఆపివేయువలసినదని ఆస్ట్రియా ప్రభుత్వమును శాసించాడు. అట్లు చేయకపోయినచో జర్మను సైన్యాలు ఆస్ట్రియామీదికి నడుస్తాయి. నాజీలు కనుక తమ దుష్ట ప్రచారం విరమిస్తే ప్రజాసమ్మతి నిలుపుతానని డాక్టరు షూస్ నిగ్ బదులుచెప్పాడు. హిట్లరు ఉగ్రుడైపోయాడు. డాక్టరు షూస్‌నిగ్ వెంటనే తన పదవికి రాజీనామా ఇచ్చి సేస్ఇన్ క్వార్టుకు ఛాన్సెలరు పదవి ఇయ్యకపోతే ఆస్ట్రియామీద బలప్రయోగం చెయ్యబడుతుందని హిట్లరు తిరిగి అంత్య సందేశం పంపాడు. అప్పటికప్పుడే జర్మన్ సేనలు ఆస్ట్రియా చొరబడి వియన్నావంకకు పరుగెత్తివస్తున్నాయి. వెర్సా యిల్సు సంధివలన పుట్టిన ఆస్ట్రియా అస్తమించింది. వెర్సా యిల్సు నిషేధించిన ఆస్ట్రియా-జర్మనీ సమ్మేళనము జరిగింది. హిట్లరు పట్టుదల నెగ్గింది.

ఆస్ట్రియా సమ్మేళనము హిట్లరుకు లాభసాటి బేరం గానే పరిణమించింది. జర్మనీయొక్క ప్రజాశక్తి వృద్ధిపొం దింది. జర్మనీకివిశేషంగా ముడిపదార్థాలు లభించాయి. మాగ్నె సైట్ (ముడిఇనుముగల పదార్థము) ముఖ్యంగా ప్రపంచకాని కంతకూ ఆస్ట్రియానుంచే ఎగుమతిఅవుతుంది. ఇదిఇప్పుడుజర్మనీ హస్తగతమైంది. ఇదిగాక జర్మనీకి అత్యవసరమైననగదుసొమ్ము

ఆస్ట్రియాలో దొరికింది. జర్మనీ నగదు లేక చిక్కుపడుతూంది. ఆస్ట్రియానుంచి ౨౯౦,౦౦౦,౦౦౦ మార్కుల బంగారం జర్మనీ వశపరచుకొంది. ధనవంతులైన వియన్నా యూదువర్తకులను నాజీలు దోచిదోచి విస్తారమైన ధనము సంపాదించారట.

ఆస్ట్రియా జర్మనీతో కలవడంతోనే జర్మను సైన్యాలు బ్రెన్నరు కనుమమీద నిలబడ్డాయి. ఇటలీకి జర్మను సైన్యాలు ఇంతదగ్గరగా ఉండడం ఇటాలియనులకు సమ్మతం కాదు. కాని మధ్యధరాసముద్రంలో ఇటలీ అధిపత్యము సంపాదించి పెట్టడానికి హిట్లరు తోడ్పడతానని వాగ్దానం చెయ్యడంచేత ముస్సోలినీ ఆస్ట్రియా ఆక్రమణను నిరోధించలేదు. ఫ్రాన్సు నివ్వెరపడిపోయింది. బ్రిటనులో అనేకాభిప్రాయాలు వెలువడ్డాయి. "ఆస్ట్రియాప్రజలు జర్మనుజాతివారు. జర్మనుజాతి అంతా ఏకత్వం పొందకుండా మనం ఆగబట్టగలమా? ఇది న్యాయంకూడా కాదు. ఆస్ట్రియాసమ్మేళనం పూర్తి అయింది కనుక హిట్లరు తృప్తిపడతాడు. ముందు ముందు యూరపు శాంతికి భయకారణం లేదు," అని ఊరడిల్లారు. జర్మనీ పొరుగువారైన చిన్న రాజ్యాలు భయకంపితములయాయి. ముఖ్యంగా జెకోస్లోవేకియా ఆందోళనలో పడిపోయింది. హిట్లరు దురాక్రమణకాంక్షకు జెక్కు రాజ్యము గురియవుతుందేమో అని జెక్కులు విచారగ్రస్తులైపోయారు. హిట్లరు ఉద్దేశించిన కార్యక్రమం ఒకటితరువాత ఒకటి సఫలీకృతమవుతూంది. అతని పరపతి ఇంటాబయటా కూడా దుర్నిరీక్ష్యంగా ఉంది. జెకోస్లోవేకియా ఇప్పుడు శత్రుమధ్యగతమైంది. ఆరాజ్యముయొక్క రహదారులన్నీ ఇప్పుడు అమిత్ర

దేశాల్లోంచి ఉన్నాయి. యుగోస్లావియానుంచి ముడిపదార్థాలు తెచ్చుకోడం కష్టంగా ఉంది.

ఆస్ట్రియా సమ్మేళనం పూర్తి అవగానె యూరపు దృష్టులన్నీ జెకోస్లోవేకియావంక తిరిగాయి. హిట్లరు భయంకర కరవాలము ఈ చిన్న రాజ్యంమీద ఎప్పుడు పడుతుందో అని లోకం చూస్తూంది. చతురమతి అయిన హిట్లరు ఇతరప్రభుత్వాల్ని జోకొట్టాలని తెలుసుకున్నాడు. పోలండును కాని జెకోస్లోవేకియాను కాని దౌర్జన్యానికి గురిచేయడం జర్మనీ ఆశయం కాదని మార్చి ౧౯౩౮ లో హిట్లరు వాగ్దానంచేశాడు. జెకోస్లోవేకియాకు సమ్మతం పుట్టేటట్లు ఈ వాగ్దానాలు తిరిగితిరిగి చెయ్యబడ్డాయి. జర్మనీ-జెకోస్లోవేకియాలనడుమ ౧౯౨౫ లో జరిగిన 'మధ్యవర్తి పరిష్కార నియామకము' ఇప్పటికీ అమలులో ఉందనీ, జెకోస్లోవేకియాకు భయములేదనీ బారన్ నాన్ న్యూరాథ్ నచ్చచెప్పాడు. ఆస్ట్రియాసమ్మేళనం అయినతర్వాత ఫ్రాన్సు రష్యాలు జెకోస్లోవేకియాకు తాము ఇదివరలో ఇచ్చిన సహాయ హామీని తిరిగి ప్రకటించి, జెకోస్లోవేకియామీద దురాక్రమణ జరిగితే తాము యుద్ధానికి పూనుకుంటామని హెచ్చరించాయి. బ్రిటనుకూడా జెకోస్లోవేకియాకు సహాయహామీ ఏదైనా ఇస్తుందాఅని పార్లమెంటులో అడుగగా చేంబర్లేన్ ప్రధాని ఇందులకు ఒప్పుకోలేదు. కాని బ్రిటనుకున్నూ ఫ్రాన్సుకున్నూ అన్యోన్య సహాయసమాఖ్యలుండడంచేతనూ, ఫ్రాన్సు ఏ కారణంచేతనైనా యుద్ధంలో దిగితే బ్రిటనుకూడా దిగవలసివస్తుందిగనుకనూ, జెకోస్లోవేకియామీద జర్మనీ

దురాక్రమణ జరిపితే బ్రిటిషువారినికూడా యుద్ధంలోకి దింపే పరిస్థితులేర్పడకపోవని హెచ్చరించాడు. జెకోస్లావేకియాకు ఇంతమంది ప్రబలమిత్రులు ఉండడంచూసి హిట్లరు జాగ్రత పడ్డాడు. కాని ఆతడు దీక్షించిన అఖిల జర్మన్ ఏకీకరణానికి ఎట్టి అడ్డంకులను ఆతడు మన్నించదలచుకోలేదు.

గత యుద్ధానంతరం ఏర్పడిన చిన్న రాజ్యాలలో జెకోస్లావేకియా, పరిపాలనా సౌష్ఠవమునందేమి, ప్రజాస్వామిక ఆదర్శాభిమానమునందేమి, పారిశ్రామిక కౌశలమునందేమి అగ్రస్థానం వహించింది. జర్మనీయొక్క బెదిరింపులకు లొంగని ధైర్యస్థైర్యములు కల చిన్నజాతి జెక్కు ప్రజాస్వామిక మొక్కటే. నానాజాతిసమితియందును, సమిష్టిక్షేమవిధానమునందునూ జెక్కు అధ్యక్షుడు డాక్టరు బెనిష్ గారికి విశ్వాసం మెండు. యూరపు తూర్పుభాగంలో ఫ్రాన్సుయొక్క పరమ మిత్రము జెకోస్లావేకియా. ఫ్రాన్సుమీద ఎప్పుడైనా హిట్లరు కత్తికట్టవలసివస్తే వెనకనుంచి జెకోస్లావేకియా జర్మనీమీద పడకుండా ఉండాలి. జెక్కుప్రజాస్వామికముయొక్క వ్యూహస్థితి జర్మనీకి చాలా అపాయకరమైనది. "జెక్కు రాజ్యము ఒకపొడుగైన బల్లి ఆకారంగా కనబడుతుంది. ఈ బల్లి వెన్ను పోలండును తాకుతూఉంది. దీనియొక్క కడుపు హంగేరీ, ఆస్ట్రియాలమీద నిలిచింది. దీని ముక్కు జర్మనీ లోపలికి చొచ్చుకుపోయింది," అని ఒకరు వ్రాశారు. ఈ బల్లిముక్కు భాగము వజ్రకఠినమైనది. ఈ ప్రాంతంలో సుడేటన్ పర్వతాలు జర్మనీ బొహీమియాలనడుమ పెట్టని కోటలా

ఉంటాయి. ఈ పర్వతాల నాశ్రయించి జెక్కులు ఫ్రెంచివారి మాజినో దుర్గపంక్తి వంటి దుర్భేద్య కట్టడములను ౫౦,౦౦౦,౦౦౦ పౌన్లు ఖర్చుపెట్టి నిర్మించుకొని ఆత్మరక్షణకు సిద్ధంగా ఉన్నారు. పైగా వారివద్ద ౧౫ లక్షల దిట్టరి సైన్యమూ, ౨౦౦౦ విమానసంఖ్య ఉంది. ఇటువంటి జెక్కు ప్రజాస్వామికమును వీర్యవంతంగా ఉంచడం హిట్లరు భావి కార్యక్రమమునకు క్షేమంకాదు. దీనిని ప్రతారించడం ఎట్లా అని సమస్య.

జెకోస్లావేకియాకు విపద్బీజము అక్కడ ఉండే సుడేటన్ జర్మనుల్లో ఉంది. వీరి సంఖ్య ౩౫ లక్షలదాకా ఉంది. ఈ సుడేటనులు పర్వతములకివతల వలసవచ్చిన వారు. వెర్సాయిల్సు సంధినాటి అల్పసంఖ్యాకవర్గ నియామకము ప్రకారము ఈ జర్మనులకు కొన్ని సౌకర్యాలు ఇవ్వవలసిఉంది. కాని జెక్కులు ఈ నిర్ణయమును విశేషముగా మన్నించినట్లు కనబడదు. సుడేటన్ జర్మనులను ఉపకరణంగా ఉపయోగించి జెక్కు అధికారాన్ని కూలద్రోయడానికి హిట్లరు ఎత్తువేశాడు. కాన్రాడ్ హెన్లీన్ అనే సుడేటన్ జర్మన్ నాయకుని దగ్గరకు తీసుకొని హిట్లరు వానిమూలంగా సుడేటన్ ప్రాంతంలో వ్యతిరేకప్రచారం సాగించాడు. ఏప్రిల్ ౧౯౩౮లో హెన్లీన్ కొన్ని షరతులు కోరాడు. వీటిని కార్ల్స్‌బాడ్ షరతులు అంటారు. సుడేటన్ జర్మనులకు జెక్కు రాజ్యంలోనే స్థానికస్వపరిపాలనాధికారం ఉండాలని కోరాడు. ఇది యుక్తమే. ఇదిగాక సుడేటనులలో జర్మనీలోవలె నేషనల్ సోషలిజం స్థాపించనివ్వాలనీ, జెక్కుల

విదేశాంగనీతి జర్మనీకి అనుగుణంగా ఉండాలనీ కోరాడు. దీనికి జెకొ ప్రజాస్వామికము ఒప్పుకోలేదు. రష్యా, ఫ్రాన్సుల మైత్రిని వారు గర్హింపవుూనుకోలేదు. ఇట్లుండగా చేంబర్లేన్ అమెరికా పత్రికలతో ప్రసంగిస్తూ, "బ్రిటను ఫ్రాన్సులు కాని రష్యాకాని జెకోస్లొవేకియా స్వాతంత్రం కోసం యుద్ధం చెయ్యజాలవ"ని అన్నాడు. ఇది తెలవగానే హిట్లరు జెకొల పని పట్టాలని నిశ్చయించాడు. జర్మన్ పత్రికలు జెకొ రాజ్యాన్ని విపరీతంగా దూషించడం మొదలుపెట్టాయి. సోదర జర్మనులను జెకొలు అష్టకష్టాలు పెడుతున్నారని తీవ్రప్రచారం సాగించాయి. జర్మను సైన్యాలు వ్యూహాశిక్షణ మిష పెట్టుకొని జెకోస్లొవేకియా సరిహద్దుల మీదికి నడిచాయి. జెకొ సరిహద్దులమీద జర్మనీ పడినట్లయితే ఫ్రాన్సు చూస్తూ ఊరుకోదని ఫ్రాన్సు తీవ్ర హెచ్చరిక ఇచ్చింది. కథ అడ్డం తిరిగేటట్లుందని హిట్లరు తటపటాయించాడు. చేంబర్లేన్ గారి సాంత్వననీతి వెంటనే ఆతనికి జ్ఞాపకంవచ్చింది. చేంబర్లేనుగారు జెకొ సమస్యను అన్వయించడానికి రన్సిమన్ ప్రభువును జెకోస్లొవేకియాకు పంపించాడు. ఈయన మూడునెలలు సాముచేసి సుడేటన్ నాయకుని షరతులను అంగీకరించమని జెకొ ప్రభుత్వాన్ని బలవంతం చేశాడు.

ఇంతటితో కథ ఆగితే బాగుండేది. కాని హిట్లరును పూర్తిగా తృప్తిపరచాలంటే సుడేటన్ జర్మను ప్రాంతమును ఆతనికి సమర్పించడమే జెకోస్లొవేకియాకు క్షేమంకరమని లండను టైమ్సుపత్రిక జోస్యంచెప్పింది. మళ్లీ జర్మన్-జెకొ

సంఘర్షణ బయలుదేరింది. హిట్లరు స్వయంగా డాక్టరు బెనిష్‌ను నిందిస్తూ మాట్లాడాడు. ఏదో కొంప మునుగుతుందని యూరపు ఆతురతతో ఉంది. యూరపులో యుద్ధాగ్ని రవుల్తోంది. అప్పుడు యూరపు శాంతిని కాపాడడానికి చేంబర్లేన్ ప్రధాని ౧౫ సెప్టెంబరునాడు హిట్లరువద్దకు ప్రయాణం కట్టాడు. ఏదో సమాధానం కుదురుద్దామని అతని ఉద్దేశం. హిట్లరు ఖండించాడు. జెకోస్లోవేకియా సరిహద్దు జిల్లాలను, వారి మాటనో దుర్గపంక్తితోసహా జర్మనీకి సర్వంగా ఇచ్చేస్తే సరే. లేకపోతే బలవంతంగా ఆక్రమిస్తానన్నాడు. చేంబర్లేన్ విచారచ్ఛాయతో లండనుకు వచ్చేసి ఫ్రెంచి మంత్రులను ఆహ్వానించి సంప్రతించాడు. వీరొక ప్రణాళిక తయారుచేశారు. నూటికి ౫౦ మందికి మించిన జర్మనులు నివసించే ప్రాంతాలన్నీ జెకోస్లోవేకియా జర్మనీకి ఇచ్చెయ్యాలి. ఇట్లా ఇవ్వకపోతే బ్రిటనుఫ్రాన్సులు జెక్కులకు సహాయం చెయ్యజాలవు. తమమిత్రులే శత్రులవడంచూసి జెక్కు అధ్యక్షుడు విధిలేక ఈ షరతులకు ఒప్పుకున్నాడు. కాని హిట్లరు తృప్తిపడలేదు. చేంబర్లేన్‌గారు హిట్లరును రెండవపర్యాయం దర్శించాడు. ఈమాటు హిట్లరు చేంబర్లేన్ ముందర ఒక పటంపడవేసి, "ఈపటంలో గుర్తుపెట్టిన ప్రాంతాల్లోనుంచి జెక్కులు తక్షణం వెళ్ళిపోవాలి. మరికొన్నింటిలో ప్రజాసమ్మతి తీసుకోవాలి. లేకపోతే యుద్ధం తప్పదు"అని బెదిరించాడు. చేంబర్లేన్ మరీ కుంగిపోయాడు. నిరాశపడిపోయాడు. ఆంగ్లో-ఫ్రెంచి ప్రణాళిక హిట్లరు కోరికలన్నీ చాలవరకు అంగీకరించింది. ఇక కలహకారణం కనబడదు.

అయినప్పటికీ బ్రిటనుకు అతిదూరంలో ఉన్న ప్రజలనడుమ పుట్టిన ఈ కలహంలో బ్రిటిషువారికి ఏమీ ప్రమేయంలేదనీ, బ్రిటను, జెకొలకోసం యుద్ధం చెయ్యదనీ చేంబర్లేన్ ఉపన్యసించాడు. హిట్లరు కోరేది ఇటువంటి చిత్తవృత్తియే. ఆతని గుప్పిడిలోఉన్న పిట్టకు ఎవరూ సహాయంరాకూడదు.

జర్మన్-జెకొవివాదము శ్రుతిమించి రాగాన పడుతూంది. ౨౨ సెప్టెంబరు లోపులో జెకొ ప్రజాస్వామికం లొంగకపోతే హిట్లరు సైన్యాలు జెకొ రాజ్యం మీదపడతాయి. యూరపు యుద్ధమేఘములు కారుకమ్ముకుంటున్నాయి. బ్రిటిషు నౌకాదళము యుద్ధసన్నద్ధం కావాలని ఆజ్ఞ ప్రకటింపబడింది. అమెరికా అధ్యక్షుడు హిట్లరుకు తంతి కొడుతున్నాడు తొందర పడవలదని. ముస్సోలినీకికూడా యుద్ధంలో దిగడం ఇష్టంలేదు. అతడు హిట్లరు బండికి బ్రేకు వేస్తున్నాడు. ఇంత గడబిడలో సోవియటు వారిమాట వినబడలేదు. హిట్లరు ఔద్ధత్యాన్ని అరికట్టడానికి శాంతి కక్షలో చేరమని సోవియటును ఎవ్వరూ ఆహ్వానించలేదు. జెకోస్లొవేకియా మీద జర్మనీ దురాక్రమణచేస్తే సోవియటు బ్రిటను ఫ్రాన్సుల సహాయానికి వస్తుందా అని మొదట బ్రిటిషు ప్రతినిధి, లిట్వినోవును అడిగాడు. బ్రిటను ఫ్రాన్సులు యుద్ధంలోకి దిగితే తప్పక సైన్యసహాయంచేస్తామని, అంతటితో ఆగక వెంటనే ఈ మూడురాజ్యాలవారు సైనిక సంప్రతింపులు చెయ్యాలనీ సోవియటు ప్రతినిధి ప్రతిపాదించాడు. కాని ఈ మిత్రహస్తము తృణీకరింపబడింది. మొత్తంమీద ఆంగ్లో—ఫ్రెంచి సంరంభమును చూసి హిట్లరు మరొక్క మాటు

# సాంత్వన నీతి.

సాంత్వన కామధేనువును పితకాలనుకున్నాడు. హఠాత్తుగ ఆతడు శాంతిప్రియుడైన చెంబర్లేన్, డెలేడియర్, ముస్సోలినీ గార్లు మ్యూనిక్ నగరంలో తనతో వచ్చిమాట్లాడ వలసిందని ఆహ్వానం పంపాడు. తాను యుద్ధంవలన సంపాదించగలనో లేదో అనే సందేహాంశాల కోర్కెలను వీరు ఎట్లాగైనా ప్రసాదిస్తారని ఆతనికి విశ్వాసముంది. ఈ సమావేశమునకు సోవియటును బహిష్కరించారు. 'పెళ్ళికిపెళ్ళికొడుక్కూడానా' అన్నట్లు అసలు ఎవరిభాగ్యరేఖ మ్యూనిక్‌లో వక్రితమం చెయ్యబడుతుందో అట్టి జెకోస్లొవేకియా ప్రతినిధులను ఈ మహారాజ్యాలవారు సమావేశంలో చేరనియ్యలేదు. చివరకి వీరు పాతాళహోమంచేసి తేల్చినదేమంటే.

౧. జెకోస్లొవేకియా తన సరిహద్దు జిల్లాలనూ, తన మాజినో దుర్గపంక్తిని సురక్షితంగా జర్మనీకి అప్పగిస్తూ వారం రోజుల్లో అక్కడినుంచి తొలగిపోవాలి.

౨. జర్మనీ, ఇటలీ, బ్రిటను, ఫ్రాన్సు ప్రతినిధులుగల అంతర్జాతీయ ఉపసంఘమువారు ఇంకా ఏభాగములు జర్మనీకి చెందాలో నియామకంచేసి, అవసరమైనచోట్ల ప్రజాసమ్మతి ఏర్పాటుచేసి చెకో-జర్మన్ సరిహద్దులను తిరిగనిర్మిస్తారు.

జెకోస్లొవేకియా ఇప్పుడు చెప్పలేనిదైన్యంలో పడిపోయింది. మిత్రులూ జారవిడిచారు. శత్రువులు బలపడ్డారు. ఆత్మవినాశసముకన్న మార్గం కనబడలేదు. జర్మనీతో ఏకాకియై వారు ఏమి నిగ్రహించగలరు? బ్రతికిఉంటే బలుసాకు తినవచ్చుననే నీతి ఎటువంటివారికి ఒక్కొక్కప్పుడు శరణ్యం అవుతుంది. వారు అవమానదుఃఖంచేత క్రుంగి క్రుంగిపోయి

తమ నిస్సహాయత్వమునకు లొంగిపోయారు. చేంబర్లేన్ ప్రధాని శాంతిని కాపాడి హిట్లరువద్ద ఒక కాగితం సంపాదించాడు. దీని ప్రయోజనం ఏమిటంటే. జర్మనీ బ్రిటనుల నడుమ "యుద్ధం ఉండకూడదు" అని వీరుభయులూ వ్రాసుకున్నారు. ఈ కాగితం పుచ్చుకొని చేంబర్లేన్‌గారు బ్రిటనుచేరేసరికి ప్రజల ఆనందమునకు మేరలేదు. పూర్వం విజయరథం ఎక్కివచ్చిన సీజరుకు కూడా ఇంత ఆతిథ్యం జరగలేదు. యుద్ధభయం గడిచిపోయిందికదా అని అమాయక ప్రజలు ఆనంద బాష్పములు కురిపించారు. "ఇంక మనతరంలో యుద్ధభయంలేదు" అని గంభీరంగా చేంబర్లేన్ ఉపన్యసిస్తూ హిట్లరు ఇచ్చిన కాగితాన్ని ప్రదర్శించాడు.

అక్కడ హిట్లరు ఒక్క గుండుపేలకుండా జెకోస్లోవేకియాను చీల్చి చెండాడగలిగినందులకు విపరీతంగా సంతోషించాడు. ఆతనికి అపారమైన లాభం కలిగింది. జెక్కుల ఆత్మరక్షణ సాధనాలైన దుర్గాలు తనకి వశం అయాయి. అందుచేత జెక్కులింక ప్రక్కలో బల్లెంలాగ ఉండజాలరు. జెక్కుల రైల్వేలు జర్మనీ వశం అయాయి. వారి బొగ్గు గనులలో సగానికి మించి జర్మనీ పాలబడ్డాయి. జెక్కుల గాజు పరిశ్రమలో నూటికి ౫౫ వంతులున్నూ, నేత పరిశ్రమలో నూటికి ౪౯ వంతులున్నూ, జెక్కు పారిశ్రామిక ప్రజల్లో మూడవవంతున్నూ జర్మనీకి వశం అయిపోయాయి. ఇంకేముంది? జెక్కుల వెన్నెముక విరిగిపోయింది. వారింక లేవలేరు. బ్రిటను ఫ్రాన్సుల భయగ్రస్తతచేతనైతేనేమి, వారి అంధప్రాయమైన నీతిచేతనైతేనేమి తూర్పు యూరపులో

వారికి పరమమిత్రము, బలవత్తరము నైన జెకోస్లావేకియా ప్రజాస్వామికము ఛిన్నాభిన్నమయిపోయింది. జర్మనీ పలుకుబడి పరభయంకరం అనిపించింది. డెమాక్రసీలు ఆరిపోతూన్న గడ్డి మంటలు అనిపించాయి. జెకోస్లావేకియా బలిని గురించి చర్చిలు ఇట్లా విమర్శించాడు. "జర్మనీ నియంత బల్లమీద ఉన్న భోజనపదార్థములను తానే గుంజుకోకుండా ఒకటి తరువాత ఒకటి మనం వడ్డించడానికి ఒప్పుకున్నాడు. ఆతడు పిస్తలు గురిపెట్టి ఒక పౌండు తెమ్మన్నాడు. మనం ఇస్తామన్నాము. తిరిగి పిస్తలు గురిచేసి రెండు పౌండ్లు ఇస్తారా ఇవ్వరా అని గద్దించాడు. చివరకు ఆతడు ౧ పౌండు ౧౭ షిల్లింగుల ౬ పెన్నీలు పుచ్చుకోడానికి అంగీకరించి, 'చూశారా మీమీద కరుణచూపించాను. మీరు నాయెడ సుముఖులైఉండాలి' అన్నాడు...... మనము సంపూర్ణమై నీరంధ్రమైన అపజయం అనుభవించాము."

మ్యూనిక్ మహావిషవృక్షముయొక్క విషఫలములు తరువాతగాని కోతకురాలేదు. మ్యూనిక్ నీతివిషయమై ప్రపంచమంతటనూ వాదోపవాదాలు బయలుదేరాయి. జెకోస్లోవేకియా విపత్సమయమున బ్రిటను ఫ్రాన్సులు యుద్ధమునకు సిద్ధముగాలేరనియూ, వారి వైమానికబలము జర్మని బలముకన్న హీనముగా నుండెననియు, జిబ్రాల్టరు వంటి ఆయువు పట్టుస్థానంలో విమానవ్యతిరేక ఫిరంగులు లేవనీ అందుచేత ఆసమయంలో హిట్లరుతో యుద్ధానికి దిగడం క్షేమకరంకాదని వాని కోరికలను ప్రసాదించాలనీ కొందరు అన్నారు. చేంబర్లేన్ గారి సాంత్వన నీతితో ఏకీభవించక

# రెండో ప్రపంచయుద్ధమా ?

డఫ్ కూపరు బ్రిటిషు మంత్రివర్గంనుంచి రాజీనామా ఇచ్చి తొలగిపోయాడు. డాక్టరు బెనిష్ తన దేశావమానమును భరించలేక జెకోస్లొవేకియా అధ్యక్షపదవి విడిచిపెట్టి దేశాంతర గతుడై పోయాడు.

మ్యూనిక్ లో జరిగిన కపటనాటకము వలన డెమాక్రసీలకు ఏమి ప్రయోజనంలభించింది? ఫ్రాన్సు ఎందుకు జెకోస్లొవేకియాకు ఇచ్చినహామీని తృణప్రాయంగా త్రోసి పారవేసింది? ఫ్రాన్సు ఇప్పుడు నామకః మొదటి తరగతి ప్రభుత్వాల్లో చేరినా అంతర్వివాదముల వలన కలిగిన దౌర్బల్యం చేత క్రమంగా తనవ్యక్తిత్వము పోగొట్టుకొని బ్రిటను అడుగుజాడల్లో నడిచే రెండవతరగతి శక్తిగా పడిపోయింది. బ్రిటనుయొక్క యుద్ధవిధానము గత సంవత్సరములలోని అజాగ్రతవలన సర్వసిద్ధంగా లేదు. అందుచేత హిట్లరును ధిక్కరించి సధైర్యంగా ఆతని అత్యాశను అరికట్టేచొరవ బ్రిటనులో అప్పుడు లేదు. ప్రజాస్వామికములు యుద్ధానికి తయారవడానికి కొంత వ్యవధి కావాలనుకున్నారు. మ్యూనిక్ వలన వ్యవధి లభించిందికాని ఒకమూలనుంచి వారిప్రక్కన నిలబడిపోరదగిన మిత్రరాజ్యములన్నీ ఒకటి వెంబడి ఒకటి కూలిపోతున్నాయి. ముఖ్యంగా మ్యూనిక్ విషపరిణామము బాల్కనుల్లో కనబడుతూంది. బాల్కనుల్లోని ౭౫,౦౦౦,౦౦౦ ప్రజలు, ధాన్యసమృద్ధిగలవారి దేశములూ నాజీ సింహాసనానికి నివాళి ఇచ్చినట్లయింది. జెకోస్లొవేకియా సమస్యమీద బ్రిటను ఫ్రాన్సులు, రష్యాను చెయికలుపుకొని స్థైర్యంతో

# సాంత్వన నీతి.

జర్మనీని అడ్డుకొనిఉంటే ఈ బాల్కనురాష్ట్రములన్నీ ధైర్యం చిక్కబట్టిఉండును. కాని అట్లు జరగకపోడంచేత బంగారం పండే డాన్యూబు నదీప్రాంతమంతా హిట్లరుకు అరచేతిలో అరటిపండులా వచ్చిపడింది. మ్యూనిక్ వ్యతిరేకులైన వారు ఇట్లా వాదించారు. "ఈరోజున డెమాక్రసీలు ఆత్మక్షేమంకోరి నాజీ దురాశ అనే భూతానికి చిన్నచిన్న రాజ్యాలను ఒకటి తరువాత ఒకటి బలివేసుకుంటూ వెడితే ఇట్లా ఎంతదూరం ఎన్నాళ్లు పోగలుగుతారు? ఎప్పుడో ఒకనాడు ఈ దురాక్రమణ భూతం వీరి నెత్తిని కొట్టకపోతుందా! ప్రజాస్వామికములను మాత్రం దయదలచి విడిచిపెడుతుందా? ఆ దుర్దినం వచ్చినప్పుడు వీరు మిత్రసహాయం లేక ఏకాకులై తమ దౌర్భాగ్యమునకు కళ్ళంపట రక్తం ఓడ్చుకుండా ఉంటారా?" అని శోకించారు.

---

## ౮. క్షణిక శాంతి.

మ్యూనిక్ తరువాత యూరపు వాతావరణంలో క్షణిక శాంతి రేఖలు కనబడ్డాయి. కాని అంతలోనే ఈ మెఱుపు అదృశ్యమై తిరిగి చిమ్మచీకటి అలముకొనజొచ్చింది. మ్యూనిక్ నుంచి తెచ్చిన "యుద్ధం ఇక లేదు" అనే కాగితాన్ని ప్రదర్శిస్తూనే చేంబర్లేన్ ప్రధాని బ్రహ్మాండమైన మొత్తములు ఆయుధనిర్మాణంకోసం కోరుతున్నాడు. నిజంగా యుద్ధభయం తొలగిపోతే ఆయుధనిర్మాణ సంరంభం ఎందుకని పామరులు అంతా ఆశ్చర్యపడజొచ్చారు. హిట్లరు అనేకమార్లు తాను చేసిన వాగ్దానాలు చించిపారేశాడుగదా! ప్రస్తుత వాగ్దానములకుమాత్రం అంతకన్న ఎక్కువ విలువ ఏముందని సందేహపరులు అడిగారు. "నిజమేకాని హిట్లరు ఇప్పుడు వాగ్దానం నాతో చేశాడు" అని చేంబర్లేన్ సమాధానం చెప్పాడట. సుడేటన్ జర్మను సమస్య పరిష్కారం అయింది కనుక హిట్లరు చల్లబడతాడని ఆశాపరులు అనుకున్నారు. రెక్కలు తెగకొట్టబడిన జెకోస్లొవేకియాకు బ్రిటను ఫ్రాన్సులు తిరిగి హామీ ఇచ్చారు. ఈ హామీవలన జెక్కులస్థితి మునుపు ఎప్పుడు లేనంత బలపడిందని చేంబర్లేన్ వాక్రుచ్చాడు. లోకం నమ్మింది. మ్యూనిక్ లాంటి శ్రమలేని విజయం ఇప్పించినందుకు హిట్లరు బ్రిటిషు రాజకీయజ్ఞులకు కృతజ్ఞుడై యుంటాడని తలంచిన తలంపు శుద్ధ పొరపాటైంది. జర్మనీ వ్యవహారాల్లో బ్రిటిషువారి జోక్యం ఎంతమాత్రమూ సహించనని, అతడు ఈడెన్, చర్చిలు, డఫ్ కూపరు గార్లను యుద్ధోన్మాదులని తీవ్రంగా విమర్శించాడు. మ్యూనిక్ తరువాత హిట్లరు జర్మనీలోని యూదుల భరతంపట్టాడు. ఏదో వంకపెట్టి వారి

వద్ద పేరుకొని ఉన్న ధనపుకొండలను దోచుకుని ప్రభుత్వ ములో డబ్బులేని కొరతను తీర్చుకుంటున్నాడు. ఒక జర్మనును ఎవడో యూదు వాడు చంపిన నేరమునకై హిట్లరు యూదు సంఘంమీద రూ 3,000,000 పౌండ్ల జుర్మానా విధించాడట.

నాజీజర్మనీ చేత భళీ అనిపించుకుందామనే ఇతర రాజ్యాలుకూడా దురదృష్టవంతులైన యూదులమీద సల్లేరు మీదకి బండిలా నడుస్తున్నారు. ఇందులో హంగేరీ పూర్తిగా నాజీ శుశ్రూష చేస్తూంది. చాలాదినములనుంచి హంగేరీకి జర్మనీపై అభిమానముంది. జెకోస్లావేకియా ఆపత్సమయంలో పోలండు హంగేరీలు కూడా కత్తులునూరుకొని సిద్ధంగా కూర్చున్నాయి. జెక్కులనుంచి ఈ రెండు దేశాలుకూడా కొంత భూభాగం లాగుకొనికాని తృప్తిపడలేవు. జెకోస్లావేకియా కూలిపోయినతర్వాత హంగేరీ మునుపటికన్న ఎక్కువగా జర్మనీ అదుపాజ్ఞల్లో చిక్కింది. హంగేరీకూడా హిట్లరుకు ప్రీతిదాయకమైన ఆంటీకమింటరన్ సమాఖ్యలో చేరి నాజీ అభిమానం చూపెట్టుకొంది. జర్మనీ కన్నులు చాలకాలము నుంచీ రుమేనియామీద ఉన్నాయి. రుమేనియా పెట్రోలున్నూ, గోధుమపంటయున్నూ జర్మనీకి చాలా అవసరములు. డెమాక్రసీలతో జర్మనీ యుద్ధంలో చిక్కుకుంటే రుమేనియా నుంచిమాత్రమే నూనెపదార్థములు జర్మనీకి సప్లయి అవాలి. సముద్రాలమీద దూరదేశాలనుంచి రావడానికి వీలులేదు. అందుచేత రుమేనియా ప్రభుత్వాన్ని ఎట్లాగైనా చెప్పుచేతల్లో ఉంచుకోడం జర్మనీకి అవసరం. మ్యూనిక్ సమాఖ్య తరువాత రుమేనియా భయగ్రస్తమైంది. తత్ఫలితంగా

## రెండో ప్రపంచయుద్ధమా?

జర్మనీ-రుమేనియా వ్యాపారసమాఖ్య ఏర్పడింది. రుమేనియా యొక్క ఆర్థికజీవితము జర్మనీ అనుకూలాలకు సరిపడేటట్లు ఏర్పాటుచెయ్యడమే దీని ముఖ్యోద్దేశము.

జెక్కు ప్రజలు కూలిపోయిన తమ రాజ్యసౌధమును దుఃఖభారంచేత క్రుంగిపోయిన హృదయాల్లో పునః నిర్మించుకుందామని ప్రయత్నిస్తున్నారు. ఇంతలో హిట్లరు తిరిగి వారి మీాద లంఘించి జెకోస్లొవేకియాను యూరపు పటమునుంచి తుడిచిపారేశాడు. ఆతడు శత్రుశేషమును మిగల్చదలచుకోలేదు. జెకోస్లొవేకియా మళ్ళీ తలయెత్తడం ఆతనికి ఎంతమాత్రమూ ఇష్టములేదు. శేషించిన జెక్కు రాజ్యం నిర్మూలించడానికి ఆతడు ఒక క్రొత్త ఎత్తుపన్నాడు. జెకోస్లొవేకియా రాజ్యంలో భాగస్థులైన స్లొవేకియా ప్రజలు నాజ ప్రోత్సాహంచేత జెక్కులమీాద ఎదురుతిరిగారు. వారు స్వతంత్ర రాష్ట్రంగా ఉంటామని ప్రేగు ప్రభుత్వాన్ని నిరసించారు. హిట్లరు జెక్కుల అధ్యక్షుని పిలిపించి ఆతనిని భయభ్రాంతుని గావించి బోహీమియా, మొరేవియా ప్రాంతములను జర్మనీ సంరక్షణక్రిందకు తీసుకుని జర్మనీలో కలుపుకున్నాడు. స్లొవేకియాకు నామకార్థపు స్వాతంత్ర్యం అంగీకరించాడు. జర్మనీకి భక్తులైన హంగేరీవారికి జెకోస్లొవేకియా ప్రజాస్వామికంలో భాగంగా ఉండిన రుథీనియా ప్రాంతం బహుమతీగా ఇచ్చాడు. దీనివలన పోలండు హంగేరీలు చిరకాలంనుంచీ కోరుకొంటూన్న ఏకసరిహద్దు ఏర్పడి వారు చాలా మురిసిపోయారు. ౧౫ మార్చి ౧౯౩౯ తో జెకోస్లొవేకియా ప్రజాస్వామికం అస్తమించింది. బోహీమియా, మొరేవియాలు కలుపుకోడం

చేత జర్మనీ ప్రజాశక్తి ౧౫,౦౦౦,౦౦౦ పెరిగింది. ఎన్నో వ్యావసాయిక సాధనములూ, అపారమైన కట్టెసరకులూ, జగత్ప్రసిద్ధమైనస్కోడా ఆయుధనిర్మాణ యంత్రాగారములు, వేలకొలది తుపాకులు ఫిరంగులు, మందుగుండు సామాను, ౬ కోట్ల పౌండ్ల నగదు బంగారము ఇవన్ని హిట్లరుకు చేజిక్కాయి. ఇదివరలో జెకోస్లోవేకియా, ఆయుధనిర్మాణ వ్యాపారంలో చాల పేరువడిసింది. బాల్కను రాష్ట్రములన్నింటికి ఇక్కడనుంచే ఆయుధసామగ్రి సప్లైఅయేది. స్కోడా యంత్రాగారములు జర్మనీ వశం అవడంచేత బాల్కను రాష్ట్రాలకు గొప్ప చిక్కువచ్చిపడింది. ఆత్మరక్షణకై వారికి ఆయుధముల సప్లయి పడిపోయింది. ఆస్ట్రియా జెకోస్లోవేకియాలు అస్తమించినతరువాత ఆగ్నేయ యూరపు అంతా హిట్లరుకు వాహ్యాళి ప్రదేశమై పోవడం ఆశ్చర్యంకాదు. జర్మనీయొక్క బ్రహ్మాండమైన యుద్ధశక్తికి తోడు ఈ చిన్న రాజ్యాలలో గృహకల్లోలాలు, వాటిని భయభ్రాంతములు చేశాయి. రుమేనియాలో అల్పసంఖ్యాకసమస్య; యుగోస్లావియాలో క్రోటు-సెర్బు(Croat-Serb)వివాదము. జర్మనీ తనకు తోచినప్పుడల్లా ఈ అల్పసంఖ్యాక వర్గాన్ని రెచ్చకొట్టి అంతర్యుద్ధంపుట్టించి శాంతి స్థాపించే నెపంమీద ఈరాజ్యాలమీద పడగలదు. కావున యుగోస్లావియాకూడా నాజీ సౌమనస్యం కోసం ప్రాకులాడుతూంది.

బ్రిటను ఫ్రాన్సులు, హిట్లరు భుక్తశేషమైన జెకోస్లోవేకియాకు ఇచ్చిన అభయంమాటేమిటి? హిట్లరు విజయతంత్రంచేత ప్రజాస్వామికములు దిగ్భ్రాంతి చెందిపోయాయి.

ఏమిచెయ్యాలో తోచలేదు. మార్చి ౧౯౩౯ లో జెకోస్లోవేకియామీద వచ్చిన ఆపత్తు హిట్లరు కృతంకాదు, అది అంతర్వివాదంకనుక బ్రిటను ఇచ్చిన హామీ ఇప్పుడు వర్తింపవని చేంబర్లేన్ సమాధానం చెప్పాడు. కాని శాంతిప్రియుడైన చేంబర్లేన్ హృదయంలోకూడా క్రోధాగ్ని, తిరస్కారభావమూ, విషాదమూ పెచ్చుపెరిగిపోయాయి. రెండు సంవత్సరములనుంచి ఆతడు సాంత్వనమంత్రమును ఉపాసిస్తున్నాడు. జర్మనీ ఇటలీ నియంతలను తృప్తిపరచి శాంతి కాపాడాలని చూశాడు. వారికి స్వప్నంలో కూడా, గొంగళి పురుగుకు విభూతివలె ద్వేష్యములైన, నానాజాతిసమితిని, చిన్నరాజ్యముల హక్కులనూ, స్పెయిన్ ప్రజాస్వామిక ప్రభుత్వమును, సోవియటు రష్యాను, చేంబర్లేన్ దూరదూరంగా పరిహరిస్తూవచ్చాడు. కాని ఏమిలాభము? ఎప్పటికప్పుడు కొత్త దురాక్రమణ కథయేకాని శాంతిస్థాపనకు సూచనలు లేవు. ౧౯౩౨ నుంచీ దురాక్రమణసిద్ధాంతము చాలా విజయవంతంగాఉంది. చీనా, అబిస్సీనియా, స్పెయిన్, ఆస్ట్రియా, జెకోస్లోవేకియా ప్రాంతములన్నీ ఒకటితర్వాత ఒకటి దురాక్రమణకు గురియయిపోతున్నాయి. ఐశ్వర్యవంతములై, అసమగ్రయుద్ధసన్నాహం కలిగిఉన్న బ్రిటిష్ ఫ్రెంచి సామ్రాజ్యాలు ఎంతకాలం ఇట్లా నిరపాయంగా ఉండగలవు? ఇన్నాళ్ళు హిట్లరు దోషభూయిష్ఠమై జర్మనీ అవమానమునకు కారణమైన వెర్సాయిల్సు సంధి నిర్ణయములను తుడిచివేస్తున్నాడు. ఆతనిఉద్దేశం ఇంతమాత్రమేఅని ప్రజలు అనుకున్నారు. కాని ఆతడు జర్మనుజాతివారుకాని జెక్కులను ఎప్పుడైతే

జర్మనీలోకలుపుకున్నాడో అప్పుడే ఆతని నిజోద్దేశము యూరపుపై జర్మన్ యాజమాన్యమును స్థాపించడమని అందరికీ వెల్లడిఅయింది. ఈరహస్యంరూఢి అవడంతోనే చేంబర్లేన్ తన యత్నములన్నీ బూడిదలో పోసిన పన్నీరుఅయిందికదా! అని ఆందోళనలో పడిపోయాడు. "ఇదేమైనా పాతచూర వయా, క్రొత్త సాహసకార్యమా? చిన్న రాజ్యములమీద ఇది ఆఖరుదౌర్జన్యమా లేక ఇంకా ఇట్టివి ప్రదర్శింపబడతాయా? ప్రపంచమునంతనూ దౌర్జన్యబలంచేత అణచివేసి తాండవమాడడానికి ఇదిమొదటిమెట్టా?" అని ఆతడు సందేహపరంపరలలో మునిగిపోయాడు. లోకంఅంతాకూడా ఇదే ధోరణిలో ప్రశ్నించుకుంటూంది.

మొదటి భాగము

సమాప్తము.

# రెండో ప్రపంచ యుద్ధమా?

రెండవభాగము అచ్చులోనున్నది.

(ఈ రెండవభాగములో, నేటికినీజరుగుచున్న యుద్ధమునుగురించి వ్రాయబడినది.)

* సవరణ: పుట. ౧౮.

| | | | | |
|---|---|---|---|---|
| పంక్తి | ౧౦ | లాసేన్ | బదులు | పోసేన్ (Posen). |
| ,, | ౧౯ | Csar | బదులు | Saar. |

రెండుపూటలైనను సరిగా తిండికి దొరకక మలమల మాడుచున్న కోట్లకొలది హతభాగ్యులకు జీవగఱ్ఱయేది ?

# రాట్నము ! ఖద్దరు పరిశ్రమ !!

ఖద్దరే దేశము నుద్ధరించును.

అందులో శుద్ధమైనట్టి సుందరమైన ఖాదీ, మనసుకు నేత్రములకు ఆనందదాయకము. ఎన్నియో రంగులలో చౌకధరలకు మన రాష్ట్రమందే వడికి నేయబడిన ఖద్దరు ఎచ్చట దొరకును ?

## భాగ్యనగర

# ఖాదీవస్త్రాలయము.

సుల్తాన్‌బజారు, హైదరాబాదు-ద.

దసరా, దీపావళీ పండుగలకు స్వదేశ, స్వరాష్ట్ర వస్త్రమునే ధరించుడు. అన్నిరకములు, అన్నివిధములైన ఉడుపులకు తగినట్టిబట్ట మావద్ద దొరకును. ధరలు మునుపటికన్న చాల తగ్గింపబడినవి.

# కలకుంట్ల వెంకన్న నేషనల్ సోప్ ఫ్యాక్టరీ

హెడాఫీసు: మహాంకాళి వీధి, సికింద్రాబాదు.

బ్రాంచులు:—

మార్కెటు వీధి సికింద్రాబాదు.

అఫ్జల్ గంజు హైద్రాబాదు.

టైగరు బ్రాండు ఫినేలు
నెప్తాల్ సోపు
గ్రీసు
మోటరు టైరుగోలా
కే. వి. గోలా
షేరు గోలా
333. గోలా
౧౧. గోలా
అయిదు బాణములు
క్వైట్ బ్రాండు
టైగర్ ఫుల్ బ్రాండు
వివిధ సబ్బులు.

మావద్ద:—

యక్స్ ప్రెసు నం. ౧౧౧
రాంలైటు
రాణాలైటు
వాంలైటు
గోల్డన్ లైటు
౧౯౩౮ నేషనల్
సన్ రైజు
సన్ బీము
సికిందరు

---

**టాయిలెట్లు**

మహాత్మా
నేషనల్
జౌహాను
సువాసన సబ్బులు

---

**దారములు**

షంబాజీ
తువాలు ౧౭౪
సిగర్ మిషన్
వివిధ రంగులవి.

మా సబ్బుతో బట్టలు పరిశుభ్రముగా చలువచేసినవానివలె తయారగును. నిజాంరాష్ట్రమున పేరుకెక్కిన సబ్బులు, మంచిసువాసనకలిగి, ముఖమునకు వన్నెతెచ్చు టాయిలెటుసబ్బులు ఇప్పుడు సిద్ధమగుచున్నవి. ఇక విదేశముల సబ్బులు ఎందుకు కొంటారు?

ఒకసారి వాడిన మీకే తెలియును.



వెండిబంగారము దగ్గర ఉన్నంత
మాత్రములో ఏమిసౌఖ్యము?
నిపుణత్వముతో నగను నాణ్య
ముగా చేయగల అంగడిలో
మీవస్తువులను తయారు చేయించు
కొనుడు.

# కబలవాయి
# సత్యనారాయణ

వెండి బంగారము, రవ్వల వర్తకులు,
పెద్దగడియారము చౌరస్తా సుల్తాన్ బజారు,
హైదారాబాదు-దక్.

అనేకవిధములైన బంగారుగాజులు నెక్‌లేసులు, ఉంగరములు, వెండివి చిత్ర: చిత్రములైనసామాన్లు, నాగరిక అలంకారములు సిద్ధముగనున్నవి. వలయునన్నచో నమ్మకముమీద, గ్యారంటీతో మీయిష్టపూర్వకముగా నకాలమునకు చేయించి యివ్వగలము. ఒకమారు పరీక్షించిన మీకే తెలియును.

---

# బొంబాయి పెన్ స్టోర్సు

గోలీగూడా, హైదారాబాదు-దక్.


పలురకములగు కలములు ఫౌంటెన్ పెన్నులు క్రొత్తవి సరసమైనధరలకు అమ్మబడును. పాతవి చౌకగా రిపేరు చేయబడును. ఫౌంటెన్ పెన్నులమీద, గ్రామఫోను రికార్డులమీద సువర్ణాక్షరములతో మీపేరులను వేయించుకొనుడు.

---

# కావలెను.

తెలంగాణాలోను, బ్రిటిషుఇండియా ఆంధ్రజిల్లాలలోను, మాప్రచురణములను అమ్ముటకు మంచికమీషనుమీద ఏజెంట్లు (ప్రతినిధులు) కావలెను.

వివరములకు: వ్యవస్థాపకుడు,
ఆంధ్ర కేసరి గ్రంథమాల.




మోసపోకుడు !
మా ట్రేడ్ మార్కు
చూసి కొనుడు

అందమే ఆనందము !
కాలమే ద్రవ్యము !!
ద్రవ్యమే సర్వము !!!

క్రొత్త సరకు !
మామూలుధరలే !!
క్రొత్త డిజైన్లు !!!

కాబట్టి అందమగు పనితనమునకు ఆనందించి, కుట్టి సిద్ధముగా నుంచిన బట్టలను చౌకధరలకుకొని, మీ కాలమును, ద్రవ్యమును భద్రపరచుకొనుడు.

మా వద్ద

హానావా, గివేరా, సిల్కు, మస్లిన్ మొదలగు రకములలో సిద్ధపరుపబడిన, కోట్లు, పట్లోన్లు షర్టులు, షేర్వానీలు, ఫూనా ప్యాంట్లు, లాగులు, నెక్కర్లు మొదలగునవి దొరకును.

ముఖ్యముగా చిన్నపిల్లలకు వలయు ఫ్రాకులు, గౌన్లు, నెక్కర్లు, అన్ని సైజులలో అన్ని రంగులలో దొరకును. స్త్రీలకొరకుగూడా, తయారైన వస్త్రములు తెప్పించినాము. ఫ్యాషన్‌కు 'పతంగే బ్రదర్సు' పెట్టింది పేరు.

# పతంగే బ్రదర్సు

హెడాఫీసు:- సాలార్ జంగ్ బిల్డింగ్, హైదరాబాద-దక్షిణ.
బ్రాంచీలు:- కింగ్సువే, పాత జేలుపీధి, శికిందరాబాద్.
వరంగల్. ఔరంగాబాద.